
కమలాకాంత్

# ముగింపు లేని కథ



వికాస ధాత్రి

# ముగింపు లేని కథ

కథల సంపుటి

## కమలాకాంత్

వికాస ధాత్రి

Mugimpu leni Katha
Collection of Short Stories
By Kamalakanth

Vajha Sita Rama Sarma
C-303, Runwal Estate, Near Lakim Company
Goadbunder Road, Thane West
400607 Maharashtra
Ph: 9920294346

First Edition:
July 2014

Copy Right: Vajha Sita Rama Sarma

Published by:
Vikasa Dhatri
1-122, Shivalayam Street
Jampani Post, Vemuru Mandal
Guntur Dt, Andhra Pradesh
PIN: 522 261

Ph: 9440994244
Email: contact@vikasadhatri.org
www.vikasadhatri.org

Download Telugu Books free from
WWW.VIKASADHATRI.ORG

# అంకితం

భవసాగరాన్ని దాటడంలో
నిరంతరం శ్రమిస్తూ .. ..
ఆదర్శాలను వీడక కృషి చేస్తూ...
నాతోబాటు అలుపెరుగని
ప్రయాణం చేస్తున్న
నా భార్య కమలకు
ప్రేమతో ... ...

వరఘా సీతారామ శర్మ
(కమలాకాంత్ )

## ఈ సంపుటిలో .... ....


| | |
|---|---|
| 1. సృష్టి కిరణం | 9 |
| 2. సముద్రం | 17 |
| 3. మంటలు | 24 |
| 4. విరహావరోహణం | 29 |
| 5. ఏడ్చి నవ్విన కథ | 31 |
| 6. వర్షంలో నేనూ అతనూ | 41 |
| 7. బళ్ళు - ఓడలు | 44 |
| 8. పిరమిడ్ | 50 |
| 9. భవ బంధాలు | 55 |
| 10. ముగింపు లేని కథ | 62 |
| 11. డెవిల్ ఇన్ డిజ్‌గైజ్ | 68 |

ముందు మాట

# కాలదోషం పట్టని కథలు

దిగంబర కవిత్వోద్యమం తెలుగు సాహితీ లోకాన్ని ఒక ఊపు ఊపిన తర్వాత, పైగంబర కవులు తెర మీదికొచ్చారు. వారిలో ఒకడు - ఈ కథా సంపుటి కర్త కమలాకాంత్.

1965లో అనుకుంటాను మా మొదటి పరిచయం. అన్నపానాదులూ, ఊపిరీ అంతా సాహిత్యమే అయి బతికిన రోజులు అవి. కమలాకాంత్ స్వయంపాకం మనిషి. చింతనాపరుడు. పలికేది తక్కువ. పలికే వాక్యంలోనూ నిష్కల్మషమైన భోళాశంకరుని విలక్షణమైన నవ్వు. మాటల్లో చేతల్లో చిత్తశుద్ధి ఎక్కువ. ఇతరుల్ని నొప్పించటం అసలే ఎరుగని మనిషి.

మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబం ఎత్తుపల్లాల గతుకుల బాటలో పడుతూ లేస్తూ ఎదిగిన వాడు కమలాకాంత్. నేనూ ఆ కోవలో వాడిని. ఒకే గూటి పక్షుల సారూప్యతతో దగ్గరైనాము. బందరు మిత్రులందరితోనూ హృదయ సాన్నిహిత్యాన్ని బాగానే పెంచుకున్నాడు. అందరికీ ఆత్మీయుడైనాడు.

పైగంబర కవుల సాహితీ ప్రస్థానం, వారేం ఆశించి ఏం సాధించారో సాహిత్య చరిత్రలో వున్నది. అదే సమయ పరిచ్ఛేదంలోనూ, ఆ తర్వాతి కాలంలోనూ - కథా రచనలో బాగానే కృషి చేశాడు కమలాకాంత్. ఆ కృషి ఫలం - ఇదిగో ఈ కథా సంపుటి.

ఇప్పుడీ కథల గురించి ముచ్చటించుకుందాం.

ఈ దేశంలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి మనుషుల పరిస్థితి సజావుగా లేదు. అనేక సమస్యల గంపని నెత్తికెత్తుకుని, చెప్పుల్లేకుండా మండు వేసవిలో తార్రోడ్ల మీద నడుస్తున్నారు వాళ్ళు. అభివృద్ధి ఫలాలు నిజంగా అందని 'జనం' వీళ్లంతా! వాళ్ళ బతుకు బాధల్నీ, గాథల్నీ, వాళ్ళ తలరాతల గీతల్నీ, వారి దుర్భరమైన స్థితినీ, గతినీ - తానుగా శ్వాసించీ, అనుభవించీ (కూడా) సంయమనంతో చిత్రించాడు కమలాకాంత్.

'ముగింపు లేని కథ' చూడండి. పంతులు భుజాన జంజప్పోస వుండి, చేతిలో కాసులేని నిరుద్యోగి. ఉద్యోగపుటాశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడి మిట్టాడి, చివరికి ఉపాధి అందని మ్రాని పండని తేలిపోయిన తర్వాత, అయిన వారి చేత కాని వారి చేతా కావలసినంత నిరాదరణ పొందాడు. 'బతుకంటే వెగటు పుట్టింది.' చచ్చిపోవాలని అర్థరాత్రి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. అదీ సాగలేదు. పని కాలేదు. ఇంటిల్లపాదీ లేచి ఏడుపులూ శోకాలూ మొదలెట్టారు. బందీ బందీగానే వున్నాడు! తెల్లవారింది. పోస్ట్ మన్ వచ్చాడు. ఉద్యోగం ఆర్డరే

వచ్చిందేమోననే ఆశ లేచింది! కానీ, తన అనర్హతకి కారణం తెలుపుతున్న ఉత్తరం అది! పంతులు బతుకు గాథ ముగింపు లేని కథ కాక మరేమవుతుంది!

ఇలాంటి మరో చిరుద్యోగి శంకరం కథ - 'జీవన స్పర్శ'. అతనూ భవబంధాల్ని తెంచుకుని ఇంటి నుంచీ వెళ్ళిపోదామని ఉద్యుక్తుడవుతుంటే భార్య ప్రసవించిందని కబురు! పుత్రోదయానందం! 'బాబు ఎలా వున్నాడో, వెళ్ళాలి. చూడాలి' అనుకున్నాడు! అడుగు ఎటు వెళుతుందో తెలిసింది. జీవన లాలస చేసే వింత విన్యాసానికి అద్భుతమైన కథాత్మక చిత్రణ!

ఇవి మామూలు నిరుద్యోగి కథలనిపిస్తాయి. కానీ రచయిత కథాకథన నైపుణ్యం వలన, చదివిన తర్వాత గుండెలో వో మూలన ఆర్తి బయల్దేరుతుంది. 1966 పరిస్థితులు ఈనాటికీ అలాగే 'నిలిచి' ఉన్నందుకు అలజడి రేగుతుంది. మనం రోజూ చూస్తున్న ఒక సమూహం యొక్క ఛిద్ర జీవనం లోని ఒక పార్శ్వం ఎఱుకలోకి వస్తుంది. ఈ అనుభూతి వ్యథ ప్రతిఫలనం కాగ్నిటివ్‌గా మేథలో కుదురుకుని ముందడుగుకి చోదక శక్తినిస్తుంది. ఇదే కథ ఆశించే ప్రయోజనం.

'మంటలు' కథలో రాజకీయం వికృత రూపం జూలు విదిల్చి అమాయక ప్రాణుల్ని బలిగొనే దుర్మార్గాన్ని ఆవిష్కరించాడు కమలాకాంత్.

'సముద్రం' నిజంగానే గంభీరమైన కాల్పనిక వాస్తవికతని అలదుకొన్న కథ. తమకు అన్యాయం చేసి అన్న ఉమ్మడి ఆస్థిని అమ్ముకు తిన్నాడని శతథా పోరింది తల్లి. తమ్ముడు గ్రామానికి వెళ్ళాడు. అన్న కుటుంబం ఉన్న దయనీయమైన పరిస్థితిని కళ్ళారా చూశాడు. మాట పెగల్లేదు. అసలు విషయం ప్రసక్తి చేయకుండానే తిరిగి వచ్చేశాడు. తల్లికి ఏమీ చెప్పడు. ఆమెకు ఇతని తత్వం, స్వభావం తెలుసు. ఏం జరిగిందో అర్థం చేసుకుంటుంది. ఏమీ అడగదు. అలా మూడు ప్రధాన పాత్రలూ గుండె లోతుల్లో ప్రేమాభిమానాల, ఆత్మీయతల బడబాగ్నిని భరిస్తారు. చాలా మంచి కథ!

'కుక్క తోక' ఒక జీవిత సత్యాన్ని పునర్వచిస్తుంది. సుబ్బులు అల్లరి చిల్లరగా తిరిగేవాడు. చిన్న దొంగతనాల్నుంచీ క్రమంగా పెద్ద దొంగతనాలకి అలవాటు పడతాడు. ఇదంతా తల్లి పెంపకంలోని ఉదాసీనతా, ఉపేక్షల ఫలితం. సుబ్బులు మేనత్త సాయంతో కడకు చిన్న ఉద్యోగంలో చేరినా సుబ్బులు బుద్ధీ, చోరకళా నైజం మారవు. తన ప్రతాపం వెలగబెట్టి ఊరు వదిలి వెళ్ళిపోతాడు. పుర్రెతో పుట్టిన వంకర బుద్ధి - కుక్కతోకేమో!

మరో చిల్లర దొంగతనాల ఘనుడు 'తోట వీడిన పూవు' కథలో దర్శనమిస్తాడు. అతని పేరు మురళి. అన్నావదినల అండన సోమరిగా తయారైన వాడు. వివాహితుడు! ఇతనికి ఒకనాటి రాత్రి జ్ఞానోదయమై మారదలచుకుని ఇంట్లో నుంచీ ఉడాయిస్తాడు. వెళ్తూ వెళ్తూ భార్య నగ తీసుకుని పోతాడు. పట్నంలో పత్రికాఫీసులో ఉద్యోగాన్ని పొంది - 'పశ్చాత్తాపం' ఉత్తరం రాస్తాడు!

ఇలా విషయం ఒకటిగా అనిపించినా, కథా వస్తు నిర్వహణలో, పాత్ర పోషణలో, సంఘటన సృజనలో, ముగింపులో వైవిధ్యాన్ని చూపాడు రచయిత.

ఊరి పెత్తందార్ల కక్షలూ కార్పణ్యాలూ - పిచ్చిగాడి వంటి కల్లుగీత శ్రామికుల బతుకుల్ని కూడా ఎలా నాశనం చేస్తాయో చెబుతుంది - 'బొమ్మ - బొరుసు' కథ.

'వర్షంలో నేనూ - అతనూ' ఒక చక్కని మనస్తాత్విక కథానిక. కారులో షికారు వెళ్ళిన షోకిల్లా బంగారు పిచ్చుక - కళానిధి - అనూహ్యంగా తుపాను వర్షంలో చిక్కుకున్నాడు. వాతావరణం, పరిస్థితీ, హఠాత్ సంభవాలూ అతన్ని మరణ భీతిలో పడేస్తాయి. అప్పుడు తానంత వరకూ ద్వేషిస్తూ, నిరసిస్తూ, హేళన చేస్తూ వున్న 'జనం' ఉన్న చోటికే ఆశ్రయం కోసం పరుగుదీస్తాడు. సున్నితమైన - 'మనిషి ప్రాణభయం' అంశం ఆధారంగా వచ్చిన మంచి కథ.

'సిస్టర్ ఈ వ్యాధి నయమవుతుందా?' అనే ప్రశ్నతో ఆర్ద్రంగా మొదలయ్యే కథ 'సృష్టి కిరణం'. విధి వంచితురాలైన సువర్చల దీనగాథ. ఆమె కుష్టు వ్యాధిగ్రస్త అభాగ్యురాలు. ఉత్కంఠభరితమైన కథనంతో నిండిన కథ ఇది.

అవసరానికి అయాచితంగా, అనూహ్యంగా లభించిన పర్సులోని డబ్బు కలిగించే అపరాధ భావనతో అవస్థపడిన సత్యం కథ - 'సత్యం వధ'! ఆ పర్సు యజమాని దురదృష్టానికి మనమూ బాధ పడతాము!

ఫలించని ప్రేమతో మిగిలిపోయిన ప్రేమికునికి తన ఆరాధ్య ప్రేయసి శిల్పం రూపంలో దర్శనమిస్తే - 'అన్వేషణ' ఫలించినట్లేనా? భావుకతతో నిండి, కల్పన కాస్తంత ఎక్కువ పాలులో వుండి అలరించే 'అన్వేషణ'లో సమాధానం లభిస్తుంది.

ఇంతకింత భావనాశ్రయంగా సాగిన మరో కథ 'భవ బంధాలు'.

ఇంకా, 'పిరమిడ్'లో రిక్షావాలా, 'బళ్ళు - ఓడలు'లో పోలీస్ వీరాస్వామి, 'తొలి కోడి కూసింది'లో వేశ్య లచ్చి, 'సైలెన్సర్స్'లో వేశ్య, ఆమె సహాయక బృందం - అభాగ్యులంతా, అనాథలంతా వారివారి బీటలు వారిన జీవన భూమికల్ని మనకు పరిచయం చేస్తారు. దీనికి విపర్యయంగా 'స్థాన భ్రంశం'లో తాత కాబోతున్న మూర్తిగారి ప్రహసనం, 'కెంపులూ - మందారాలూ'లో కొత్త దంపతుల సాంసారిక ప్రణయ హేళీ, కథా రచన పోటీలో చచ్చీ చెడీ బహుమతి పొందగలిగిన రచయిత సుబ్బారావు 'ఏడ్చి నవ్విన కథ' - మంచి ప్రహసనాలుగా ఆహ్లాదపరుస్తాయి.

కమలాకాంత్ కథల్లోని వస్తు వైవిధ్యానికి ఇవి కొన్ని ఉదాహరణలు. ఈ వైవిధ్యంలోని అంతస్సారమంతా రచయిత సమాజాన్ని భిన్న కోణాల్లో, భిన్న పార్శ్వాల్లో అధ్యయనం చేయటం వలన సిద్ధించింది. కొంత స్వానుభవ ప్రతిఫలనంగానూ వచ్చింది. కథలన్నీ కమలాకాంత్ తన చుట్టూవున్న మనుషుల్నీ, పరిస్థితుల్నీ, సంఘటనల్నీ పరిశీలించినప్పుడు అతనికి కలిగిన మానసిక స్పందనలే.

కాగా, శిల్పపరంగా ఈ కథల్లో వున్న అనేక గుణ విశేషాల్నీ చెప్పుకోవాలిగానీ, ముందుమాట 'పరిమితి' ఇబ్బంది పెడుతోంది. అయినా, ఒకటి రెండు ముఖ్యాంశాల్ని ప్రస్తావిస్తాను.

కథల ఎత్తుగడలన్నీ ఉత్కంఠ ప్రేరకంగా ఉన్నాయి. కొన్ని వాతావరణాన్నీ, నేపథ్యాన్నీ వర్ణించటంతో మొదలైతే, కొన్ని పాత్ర స్వరూప స్వభావ వర్ణనతో మనల్ని కట్టి పడేస్తాయి. (బొమ్మా బొరుసు మొదటి పేరా చదవండి) కొన్ని కథలు సరాసరి సంఘటనని దృశ్యమానం చేస్తూ ప్రారంభమవుతాయి. (జీవన స్పర్శ)

కథా నిర్మాణంలో కమలాకాంత్ ఎక్కువగా 'నేడు - నిన్న - నేడు' పద్ధతిని అనుసరించాడు. ఈ సమ్మిశ్రిత విధానం వలన కథలన్నీ చదివించే గుణం నిండుగా సంతరించుకున్నాయి.

అన్ని కథల ముగింపులూ - రచయిత ప్రత్యేక కథా నిర్వహణా నైపుణ్యాన్ని తెలుపుతున్నాయి. కథా ప్రయోజనాన్ని ప్రోది చేసేట్టు వున్నాయి.

కమలాకాంత్ కథారచనా వైశిష్ట్యాన్ని తెలుపటానికి రెండు ముఖ్యమైన అంశాల్ని మనవి చేయాలి.

ఒకటి : - ఈ కథలన్నిటా కమలాకాంత్ విలక్షణ ముద్ర వున్నది. ఏమిటది అంటే - అది అతను సాధించుకున్న వాడియైన డాక్యుమెంటేషన్ టెక్నిక్. ఒక సన్నివేశాన్ని, ఒక సంఘటనని, ఒక పాత్రని, ఒక నేపథ్యాన్ని, ఒక వాతావరణాన్ని, కథా స్థల కాలాల్ని ప్రజెంట్ చేసేటప్పుడు - ఆయా స్థితిగతులకు అద్భుతమైన దృశ్య స్ఫురణాన్ని కూర్చుతాడు కమలాకాంత్. 'బళ్ళు - ఓడలు', 'పిరమిడ్', 'సృష్టి కిరణం' - వంటి ఎన్నో కథల్ని ఉదహరించవచ్చు.

రెండవది : కమలాకాంత్ కథల్లో ప్రస్ఫుటమయ్యే స్టార్క్ రియలిజమ్. దీన్ని ఈనాటి పడికట్టు పదమైన 'వాస్తవికత'గా కాకుండా - కాల్పనిక సాహిత్య చరిత్రలో ఒక ధోరణిగా విలసిల్లిన అంశంగా చూడాలి. తెలుగు కథా సాహిత్యంలో ఈ 'రియలిజమ్'ని మరీ ప్రముఖంగా పోషించిన శారద వంటి రచయితల కోవలోకి చేరతాడు ఈ కమలాకాంత్!

కమలాకాంత్ కథన శైలిలో ఆర్తీ, అనుభూతీ ప్రధానంగా ప్రవహిస్తాయి. ఆ జాలులో వ్యంగ్యమూ అంతగానే మెరుస్తూ వుంటుంది. గుణగ్రహణ పారీణులైన పఠితలకు ఇవన్నీ ఆస్వాదనీయమైన రుచులే అవుతాయి మరి!

సుమారు 40 ఏళ్ళు సాహితీలోకానికి దూరంగా మసలి, మళ్ళీ ఇవ్వాళ ఈ సంపుటితో పునరాగమనం చేస్తున్న కమలాకాంత్‌ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. మరోమారు కథాసాహిత్య చైతన్య యాత్రని చేపట్టమని కోరుతున్నాను.

శుభాకాంక్షలతో,

విహారి

హైదరాబాద్

27 మే 2014.

● ● ●

# నా మాట

1965లో శ్రీ విహారి గారితో నా మొదటి పరిచయం. ఈ నాటికీ మా స్నేహితం పటిష్టంగానే వుంది. 1968లో బందర్లో మా కుటుంబం క్లిష్ట పరిస్థితుల్లో సతమతమవుతున్నప్పుడు చేయూతనిచ్చి మమ్మల్ని గట్టెక్కించిన మా శ్రేయోభిలాషి విహారి. నేను కైకలూరు పోస్టాఫీసులో టెలిగ్రాఫిస్ట్‌గా వున్నప్పుడు ఆదివారాలు బందరు వచ్చే వాడిని. విహారిగారింట్లో ఆప్యాయత కలేసిన భోజనం తరచూ రుచి చూసేవాడ్ని. వారి ఆప్యాయత, అతిథి మర్యాదలతో నాకు ఒక మర్రిచెట్టు నీడన సేద తీర్చుకుంటున్నట్లుండేది. బందరు టౌన్ లైబ్రరీలో ఆయన తరచూ చేసే సాహితీ ప్రసంగాలు వినే వాడిని. అప్పుడే అనుకొన్నాను ఈయన మామూలు మనిషి కాదనీ, గొప్ప రచయిత అనీ, మేధావి అనీ, ఆగామికాలపు మహా కథకుడు అనీ. అనుకున్నట్లే విహారికి ఎన్నో పురస్కారాలు లభించినై. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. విహారి గొప్ప ఆత్మ సంస్కారం గల మహా మనిషి. ఆత్మ పరిశీలన, ఆశావాదిత్వం, తోటి మనిషిపై అచంచల విశ్వాసం గొప్పగా వున్న మనిషి. జీవితాన్ని, ఆంధ్రాంగ్ల సాహిత్యాల్ని క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకున్న అనుభవశాలి, మేధావి.

1974లో ప్రమోషన్ వచ్చి మహారాష్ట్రలోని అమరావతికి, ఆ తర్వాత 1976లో ముంబాయికి బదిలీ అయింది నాకు. విహారిగారి మాటల్లోనే చెబితే బాగుంటుంది.

పెళ్ళానికి మల్లెలు, మొల్లలు లేవు
అమ్మకి అరటి పండూ లేదు
కూతురికి నోటుబుక్కూ రాదు
ఖర్చు ఈజ్ ఈక్వల్ టు కనీస ఆదాయం
సమీకరణం... దాయ్... దాయ్... చందమామ.....

ఋణ శేషం కోసం 7 X 24 (ఏడు రోజులూ ఇరవై నాలుగు గంటలూ) బతుకు దారుణ క్లేశం.

అలా... అలా... బతుకుతూ ఆ ఈక్వేషన్స్‌లో ఇలా... ఇలా... జీవితం దొర్లిపోయింది చాలా వేగంగా. తెలుగు సాహితీ లోకానికి దూరంగా ఈ ముంబాయి కాంక్రీటు జంగిల్లో మారుబడిపోయి సరిగ్గా నలభై సంవత్సరాలు అయిపోయింది. ఇలా జరిగిందంతా మార్చలేనంత తప్పిదం.

ఈమధ్య కాలంలో విహారిగారూ నేనూ రెండు మూడు సార్లు ముంబాయిలోనే కలిసే అవకాశం లభించింది. ఆయనా ముంబాయిలో కొన్నాళ్ళు ఉద్యోగరీత్యా వున్నారు. వారు పనిచేసిన ఎల్ఐసిలో తన అపారమైన అనుభవం, జీనియస్‌ల చెరగని

ముద్ర వేసి వెళ్ళారు. ఒకసారి శాంతాక్రజ్, ఖార్ మధ్య గార్డెన్స్‌లో కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు నువ్వు ఐడియలిస్టువి అన్నమాట అన్నారు. ఏదో ముంబాయిలోని మనుష్యుల గురించి మాట్లాడుతూ నవ్వించేవారు. ఆ మహా రచయిత నా ఆత్మీయ మిత్రుడని సగర్వంగా చెప్పుకొంటున్నాను.

కథా రచనలో ఆయన నా గురువు గారు. నన్నూ నేను వ్రాసిన కొద్దిపాటి రచనలను నా వ్యక్తిత్వాన్నీ అభిమానించే విహారి అనే అబుణాబుణ సూర్యుడికి ముళ్ళపూడి వారి మాటల్లో మీ ఋణం ఎప్పుడూ తీర్చుకోలేను మాస్టారూ...అంటున్నాను. ఇన్నాళ్ళకి నేను రెండు పుస్తకాలు వేయించుకొంటున్నాను ముందు మాట రాసివ్వండీ అని అడిగితే కాల దోషం పట్టని కథలు అని చాల గొప్పగా వ్రాసి ఇచ్చారు విహారి. అయిన వాళ్ళూ కాని వాళ్లూ నా గురించి తెలుసుకోనంత వివరంగా నాగురించి రాసి నన్ను శారద లాంటి గొప్ప రచయితల కోవలో పోల్చిన విహారి గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నాను.

2008లో నాకు శ్రీ గాలి ఉదయ కుమార్ గారితో పరిచయమైంది. ఆయనను ముఖాముఖీగా చూడకపోయినా, ఒకరినొకరు చూసుకోకపోయినా ఈ ఆరేడేళ్ళ నుంచీ నేను వ్రాసిన పుస్తకాలు, మా నాన్న గారి మూడు శతకాలు, శ్రీ సత్య సాయి శతకాలు వారి వికాస ధాత్రి డాట్ ఆర్గ్ వెబ్‌సైట్‌లో ఈబుక్స్‌గా వుంచారు. నన్ను ప్రపంచ తెలుగు పాఠకులందరికీ పరిచయం చేసి కథా సంపుటాలను అందంగా తీర్చిదిద్దిన రచయిత, సాహిత్య కార్యకర్త, వికాస ధాత్రి వ్యవస్థాపకులు అయిన శ్రీ గాలి ఉదయ కుమార్ గారికి నా మనఃపూర్వక ధన్యవాదాలు.

సెలవు...

కమలాకాంత్

థానే, ముంబాయి

27 మే 2014

# సృష్టి కిరణం

"సిస్టర్, ఈ వ్యాధి నయమవుతుందా?"

పదేళ్ళ నుంచి ప్రతి సాయంత్రమూ మాధవిని అడుగుతున్నట్లే ఈ రోజు కూడా అడిగిందామె.

ఆమె సువర్చల....

"తప్పకుండా తగ్గుతుంది. మీరేమీ బెంగపడకండి" - రోజూ చెప్పినట్లే ఈవేళ కూడా ధైర్యం చెప్పింది మాధవి.

అందుకే సువర్చలకు మాధవి అంటే ఇష్టం.

జీవితంలో మసి అయిన ఆశకు తిరిగి జీవం పోస్తుంది. అసహ్యించుకోదు. ఎంతో శ్రద్ధతో తన మొండి వ్రేళ్ళకు కట్లు కడుతుంది. భయంకరమైన ఆ వ్యాధి అంటే లెక్కలేనట్లు నిర్లిప్తంగా తన కర్తవ్యం నిర్వర్తిస్తుంది. మాధవి ఉండబట్టే ఈ దుర్భరమైన క్షణాల్లో జీవిత వృక్షానికి ఆశాలతలా వ్రేలాడుతూ రోజులను వెళ్ళదీయగలుగుతున్నది.

సువర్చల చూపులు మరల్చుకుంది. అస్తమయ సూర్యుని అంతిమ కిరణాలు హాస్పిటల్ లాన్స్‌లో యూకలిప్టస్ చెట్లను దూసుకుని, కత్తిరించిన క్రోటన్స్ మొండితలల మీదనుంచి ఎగిరి గంతేసి, బోగన్ విల్లాలను జిల్లుమనిపించి ఫీమేల్ వార్డులో ఆ గది కిటికీ మెష్‌లోంచి సునాయాసంగా దూకి లోపలకి పడుతున్నాయి. పశ్చిమాకాశం పగిలిన వ్రణంలా ఉంది. ఆకాశంలోని రక్తిమను, మొండితలల క్రోటన్స్‌ను పదేపదే చూస్తూ సువర్చల తన చేతులు, కాళ్ళ వైపు దృష్టి మరల్చుకున్నది. తన కాళ్ళూ చేతులూ మొండివి.

ఆ లాన్స్‌లోని క్రోటన్స్ లాగానే కాళ్ళకూ, చేతులకూ సగం సగం ఊడిపోయిన వ్రేళ్ళు - గోళ్ళు ఊడి, మాంసం కుళ్ళి పొలుసులు పొలుసులుగా ఊడిపోతున్న సగం తెగిన వ్రేళ్ళు - లాన్స్‌లోని క్రోటన్స్‌లాంటి వికృతమైన మొండివ్రేళ్ళు -

వారం రోజుల క్రితం కాళ్ళకూ, చేతులకూ ఆపరేషన్ జరిగింది. కుళ్ళి పాడయిపోయిన వ్రేళ్ళను తీసివేశారు. సిస్టర్ మాధవి కాళ్ళకూ, చేతులకూ బాండేజీ కట్టడం పూర్తిచేసి లేచింది. మల్లెపూవులాంటి తెల్లటి బాండేజీ రక్తం పీల్చుకుని ఎర్రటి మరకలు చేసుకుంటున్నది.

తెగిన క్రోటన్స్‌లాంటి వ్రేళ్ళు - ఆకాశంలో రక్తిమ లాగ తెల్లటి బాండేజీమీద ఎర్రటి రక్తపు మరకలు.

సువర్చల కళ్ళలో నీరు సుడి తిరిగింది. పెదవుల మీద ఆశల చిరునవ్వును చిగురిస్తూ, సువర్చల కన్నీటిని కుడి బొటన వ్రేలితో తుడుస్తూ ఆమె శిరస్సును లాలనగా నిమిరింది మాధవి. ఆ చల్లటి స్పర్శలో మాతృమమకారాన్ని చవిచూడగలుగుతుంది సువర్చల. కృతజ్ఞత నిండిన కళ్ళతో మాధవి వైపు చూసిందామె. అధైర్యపడవద్దని చెబుతున్నట్లు భుజం తట్టి "ఇహ వెళతానమ్మా" అన్నది మాధవి. మాధవి వెళ్ళిపోయింది.

మాధవి వెళుతున్నదంటేనే సువర్చల మనస్సును చీకటి ఆవరించుకొంటుంది. ఆమె

ఉన్నంతసేపు తనపై ఆశాకిరణాల్ని ప్రసరిస్తూంటే, తన గుండెల్లో పరుచుకొన్న చీకటి తాత్కాలికంగా పక్కకు తప్పుకుంటుంది.

చీకటి..... ఈ ఆలోచనలతో ఉలిక్కిపడ్డది ఆమె. బహి ప్రపంచంలోనూ యూకలిప్టస్‌పై నుంచి పడే గుడ్డి వెలుతుర్ని చీకటి పొట్టన బెట్టుకుంది. చీకటి ఆమె అంతఃకరణను మెలి తిప్పి నరకయాతన పెడుతూంది. చీకటి పడగానే ఆమెకు అంతకన్నా భయంకరమైన చీకటిలాంటి గతం గుర్తుకొస్తూంది. ఆనాడు చీకటి రాత్రిలో తన జీవితం తిరిగిన మలుపు, తన అంతఃకరణ చిక్కుకున్న ఒక మెలిక, తన బ్రతుకు పాలిట భయంకరమైన ప్రశ్న గుర్తు వచ్చి, గుండెల్ని పిండిచేస్తూంది. ఇంతలో పక్క గదిలో ఎవరో రోగి సన్నగా ఏడుపు మొదలుపెట్టింది. రోజూ ఆ సమయానికి ఆ గదిలో ఆమె ఏడుస్తూనే ఉంటుంది. 'గుండె నిబ్బరం లేని మనిషి' అనుకుంది సువర్చల.

పద్మవ్యూహంలాంటి మెలికలో చిక్కుకుని ఏ దిక్కూ తోచని రోజున కూడా తను ఏడవలేదు. పదిహేనేళ్ళ క్రితం తల్లి ప్రేమకు కరువైన రోజునా తను ఏడవలేదు. అన్నయ్య పోషణలో ఆయన మమకారం పంచుకుని, ఆయనకు 'చెల్లెలు పెళ్లి' అనే చిక్కు సమస్యను సృష్టించి, ఆ చిక్కులో చిక్కుకుని సతమతమైపోతున్న అన్నయ్య ఇబ్బందులు, ఆర్థిక స్థోమత తనకు తెలిసీ, ఏడవగలిగే తను ఏడవనేలేదానాడు.

కాని ఈవేళ తెగిన క్రోటన్స్‌ని చూస్తున్నా, తలుచుకున్నా తనకు ఏడుపు ముంచుకొస్తూంది. ఇంతటి విషాదంలోనూ సువర్చల పెదవుల మీద చిరునవ్వు విరిసింది. క్షణం క్రితం పక్క గదిలోని రోగిని అనాలోచితంగా 'గుండె నిబ్బరం లేని మనిషి' అనుకొంది. పరిస్థితులు మనిషిని ఏడిపించటం సహజం!

గదిలోని లైట్లు వెలిగినాయి. సువర్చల ఆలోచన తెగింది. తోటలోంచి ఒక్కొక్కరూ లోపలికి వస్తున్నారు. ఒకరికి కాలి వ్రేళ్ళు లేవు. మరొకరికి చేతి వ్రేళ్ళు లేవు. మరొకరికి ముక్కు లేదు.

బ్రహ్మదేవుడికి విసుగు పుట్టి పూర్తి చేయక వదిలివేసిన శిథిల శిల్పాలు! సృష్టికర్త చిత్రిస్తూ వదిలివేసిన అసంపూర్ణ చిత్రాలు! అంతా ఈ జన్మలోనో, పూర్వ జన్మలోనో మస్తుగా పాపం చేసుకొన్నవారు! అశాశ్వత జీవితంలో అసంతృప్తి వలయాలు!

కిటికీ మెష్‌లోంచి లోపలికి కారుతున్న పలుచటి చీకటిలోకి చూస్తూ ఉండిపోయింది సువర్చల. చీకట్లో మసకమసకగా, ధైర్యంగా, అచంచలంగా నిలబడి ఉన్నాయి తలలు లేని క్రోటన్సు. ఎదుగూబొదుగూ లేని జీవితంలో కూడా ఎనలేని ధైర్యం. అసంపూర్తి జీవితంలో అనంతమైన పోరాటం 'మీ ధైర్యానికి మా జోహార్లు' అంటున్నట్లు ఉన్నతంగా, ఉల్లాసంగా ఊగిపోతున్నాయి యూకలిప్టస్ చెట్లు.

పక్క గదిలో రోగి రోదన స్వరం శ్రుతిమించింది. సువర్చలకు మనసంతా కలచినట్లయింది. అస్తిమితంగా లేచి బెడ్‌మీద కూర్చుంది. ఈ హాస్పిటల్‌లో రోజూ ఇలాంటి ఏడుపులూ, పెడబొబ్బలూ వినటం తనకేమీ కొత్త కాదు. అయితే ఈ రోగి ఏడుపులో ప్రత్యేకత ఉంది. ఆమె ఏడుస్తూనే, అంతలో ఆ ఏడుపు ఆపి ప్రశాంతంగా పడుకుంటుంది. మళ్ళీ కొన్ని క్షణాల్లోనే కాలిలో గుచ్చుకున్న ముల్లును సూదితో కదిలిస్తే అరిచినట్లు హఠాత్తుగా ఏడుపు ప్రారంభిస్తుంది. 'పాపం ... .. ఆమె శారీరక బాధ అలాంటిది కాబోలు' అనుకొంది సువర్చల. ఇంతలో ఆమెకు బూట్ల టకటక శబ్దం వినిపించింది. సువర్చల పక్కకు చూసింది. ఫ్లారెన్స్ ఆ రోగి గదిలోకి విసురుగా వెళుతూంది, తనలో తను ఆమెపై విసుగుదలను ప్రకటిస్తూ. ఫ్లారెన్స్‌కూ, మాధవికీ స్వరూప స్వభావాల్లో ఎంతో భేదం.

మాధవి మాలతీలతలా సుకుమారంగా ఉంటే, ఫ్లారెన్స్ మొరటుగా ఉంటుంది. మాధవి కళ్ళలో ప్రేమజ్యోతి ప్రకాశిస్తూంటుంది. ఫ్లారెన్స్ నేత్రాల్లో విసుగు, క్రోధం గోచరిస్తాయి. మాధవి ముఖంలో ప్రశాంతం, నైర్మల్యం తొణికిసలాడుతుంటే, ఫ్లారెన్స్ ముఖం ఎప్పుడూ మటమటలాడుతూ, భ్రుకుటి సంధించిన ధనుస్సులా ఉంటుంది. మాధవి ఒక వెన్నెల కిరణం. ఫ్లారెన్స్ ఒక చీకటి రేఖ.

ఫ్లారెన్స్ ఆ రోగి దగ్గరకు వెళ్ళి ఆమె మీద కసురుకోవటం వినిపిస్తూనే ఉంది సువర్చలకు. అందుకనే ఆమెకు ఫ్లారెన్స్ అంటే అయిష్టం! ఫ్లారెన్స్ మాటలు, తిట్లు వినటం ఇష్టం లేక బెడ్ మీద పక్కకి తిరిగి కూర్చుని లాన్‌లోకి చూడసాగింది సువర్చల.

లాన్స్‌లో మెర్క్యురీ బల్బు వెలుతురులో పచ్చగడ్డి పరుపు వింతహొయలు పోతూంది.

పచ్చటి గడ్డి పరుపు - తనూ ఓనాడు తన జీవితం ఈ గడ్డిపరుపులా పచ్చగా ఉంటుందని ఊహించి ఆనందించింది.

అకస్మాత్తుగా అదృష్టం వరించి కలవారింటి కోడలయినప్పుడు తన జీవితం మూడు పువ్వులూ ఆరు కాయలుగా గడుస్తుందనీ, తాను కన్న బంగారు కలలు నిజమౌతాయనీ తనూ అనుకొంది.

కాని, ఆ పచ్చగడ్డి మెరుపు ఎన్నాళ్లు? - వేసవి గాడ్పుకు వెలాతెలా పోదూ? -

తన జీవితంలోనూ అలాగే జరిగింది. తన ఊహలూ, స్వప్నాలూ క్షణంలో చెదరిపోయాయి. మెరుపులా మెరిసి తొలగిపోయింది తన తొలకరి కాపురం.

గుండెల్ని ఝల్లుమనిపిస్తూ కారు హారన్ వినిపించింది. సువర్చల తుళ్ళిపడింది. హాస్పిటల్ కాంపౌండు కావల చీకట్లో, చీకటిలాంటి తారురోడ్డు మీద దూసుకుపోతూంది కారు. దాని వెనుక డేంజర్ లైటు భగ్గున మండుతూంది. సువర్చల గిరుక్కున దృష్టి మరల్చుకుంది.

ఎర్రదనం చూస్తే తన గుండెల్లో మంటలు మండుతాయి. ఎక్కడన్నా ఎర్రటి మంట కనబడితే వణికిపోతుంది.

హాస్పిటల్‌లో చేరిన కొత్తలో గదిలో జీరో వాట్ బల్బు ఎరుపు రంగుది ఉండేది. పక్కమీద లేతమందార పూవులాంటి రగ్గు ఉండేది. వాటిని మార్పించి పచ్చటి రగ్గూ, పచ్చటి జీరోవాట్టు బల్బూ తెప్పించుకుంది రూమ్‌లోకి.

ఎరుపు కనపడితే, 'గతం' కురుపు సలుపుతుంది. ఎర్రదనం చూస్తే స్మృతివ్రణం ఠాప్ మని చితుకుతుంది. చితికేది, చిందేది ఎర్రటి రక్తమూ, తెల్లటి చీమూ. అవే గతపు బాధా, గాథా. అప్పుడూ ప్రత్యక్షమయ్యేది ఎర్రదనమే. అందుకేనేమో సృష్టి కిరణంలో నిగూఢంగా దాగి ఉన్నది ఎరుపు.

ఎర్రదనం పాతికేళ్ళ గతం గోతిని తవ్వుతుంది. మనస్సు ఒక సినిమా స్కోపు తెర అయి కూర్చుంటుంది. దానిపైన - పదేపదే తనను వెంటాడి వేధించే ఆ రోజు, ఆ నాటి సువర్చల -

ఆ సువర్చలకూ, తనకూ ఎక్కడా సామ్యం లేదు. ఆ సువర్చల ఒక పుత్తడిబొమ్మ. సర్వావయవ సౌందర్య విలాసిని. తాను ఒక పుచ్చిన చెక్కబొమ్మ. ఆమె ఒక దేవకన్య. తానొక దైవోపహతురాలు.

ఆనాటి సువర్చలలో లేమిడిలోంచి బయటపడగా కలిగిన కలిమిలో సంతృప్తి, తెల్లనివన్నీ పాలు అనే అమాయకత్వం, భర్త నిరాడంబరతకు, సహృదయతకు తొణికిసలాడే కృతజ్ఞత, అర్పణ - అన్నీ ఉన్నాయి. వెరసి - ఆనాటి సువర్చల ఒక దేవత.

ఆరోజు - ఇదే చీకటి రాత్రి - ఇల్లు చక్కబరచుకుని రోగిష్టి అత్తగారికి అన్నీ అమర్చి పడకగదిలోకి వచ్చిన సువర్చలకు ఎదురయింది పల్చటి చీకటి.

జీరో వాట్టు గుడ్డి వెలుతురులో భర్త పాదాలకు మేజోళ్లు ... ఎర్రటి మేజోళ్లు.

'పాపం, పిచ్చివారు. ఏమి అలవాటో... తన సుఖం తనకే తెలియదు' అనుకుంటూ మేజోళ్ళు వలిచింది సువర్చల.

స్వార్థానికీ, కుత్సితానికీ ప్రతీకల్లా మొండి పాదాలు.... పాదాలకు మొండి వ్రేళ్ళు. పొలుసులు పొలుసులుగా ఊడిపోతూ విషపు రక్తం అద్దకం చేసుకున్న కట్ పీసెస్ లాంటి వేళ్ళు! తెగిపోయిన క్రోటన్స్‌లాంటి వేళ్ళు!

తరవాత ఉలిక్కిపడి మేల్కొన్న భర్త - అతని కళ్ళలో పిరికితనం, స్వార్థం, కుత్సితం, బయటపడిన క్షణపు సిగ్గు -

అటుతరవాత తెచ్చిపెట్టుకున్న డాంబికం. బయటపడిన చేదులాంటి నిజాన్ని సమర్థించుకోవాలనే విఫల ప్రయత్నం, చివరికి క్షమించమని వేడికోలు.

"ఏమిటి, సువర్చలమ్మా, కూర్చునే ఉన్నావా?" ఆ గదిలోని మిగతా ఇద్దరు పేషెంట్లూ బయటనుంచి వచ్చారు.

గతం రీలు తెగిపోయింది. "ఆ - ఎప్పుడొచ్చారు మీరు?" ఎదురు ప్రశ్న అసంగతం. కట్లు కట్టిన మొండి హస్తాలతో, సొట్టలు పడ్డ ముక్కు గోక్కుంటూ వాళ్లలో ఒకామె అడిగింది "ఇవాళ తోటలో అరటి చెట్టుకు పిలక పుట్టింది. చూద్దురుగాని, రేపు మీరు వస్తారా?"

"ఆ వస్తాను" సువర్చల మనస్సులోని మబ్బులు ఘనీభవించి కంట్లోంచి వర్షం కురిసింది.

అరటి చెట్టుకు పిలక. ..

మళ్ళీ మనోయవనిక.. .. దాని మీద క్రమక్రమంగా పెద్దదవుతున్న గతం బొమ్మ -

వంశం అంతటితో అంతం కాకుండా ఉండాలని తాను చేసిన వంచనకు, తనను క్షమించమని భర్త ప్రాధేయపడుతున్న దృశ్యం కదలిపోతూంది.

తన హృదయంలో పెనుతుఫాను రేగింది. ధర్మం, అధర్మం, న్యాయం, అన్యాయం, మోసం, కక్ష, ప్రతీకారం - విభిన్న శక్తులు తనలో విజృంభించాయి. కర్తవ్యం తోచక మనస్సును మండించుకుని ఆ సంఘర్షణలో నలిగిపోయింది తాను. వీటన్నిటి మధ్య తన కట్టెదుట నిలిచిన రూపం - అరటిచెట్టు పిలక!

తన స్త్రీత్వం సఫలత పొందింది. భర్త వంశక్షయ భీతి నశించింది.

కాలం ఒక సంవత్సరాన్ని తనలో కలుపుకుంది.

పుట్టిన బిడ్డడు భర్త హృదయంలో సంతోష దీపాలు వెలిగించాడు.

"ఈ చీకట్లో, ఉక్కలో కూర్చోకపోతే అలా తోటలోకి రాకూడదమ్మా!"

"వస్తానులే. రేపు మీతో వచ్చి అరటిపిలక చూస్తాను" నిర్లిప్తంగా సమాధానం చెప్పింది సువర్చల.

చీకట్లో కూర్చుంది తాను. సువర్చల తనలో తను పేలవంగా నవ్వుకుంది. తన జీవితంలో చీకటికి ఎంతటి ప్రాధాన్యం లేకపోతే చీకటిని ప్రేమించగలుగుతుంది?!

బాబు వెలిసిన సంవత్సరానికి -

మరో చీకటి రాత్రినే - చలపతి పక్క ఖాళీగా వెక్కిరించింది. దిండు కింద దొరికిన ఉత్తరం 'చలపతి ఇక కనపడడు' అని నిక్కచ్చిగా చెప్పింది.

'జీవితంలో నాకు మరే కోరికా లేదు. ఒక్క కోరికా - వంశక్షీణ భీతి తీరింది. ఇహ ఉండడంవల్ల మరెలాంటి తృప్తీ లేదు.' చలపతి వ్రాతలో నిజం లేకపోలేదు!

అప్పటివరకూ దాచివుంచిన భయంకర సత్యం అన్నయ్యకు తెలియక తప్పింది కాదు.

'తను నిర్వాకం చేసిన పెళ్ళి ఇలా, ఇంత చక్కదనంగా ఉంది. సువర్చల జీవితాన్ని నరకంగా మార్చాను' అన్నయ్య వేదనను అర్థం చేసుకుంది తాను.

'చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకోడం మనుషుల అలవాటు.' బాబుతోపాటు అన్నయ్య పంచన చేరింది. కొన్నాళ్ళు గడిచినాయి.

మొదటినుంచి తన జీవితంలో చీకటి రాత్రులు భయంకరమైన సంఘటనలను సృష్టిస్తూనే ఉన్నాయి.

బాబుకు నాలుగేళ్ళప్పుడు రోగిష్టి అత్తగారు పోయింది. పోతూ ఒక విచిత్రమైన సత్యాన్ని బహిర్గతం చేసిపోయింది.

"చలపతి నాకు పుట్టిన కొడుకు కాడు. మాకు సంతానం లేదు. ఎవర్నయినా దత్తత చేసుకోవాలని చూశాము. అప్పట్లో ఇంతగా కలిగిన కుటుంబం కాదు మాది. అందువల్ల ఎవ్వరూ తమ పిల్లల్ని దత్తత ఇవ్వటానికి అంగీకరించలేదు. 'అన్యథా శరణం నాస్తి' అని అనాథ శరణాలయంనుంచి తెచ్చుకున్నాం చలపతిని. కాలక్రమేణా తన తల్లిదండ్రుల వ్యాధిని సంక్రమింపజేసుకున్న నిర్భాగ్యుడైనాడు చలపతి. పెంచిన మమకారాన్ని చంపుకోలేక చలపతి కోసం, మాకోసం నీ జీవితాన్ని బలి చేశాము."

'పెంచిన మమకారం.. ..! మరొక అమాయక యువతి జీవితంతో ఆడుకోవటానికి వెరవనీయని మమకారం! .. . సువర్చల పెదవులు కోపంతో బిగబడినాయి.

"ఆర్చీ ప్రక్కన ముద్దగులాబీ మొదలుని ఏదో పురుగు తినేసిందట. ఒకే పువ్వు పూసింది. చచ్చిపోయింది. ఇదిగో పువ్వు. ఈ 'వాజ్'లో పెడుతున్నా" అన్నది మరొకామె.

సౌందర్యవంచితులయినా, అందాన్ని ఆరాధించి ఆనందించే మనస్సుగలవాళ్ళు!

నిజమే - మొక్క మొదట్లో విషబీజం వ్యాపిస్తే, చెట్టు చెడిపోయింది. పూసిన పూవు దూరమయింది. చెట్టుతో పాటు ఎండి మోడయిపోకుండా.

బాబుకు పదిహేడేళ్లప్పుడు తన లోపల వ్యాపించి ఉన్న విషం కొద్దిగా బహిర్గతమైంది. రోగ లక్షణాలు తన శరీరంలో పొటమరించసాగాయి.

మున్ముందు ఆ విషం బాబుతోసహా అందరికీ వ్యాపిస్తుందేమోనని తల్లడిల్లిపోయింది తాను. అందుకనే, ఆనాటి చీకటి రాత్రి భయంకరమైన నిర్ణయానికొచ్చింది తాను.

చలపతి తనకు దూరమైన పద్ధతిలోనే తనూ బాబుకూ, అన్నయ్యకూ దూరమయింది.

తరవాత రెండేళ్లు దేవుడు వెలిసిన ప్రతి పుణ్య స్థలమూ చూసింది.

వ్యాధి ముదిరి తనను హాస్పిటల్‌లో చేర్చింది.

వ్యాధి హెచ్చుతూంది. తగ్గుతూంది. హెచ్చి తగ్గుతూంది. తగ్గి హెచ్చుతూంది. కారణం - డాక్టర్లు పోసే మందులూ, అంతకుమించి మాధవి పోసే ఆశామృతం!

"బ్రెడ్ తీసుకోరూ!" సువర్చల ప్రక్కకి చూసింది. ఎదురుగా మాధవి!

పాలగ్లాసును స్టూలు మీద ఉంచి సువర్చల చేతికి రొట్టెను అందించింది మాధవి. సువర్చల బయటికి చూడసాగింది.

ఎదురుగా మెష్ - అవతల లాన్‌లో చీకటిని 'డైల్యూట్' చేస్తున్న చంద్రుడి కాంతి ప్రవాహం.

నిండుగా ఎదగాలని, సంపూర్ణత సాధించాలని నిండయిన ఆశతో పైకి చూస్తూ వెలుతురును

తాగుతున్న మొండితలల క్రోటన్సూ - యూకలిప్టస్ చెట్లకు పక్కన జాజిమల్లెల తీగకి సైగగా కన్నుమీటుతున్న ఆశాతారక -

"మాధవీ, ఆ క్రోటన్సును ఎందుకలా కోసేస్తారు? వాటికి పెరిగే స్వేచ్ఛను ఎందుకివ్వరు?" క్రోటన్సుపై నుంచి దృష్టి మరల్చకుండానే అడిగింది సువర్చల.

"వాటిని కత్తిరిస్తేనే బాగుంటాయమ్మా! అవి అలా ఉంటే మనకు ఆనందం, మన తోటకు అందం!"

'అవును, నిజమే. నాబోటి వాళ్ళు ఇలా ఉంటేం, ఇలా అసంతృప్తితో బాధపడుతుంటేనే ఆ సృష్టికర్తకు ఆనందమేమో!' అనుకున్నది సువర్చల.

"మాధవీ, త్వరగా తగ్గుతుందా నాకు?" నక్షత్రం అందిస్తున్న ఆశాసందేశంతో మళ్లీ అడిగింది.

"మీరేమీ అనుమానపడకండి. త్వరలోనే నయమవుతుంది. జబ్బు కుదరక ఈ హాస్పిటల్ నుంచి తిరిగిపోయినవారు చాలా అరుదు - ఎవరో దురదృష్టవంతులు తప్ప."

"డాక్టర్ శ్రీనివాస్ అర్జంటుగా రమ్మంటున్నారు, మాధవమ్మా!" ప్యూను వచ్చి పిలిచాడు. మేల్ వార్డులో ఎవరో పోయారట!

సువర్చల హఠాత్తుగా ఇటు తిరిగింది. ఆమెలో ఆశ్చర్యం, ఉద్వేగం గోచరించాయి మాధవికి.

"డాక్టర్ శ్రీనివాసెవరు, మాధవీ!" సందిగ్ధమైన ఆంతర్యంతో, ఆశ చిప్పిలుతున్న నేత్రాలతో అడిగింది.

"కొత్తగా ఇవాళే చేరారు. చాలా అనుభవమూ, తెలివీగల డాక్టర్. బ్రెడ్ తీసుకుంటూండండి. మళ్లీ వస్తా." గబగబా వెళ్ళిపోయింది మాధవి.

సువర్చలకు బ్రెడ్ రుచించలేదు. మనస్సులో ఆలోచనల వలయాలు.... సీలింగ్ ఫాన్ సుతిమెత్తని సవ్వడి చేస్తూ పరిభ్రమిస్తూంది.

మెష్ అవతల మొండితలల క్రోటన్సు - ఉన్నతంగా యూకలిప్టస్ చెట్లు - జాజిపూల ఆర్చీ - మీదుగా తొంగిచూస్తున్న ఒంటరి నక్షత్రం! క్రోటన్స్‌లాంటి తుంపులు తుంపులయిన ఆలోచనలతో కొట్టుకుపోసాగిందామె.

మేల్ వార్డులో పోయిన ఆ నిర్భాగ్యుడెవరో!

డాక్టర్ శ్రీనివాసట!

శ్రీనివాస్ - ఆమె అంతఃకరణ ముక్కలుముక్కలవుతూంది. డాక్టర్ తనలో ఏదో భావసంచలనాన్ని సృష్టిస్తూంది! పైగా, డాక్టర్ రోజూ ఉండేవాడే ఇక్కడ. అంటే రోజూ ఆ పేరు గుర్తుకు రాక తప్పదు. తనకీ వేదనా తప్పదు. ఇదో శిక్ష!

రాత్రంతా మెష్‌లోంచి క్రోటన్సు చూస్తూనే పడుకుంది సువర్చల. చూస్తుండగానే తెల్లవారింది. చచ్చిపోయేవాడికి బ్రతుకుమీది తీపిలా - ఆ హాస్పిటల్‌లో రోగులకు భవిష్యత్తుపై గల ఆశలా - సన్నగా ఎండ కాస్తూంది. తలలు లేని క్రోటన్సు లేత ఎండలో ఆకాశంవైపు చూస్తున్నాయి. యూకలిప్టస్ మానవుడి ఆశావాదానికి ప్రతీకల్లా మహోన్నతంగా నిలబడి ఉన్నాయి. ఆర్చీ క్రింద నీడ. మధ్య మధ్య ఎండ పొడలు - రోగి చేతి కట్లమీద రక్తం పొడల్లాగా. ఆర్చీమీద సన్నజాజి గుత్తులు - అందులో చలి కాచుకుంటున్నాయి. వాటి సున్నితమైన వాసన చిరుగాలికి మెష్‌లోంచి దూసుకుని వచ్చి సువర్చల గదిలోకి వ్యాపిస్తూంది.

ఒక్కసారి డాక్టర్ శ్రీనివాస్‌ని చూస్తే బావుండును అనుకున్నది సువర్చల. ఎప్పుడొస్తారో,

ఏమో? డాక్టర్ శ్రీనివాసనగానే ఏదో అనిర్వచనీయమైన ఆనందం, అనురాగం, ఆప్యాయతా కలుగుతున్నాయి.

హాస్పిటల్ వరండాల్లో, లాన్స్‌లో రోగుల సంచారం మొదలయింది. అందరూ శుభ్రంగా ఉన్నారు. కాని సమస్యల్లా ఒక్కటే. కాళ్లూ - చేతులూ కట్లు; ముక్కులు చట్టివి.

చూస్తుండగానే ప్రొద్దెక్కింది.

"సువర్చలమ్మా ... అరటి పిలకను పీకేసి ఎవరికో ఇచ్చేసేర్టమ్మా, పాపం!"

ఉలిక్కిపడ్డది సువర్చల. వాటిని వేరు చేస్తే ఒరిగేదేమిటో! - ఒరిగేదేమిటి? అంతా విధి. బాబు తనకు ఎందుకు దూరమయ్యాడు?

"చీడపట్టిన గులాబీని అంతమటుకు కోసి, ఏదో మందు జల్లి బోదె చేశాడు మాలి!" ఉత్సాహంగా చెప్పింది మరొకామె.

"మళ్లీ బతుకుతుందా అది?"

"ఆ - బతుకుతుంది. పూలు పూస్తుందికూడా!"

కిటికీలోని ఫ్లవర్‌వాజ్‌లో 'క్రిసెంథిమమ్స్' నిర్మలంగా నవ్వుతున్నాయి.

మళ్లీ గులాబీ బతుకుతుంది! ఎర్రటి పూలు గుత్తులుగుత్తులుగా పూస్తాయి! అరటిపిలకను పీకితే పీకేరు, ఎక్కడో అక్కడ బతికి బట్టకడితే చాలు.

డాక్టర్ శ్రీనివాస్ వస్తే బాగుండును. ఒకసారి చూడాలి. నిన్ననేగా వచ్చింది. మెల్లిగా వస్తాడు. మాధవి వస్తుంది. అడగాలి - ఎప్పుడొస్తాడో 'రౌండ్స్'కు. మాధవి వచ్చింది, చేతిలో అప్పుడే విచ్చిన రకరకాల గులాబీలతో.

వాటిని 'వాజ్'లో అమరుస్తున్న మాధవిని "డాక్టర్ శ్రీనివాస్ మమ్మల్ని చూడటానికి రారా, మాధవీ?" అని అడిగింది సువర్చల.

"వస్తారటమ్మా - రాత్రికి.... మీకు దిగులనేది వద్దు. త్వరలోనే వెళ్ళిపోతారు ఇంటికి."

"చూడు, మాధవీ! అలా అరటిపిలకను చెట్టు నుంచి విడదీస్తారెందుకు? పాపం కదూ! ఇహముందు అలా చెయ్యనని ప్రామిస్ చెయ్యి!" అన్నది కట్ చేసిన క్రోటన్స్ చూస్తూ.

"అలాగేలేమ్మా! వేరుచెయ్యములే! తెలుసో తెలియదో మీకు. మరో పిలక కూడా పుట్టింది. పొద్దున చూశాను నేను" అన్నది మాధవి.

సువర్చల మంచి రోజుల కోసం పడే ఆత్రతలా మధ్యాహ్నం గబగబా జరిగిపోయి, ప్రొద్దు గూకింది.

పడమటి కొండమీద పగిలిన వ్రణం ఆకాశంలో రక్తం చిమ్ముతూంది. సరిగా ఆ సమయానికి సువర్చల తన గదిలోంచి బయటకు వచ్చింది. డాక్టర్స్ రూమ్ దాకా నడిచి, అక్కడ కొద్దిసేపు అటూ ఇటూ తచ్చాడింది. కొత్త వాళ్లెవరూ కనిపించలేదు. మనసు లోని ఉద్వేగాన్ని అణచుకుంటూ నిరాశగా వెనక్కు తిరిగింది.

వరండాలో, లాన్స్‌లో మొండిచేతుల, మొండికాళ్ల మనుషులు తిరుగుతున్నారు. కొందరు లోపలికి వెళ్లి పోతున్నారు.

పగటివేడికి కాలిన ఆకాశం చీకటి బూడిద రాలుస్తూంది పలచగా.

ఈదరగాలి తిరగటంతో గదిలోకి వచ్చేద్దామని నడక హెచ్చించింది సువర్చల. ఇంతలో తన వార్డులోని రోగుల మాటలు గుర్తుకొచ్చినాయి. అరటిచెట్లను చూచి, అంటు త్రొక్కిన గులాబీని

పలకరించి, సన్నజాజుల ఆర్చీ పక్కన కొద్దిసేపు కూర్చుని గదికి తిరిగి వచ్చింది.

"పక్క గదిలో డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు. ఇప్పుడే వస్తారిక్కడికి" అంటూ వచ్చింది మాధవి.

సువర్చల హృదయంలో చలనం అధికమైంది. ముఖంలో తొట్రుపాటు కనిపిస్తూంది.

"ఇంతలో బాండేజీ కడతానమ్మా!" అంటూ సువర్చల కాళ్ల దగ్గిర కూర్చుంది మాధవి.

మాధవి ఆమె కాలి కట్లు ఊడదీసి లోషన్‌లో కాళ్లు కడిగింది. మందు రాసి బాండేజీ కడుతూంది. సువర్చల ఆలోచనల్లో డాక్టర్ శ్రీనివాస్ తిరుగుతున్నాడు. మెష్‌కి అవతల డైల్యూట్ అవుతున్న చీకటిలో తలలు తెగిన క్రోటన్స్.

"ఏ ఊరమ్మా మీది?" ఎప్పుడొచ్చాడో ఏమో డాక్టర్ శ్రీనివాస్ గదిలో మొదటి పేషెంటుని పలకరిస్తున్నాడు. అతను వాకిటివైపు తిరిగి నిలబడి ఆ రోగి కేస్‌షీట్‌ని పరీక్ష చేస్తున్నాడు.

డాక్టర్ శ్రీనివాస్!

డాక్టర్ శ్రీనివాస్! ... తన కల, ఊహ నిజమైతే? ఇంకేం కావాలి? తన జీవన వనంలో చెట్లు చిగిర్చి పూలు పూస్తాయి.

మాధవి కాలు కట్టుకు ముడివేస్తూంది. సువర్చల చూపులు డాక్టర్ శ్రీనివాస్ వెనుక భాగంమీద నిలిచి త్వరగా అతని రూపురేఖల్ని పూర్తిగా గమనించాలని ప్రయత్నిస్తున్నాయి. బయట లాన్‌లో యూకలిప్టస్‌లు ఊగిపోతున్నాయి.

సన్నజాజి ఆర్చీ చల్లగాలికి సంబరపడుతూంది. వెలిసిపోతున్న చీకటి వెన్నెల్లో పూర్తిగా కలిసిపోతూంది.

మాధవి తన పని పూర్తి చేసి వాష్‌బేసిన్‌వైపు నడిచింది.

సువర్చలకి కాళ్ల వేళ్లు జివ్వున లాగినట్లనిపించింది. బాధతో 'అబ్బ' అనుకుంది హీనస్వరంతో. ఆత్రతతో బరువెక్కిన హృదయం అలసట చెందింది. ఆమె కళ్లు బరువుగా మూతలు పడసాగాయి. సుషుప్తి, జాగ్రదవస్థలకి మధ్య తేలిపోసాగిందామె శరీరం. కలలాంటి ఊహలు, ఊహల్లాంటి కలలు కలగాపులగంగా మనోయవనిక మీద నిలిచి వాస్తవంలో ఎదటనున్న దృశ్యాన్ని మరుగున పడవేయసాగాయి. ఆమె మనస్థితి ఇంత అస్తిమతంగా ఉన్నా కళ్లు ప్రయత్నపూర్వకంగా విచ్చుకుని డాక్టర్ శ్రీనివాస్ కోసం చూడసాగేయి. అంతలోనే కనురెప్పలు మూతలు పడుతున్నాయి.

డాక్టర్ శ్రీనివాస్ సువర్చల వైపు తిరిగాడు. మాగన్నుగా పడుకున్న సువర్చలకు అతను మసకమసకగా కనపడ్డాడు.

ఆమె కళ్లకు యూకలిప్టస్ చెట్ల పక్కన, సన్నజాజి ఆర్చీ మీదుగా దూరంగా మెరుస్తున్న తారక మరీ మరీ ప్రకాశవంతంగా కనిపిస్తూంది.

ఆమె కళ్లు మూతలు పడ్డాయి. స్వాప్నికావస్థలోకి జారిపోయిందామె.

అక్కడ ఆనందంతో తలలు ఊపుతున్న క్రోటన్సూ, తన పక్కనే నిలిచిన 'పిలక'ను చూసి గర్వంగా ఊగిపోతున్న అరటిచెట్టూ, కొత్తగా నాటబడిన గులాబీ అంటుకు విరబూచి నవ్వుతున్న ఎర్రటి గులాబీలూ - అన్నీ కనిపిస్తున్నాయి.

ప్రచురణ : ఆంధ్ర ప్రభ 03.06.1970

● ● ●

# సముద్రం

మితంగా మాట్లాడేవారిని పలకరించడానికి ధైర్యం వుండాలి. ఎందుకంటే, వాళ్ళకి మాట్లాడ్డమంటేనే విసుగు. వారికి యిష్టం లేకపోతే, మాట్లాడిస్తే మహా చెడ్డకోపం కూడ వస్తుంది.

అందుకనే కామేశ్వరమ్మ చిన్న కొడుకును ఎలా మాట్లాడించాలా అని కాసేపు యిటూ అటూ తచ్చాడింది. శంకరం తత్వం ఆమెకు తెలుసు. పది ప్రశ్నలకు ఒక 'వూ' తో చాలా తేలికగా సమాధానం చెప్తాడు. ఒక్కోసారి ఒక ప్రశ్నకే చిరాకుపడి చీదరించుకోవడం కూడ కద్దు.

శంకరానికి ఆరోజు ఆఫీసు వుంది. ఎందుకంటే ఆరోజు ఆదివారమూ కాదు, మరి ఏరకపు సెలవూ లేదు.

ధైర్యాన్నంతా కూడదీసుకుని కామేశ్వరమ్మ ఎలాగైతేనేం 'అన్నయ్య పొలం అమ్మేశాట్టరా చిన్నబ్బాయ్' అన్నది శంకరం ముఖం పరీక్షిస్తూ.

శంకరం 'షర్ట్' చేతులు మడతపెట్టుకుంటూ 'వూహూ' అన్నాడు నిర్లిప్తంగా.

ఆ కుటుంబంలో అలా నిర్లిప్తంగా వుండడం పరిపాటే. వురుమురిమి పిడుగులు నెత్తినపడుతున్నా తొణకకుండా నిశ్చలంగా వుండడం ఆ యింట్లో, ముఖ్యంగా మగ సంతతికి పుట్టుకతో సంక్రమించిన సహజగుణం. పెద్ద అబ్బాయ్‌ది కూడ యిదే తరహా. తెలిసి కూడా ఆమె చిన్న కొడుకు నిర్లిప్తతకు చిరాకుపడ్డది.

'అన్నయ్య పొలం అమ్మేడుట - విన్నావుట్రా- మరో వాగ్బాణం కాస్త గట్టిగానే లాగి విసిరింది.

'వూ' మరో రాగం కాస్తంత దీర్ఘంగానే పలికేడు, ముఖకవళికల రంగు చెదరకుండా -

కామేశ్వరమ్మకు ఓర్పు, ఓపికా క్షీణించి చిరాకు తారాస్థాయికి అందుకున్నది. 'అలా ఏమీ పట్టనట్లు వూరుకుంటే సరిపోదబ్బాయ్ - వుమ్మడి పొలమెవ్వరికీ తెలియకుండా అమ్మితే ఎలా? అందులో నీకూ భాగమున్నది. అమ్మాయికీ కాస్తోకూస్తో యివ్వాలి కదా- '

తల్లి ధోరణికి చిన్నబ్బాయ్ గొంతులో మాట పెగిలింది. 'అయితే నన్నేం చేయమంటావమ్మా -- అన్నయ్య తెలియని వాడా - ఉత్తరం రాస్తాడులే-' అన్నాడు.

ఆమె ఆశించిన జవాబు ఒకటి - ఆమె ఆశను చిన్నబ్బాయ్ పూర్తిగా తలక్రిందులు చేసేడు. 'యిక వూరుకుంటే లాభం లేదు. గట్టిగా అడిగేయాలని నిశ్చయించుకుందామె.

'అబ్బాయ్ - అసలు సంగతి యిక్కడ కూర్చుంటే మనకేం తెలుస్తుంది చెప్పు - నైజాం నుంచి వెంకట రత్నం వచ్చేడు - పొలం అమ్మి కూడ ఆరు నెలలు కావస్తుందట - మనకి ఆ విషయమే తెలియదు. వుత్తరం రాసే వాడయితే యీపాటికి రాసే పని- అక్కడ ఏదో ఫ్యాక్టరీలో చేరేట్ట.'

'వూ' అన్నాడు శంకరం. నైలాన్ సాక్స్ కాలి మడమకు ఎక్కిస్తూ యోగిలాగా. యిప్పటికీ అదే నిశ్చలత - చలించని ముద్ర - కామేశ్వరమ్మకు చిరాకు తెప్పించే ఆ రెండు గుణాలూ. అందుకే యీసారి వ్యవహారమేదో తేల్చుకోవాలనే అన్నది -

'నీ నిర్లక్ష్యమేమీ బాగోలేదురా శంకరం-' ఆమెకు కోపమొస్తే 'శంకరం' అని పిలుస్తుంది.

'యిప్పుడు నేను చేసేది ఏముంది చెప్పు'

'డబ్బు అవుతే అయింది. వెళ్ళి సంగతేమిటో వివరాలు తెల్సుకో- నిజమే అయితే నిక్కచ్చిగా భాగాల సంగతి అడిగేయ్'

'వాడి పరిస్థితి ఏమిటో - బాధ పడ్తాడు-'

'నీలో ఆ లొసుగు కనిపెట్టే యిన్ని ఆటలు ఆడుతున్నాడు. నాలుగు రోజులు సెలవు పెట్టి వెళ్లిరా - యిప్పుడు తప్పితే తర్వాత ఏమి అనుకుని లాభం లేదు-'

శంకరం తల్లి ధోరణికి చిరాకు పడ్డాడు. చిరాకును ముఖంలోకి తెప్పించుకోకుండా బలవంతాన అణచుకుంటూ

'సరే చూస్తాలే-' అని గబగబా వాకిట్లోకి వచ్చేసేడు.

కామేశ్వరమ్మ కొడుకును ఒప్పించగలిగినందుకు నిజంగా పొలంలో భాగం వచ్చినంత సంబరపడ్డది.

● ● ●

తల్లి పోరగా పోరగా శంకరం నాలుగు రోజులు సెలవు పెట్టి అన్నయ్య దగ్గరకు ప్రయాణమయ్యేడు.

వెళ్తున్నాడే గాని అన్నయ్య దగ్గర గట్టిగా, ధైర్యంగా ప్రస్తావించగల సాహసం లేదు. మొదటినుండీ అన్నయ్యంటే ఒకరకమైన గౌరవభావంతో కూడిన భయం.

ఆ మాటకొస్తే పెద్దకొడుకు ఎదురుగ్గా లేడు కాబట్టి కామేశ్వరమ్మ నోరు మెదపగలిగిందిగాని, అతనే ఎదురుగా వుంటే యింట్లో ఎవరూ మాట్లాడలేరు. పెద్దకొడుకు ప్రసాదరావు అంత గంభీరమైన వ్యక్తి.

రైల్లో కూర్చున్న శంకరానికి గతం కళ్ళముందు సుళ్ళు తిరిగింది.

లయబద్ధమైన చక్రాల సవ్వడిలో వర్తమానం విస్మరించి గతం పునశ్చరణం చేసుకున్నాడు.

తనకూ - తమ కుటుంబానికీ ఏకాస్త చెప్పుకోదగ్గ గతం వున్నా - గత జీవన రథానికి సారథి అన్నయ్య. ఆగామి అనే తన రంగురంగుల పాలరాతి భవనానికి గతం పునాది - నిజమే - పునాది పటిష్టంగా వుంటేనే భవనం పదికాలాల పాటు చెక్కుచెదరకుండా వుండేది. మరి ఆ పునాదిని బహు జాగ్రత్తగా నిర్మించిన వాడు అన్నయ్యగాక మరెవరు? తనకు తాను దగ్ధమయి కరిగి యింటికి వెలుగునిచ్చే కొవ్వొత్తి అన్నయ్య!

యింటి బాగోగుల కోసం - కుటుంబంలోని అందరి మంచికోసం తన స్వార్థం వదలి - తన భవిష్యత్తును లెక్క చేయని అన్నయ్య - యిద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళకే క్షీణించిపోయిన యింటి ఆర్థిక పరిస్థితులవల్ల కనీసపు చదువుకు కూడ దూరమైపోయేడు - అదీ తన చదువు కోసం - అన్నయ్య చదువు ఆపితేగానీ తన చదువు ముడిపడలేదు.

అన్నయ్య చదువు ఫోర్తు ఫారంతోనే ఆగిపోయింది.

చదువులు - కొలువులు - వీటికన్నా పెళ్ళే ముఖ్యమైన ఆ కాలంలో తమ స్తోమతకు తగ్గ కుటుంబంలోనే పెళ్ళి కూడ అయింది అన్నయ్యకు.

అన్నయ్యకు తెలుసు తను చదివిన చదువుకు ఎలాంటి వుద్యోగం దొరుకుతుందో.

సంపాదన లేకుండా యింట్లోనే వుంటే యింట్లో పరిస్థితి ఎలావుంటుందో కూడ చవిచూసేడు.

కారణం - కాస్త విశాలంగా ఆలోచించే తత్వమే లేదు అమ్మకు.

అప్పుడు తండ్రి కూడా ఏమీ అనే వాడు కాదు.

కూపస్థమండూకంలా అలా ఒకరి చేతిక్రింద పడివుండే కన్నా కొన్నాళ్ళు తిరిగిరావడం మేలని మిలటరీలో చేరేడు.

యింట్లో అమ్మ సంకుచితంగా ప్రవర్తించకపోతే అన్నయ్య అలా వెళ్ళేవాడు కాదేమో.

అలా మిలటరీకి పోవడంతో అంతా ఆశ్చర్యపోయేరు. కాని తనకేమీ ఆశ్చర్యం కలుగలేదు. అన్నయ్య మాటపడే మనిషి కాదని - జీవితం మీద కచ్చితమైన అభిప్రాయాలు కల మనిషని తనకు బాగా తెలుసు. అందుకే లోపల బాధ పడ్డాడు తను.

అన్నయ్య నాలుగేళ్ళ తర్వాత తిరిగి వచ్చేడు. వస్తూ - తల్లిదండ్రుల ప్రేమ లోపించడానికి పెద్ద కారణమైన డబ్బు కూడ తెచ్చేడు.

పోనీ యిప్పుడు కూడ అన్నయ్య స్వార్థం చూసుకోలేదు. భార్య పిల్లలు వున్నా - అప్పుడు సమిష్టి క్షేమమే కోరిన అన్నయ్య ఆ డబ్బుతో చెల్లెలి పెళ్ళి - తనకూ బి.ఏ వరకూ చదువు - తర్వాత తన పెళ్ళి కూడా చేసేడు.

అన్నయ్య ఆపద్బాంధవుడిలా డబ్బుతో రాబట్టి గానీ లేకపోతే తన చదువుకు కూడా పురిట్లోనే సంధి కొట్టేదే.

తన యిప్పటి సంతోషమయ జీవితానికి కారణం అన్నయ్య. యిప్పుడు తన జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలు.

యిహ అన్నయ్య ఖాళీ చేతులతో వుద్యోగాన్వేషణ ప్రారంభించేడు.

ఏవో రెండుమూడు చిన్నచిన్న వుద్యోగాలు చేసేడు. కాని నచ్చలేదు. భార్యని యిద్దరు పిల్లల్ని పోషించుకునేందుకు పనికిరాని వుద్యోగాలే అవి.

ప్రయోజనం లేకపోయింది. ఆ రోజుల్లో అప్పటికి గుంటూరు జిల్లా రైతులు నైజాం వెళ్ళి చవుకగా పొలాలు కొనుక్కొని వ్యవసాయం చేస్తున్నారు. ఎకరం ముప్పై నలభైకి కూడా కొన్నవాళ్ళు వున్నారు.

ఎకరం పొలం నలభై నుండి అయిదారు వందల వరకూ వాళ్ళే పెంచేసేరు.

అలా నైజాంలో కుటుంబాలతో స్థిరపడ్డ వాళ్లలో తమ వూరి రైతులు కూడ వున్నారు.

ఓ రోజున ఒక మోతుబరి వచ్చి - నైజాంలో తమ పిల్లలకి సరయిన చదువు చెప్పే నాథుడు లేడని - పిల్లలు చెడిపోతున్నారని, వచ్చి అక్కడేవుండి బడిపెట్తే - పిల్లవాడికి పది రూపాయల చొప్పున యిచ్చి సంవత్సరానికి ఒకసారి పంటలో బస్తా బస్తా ధాన్యం కూడ యిస్తామని, ఒప్పుకోవాల్సిందని అన్నయ్యను బతిమలాడేడు.

సరేనని అన్నయ్య వదినె, పిల్లలతో వెళ్ళేడు. అక్కడ కొన్నాళ్ళు బాగానే జరిగినట్లు కబుర్లు తెలిసేవి.

సంవత్సరం తిరగకుండానే పిల్లలు జీతాలు యివ్వడం మానేసేరు. పంటలో ధాన్యం కూడ యిచ్చిన వాళ్ళు యిచ్చేవారు - కొందరు ఎగవేసేరు.

కారణం యిదమిద్ధమని తెలియలేదు.

ఒకరోజున అన్నయ్య నైజాం నుండి వచ్చేడు. అప్పుడు తమకు ఒక ఎకరం మాగాణి వుండేది. ఒక అర ఎకరం అమ్మి నైజాంలో పొలం కొంటానన్నాడు. అర ఎకరం అమ్మితే నైజాంలో అయిదెకరాలు వస్తున్నది. బాగానే వుంది. అమ్మ ససేమిరా అన్నది. అన్నయ్య అంటే నాన్నకు అమితమైన వాత్సల్యం - గౌరవం - నాన్న అనుమతించారు. అన్నయ్యకు అమ్మకు చిన్న రభస

లాంటిది కూడ జరిగింది.

వెళ్ళి నైజాంలో నాలుగెకరాలు కొన్నాడు అన్నయ్య. కొన్న కొత్తల్లో తండ్రి కూడా చూసి వచ్చేడు. ఆ పొలం సంగతులు చెప్తూ ఆయన ఎంత సంబరపడిపోయేవాడో -

'ఒరేయ్ - చిన్నబ్బాయ్ - మన పొలం బంగారంరా - ఆ వూళ్ళో ఎవరికీ పండనంత ధాన్యం పండింది మనకు. ఆశ్చర్యపోతున్నారందరూ. పొలంలోనే ఒక మూల నాలుగు నిట్టాడ్ల యిల్లు కట్టేడు - గొడ్ల సావిడి - శుభ్రంగా రెండు గేదెలు - స్వంత పాడి - ఆహా - ఆయన ఆనందానికి హద్దులు లేవు.

అంతకన్నా ఏం కావాలి? కుటుంబం కోసం తన జీవితాన్ని - తనతోబాటు తనని నమ్ముకున్నవార్ని కష్టాల్లో పడవేసుకోకుండా అన్నయ్య జీవితం ఒక ఒడ్డుకు వచ్చింది.

సంతోషించేను -

తర్వాత ఆ తృప్తితోనే తండ్రి చనిపోయేడు.

మరి యిప్పుడు యీ వార్త ఏమిటి?

అన్నయ్య పొలం ఎందుకు అమ్మినట్టు - కారణాల తోరణాలు - అంతుచిక్కటం లేదు.

● ● ●

దూర ప్రయాణపు బడలికతో బండి దిగిన శంకరం కొత్తవూరిని వింతగా యిటూ అటూ చూసేడు -

ఫ్యాక్టరీ యింజన్ల చప్పుడు వినిపిస్తోంది. - ఫ్యాక్టరీ వుద్యోగుల క్వార్టర్లు చిన్నచిన్న బొమ్మరిళ్ళలా అన్నీ ఒకలాగానే కనిపిస్తున్నాయ్.

'ప్రసాదరావుగారెక్కడ వుంటారో తెలుసునాండీ' ఒక తెలుగు మనిషిలా కనిపిస్తున్న అతనిని అడిగేడు -

దారి చూపించేడాయన - 'ఏ ఫ్యాక్టరీ క్వార్టర్లలోనో వుంటాడు అన్నయ్య' - అనుకొన్నాడు శంకరం.

తీరా చూస్తే వూరి బయట రెండు నిట్టాళ్ళ పాకలు నాలుగైదున్నాయ్. అందులో ఒకదాంట్లో ఒక భాగంలో వున్నారు వాళ్ళు.

ఆ యిళ్ళూ - పరిస్థితి చూచేటప్పటికే శంకరం బాధతో కుంచించుకుపోయేడు.

తన లోగిలి లోకి వెళ్ళేటప్పటికి పిల్లలు కొందరు వచ్చి చూసి పారిపోతున్నారు.

శంకరం వదినను గుర్తు పట్టేడు. వదినను చూసేటప్పటికి శంకరం కడుపులో దేవినట్లయింది.

పొలం అమ్ముకుని ఏదో బావుకుంటున్నారని అనుకుంటున్నది అమ్మ. నిజంగా సుఖంగా వుంటే యిలాంటి చోట యీ పరిస్థితిలో వుండాల్సిన అవసరం దేనికో-

'కులాసాయేనా ఒదినా - బాబు ఏడీ'

'యిదిగో యిలా వున్నామయ్యా - అడుగో బాబు ఎవరి దగ్గరో లెక్కలు రాసుకోడానికి వెళ్లేడు - వస్తున్నాడు'

బాబు గుర్తు పట్టేడు. బాబు చిన్నప్పుడు బొద్దుగా పంపర పనస తొనలా వుండేవాడు. ఆ జీవకళ ఏమయింది? - యీ మనుషుల్లో.

యింతలో 'అన్నం పొంగింది - వారుస్తావా అమ్మా' అంటూ సుమతి వచ్చింది - శంకరం అన్న కూతురు సుమతి.

శంకరం ఏదో యాంత్రికంగా పలకరిస్తున్నాడు గాని మనసు మాత్రం ఏదో బాధామయ లోకాల్లో గిలగిలా కొట్టుకొంటున్నది.

వదినె ఒంటి మీద చిరుగుల చీరె -

పిల్లలు ఎముకల గూళ్ళు -

నివాసం తాటాకుల పాక - గొడ్లు వుండడానికి కూడా పనికిరానివి -

మరి - వీళ్ళ స్థితిగతులేమిటి?

అన్నయ్యకు సుఖపడే యోగ్యత లేనేలేదా? పొలమేమయింది?

వదినె కాళ్ళకు నీళ్ళు తెచ్చి యిచ్చింది.

"అన్నయ్య లేడా వదినా?" అన్నాడు భావాలను లోలోపల దిగమింగుకుంటూ -

యిక్కడికి యాభై మైళ్ళలో నిజాంసాగరం అని వూరుంది. అక్కడ ఏదో వుద్యోగం యిస్తారంటే వెళ్ళేరు. రేపుగాని రారు.

శంకరానికి ఏదీ అర్థం గావడం లేదు. - అన్నయ్య కుటుంబ పరిస్థితి అతన్ని ఏవో అయోమయ లోకాల్లోకి తీసుకుపోతోంది.

● ● ●

బాబు చదువుకోడానికి వెళ్ళేడు -

సుమతి తల్లికి పిండివంట చేయడంలో సాయపడ్తోంది.

వద్దంటే వినకుండా వదినె పకోడీలు చేస్తోంది.

యివతలి గదిలో కూర్చుని పుస్తకాలు తిరగేస్తున్న శంకరానికి 'ఎందుకేడుస్తావ్' అంటూన్న సుమతి మాటలు - 'అబ్బే పొగ పోయింది కంట్లోకి' అంటున్న వదినె గొంతు వినిపించింది.

'డైరీ' అనుకోకుండా శంకరం చేతులు పేజీలను తిరగేసినై. అంతరాత్మ తిరగబడ్తున్నా ఏదో మైకంలో చదివేసేడు-

'అంతా అయిపోయింది. కన్న బంగారు కలలు బుగ్గి పాలయినై. తమ్ముడు - అమ్మ - చెల్లెలు - యింకా నయం - నిర్వాకం చూడ్డానికి నాన్న లేరు. ఆయన కల కంటూనే వెళ్ళిపోయేరు. అదృష్టవంతులు. వీళ్ళకి జవాబు ఏం చెప్పాలి? చివరికి మంచి పాఠమే నేర్పింది యీ నా అనుభవం. 'మనిషి అనేవాడిని నమ్మకు' అని. ఎంత చల్లగా ప్రేమగా కబుర్లు చెప్పేరు - వాళ్ళ పిల్లలకు పాఠాలు చెప్పి వాళ్ళ ఆధీనంలో బతికితే వాళ్ళకు గొప్ప. వాళ్ళు జీతాలు యివ్వకపోతే పొలం కొని సాగుచేసుకోవాల్సి వచ్చింది. తోటి వాడు బాగుపడ్తుంటే ఓర్వగలరా? ఆ సంవత్సరం అందరికన్నా ఎక్కువ పండేటప్పటికి కళ్ళు కుట్టినై అందరికీ. రెండో సాగుకు పెట్టుబడి లేదు. వూరివాడనే అభిమానం లేదు. సహాయనిరాకరణ చేసేరంతా. కాకపోగా మరో వైపు నుంచి పొలం అమ్మేయ్‌మని, సాగు చేయలేవని - వత్తిడి. ఆ వత్తిడికి తట్టుకోలేక అమ్మేసేను. ఫ్యాక్టరీలో 'సీజను' వుద్యోగం నెలకు వాళ్ళిచ్చే అరవై ఏం సరిపోతయ్ - పొలం డబ్బులో బొర్రె పెట్టున్నాను. ఏ కాస్తోవున్న - ఎలా సర్దటం - యీ అరవైతో ఎలా యీ జీవన నౌకను నడపటం - యీ జీవితానికి అగచాట్లే రాసిపెట్టి వుందేమో-

యిలాంటి బతుకుకన్నా చావు మేలు - కాని వెనకాల జంజాటం - ప్చ్ - హే - భగవాన్!

శంకరానికి పరిస్థితి అవగతమైంది. ఒక్కసారి తన గతం గుర్తుకొచ్చింది. అసలే అన్నయ్య బాధపడ్తున్నాడు. అన్నయ్యతో అసలు యీ సంగతే ఎత్తకూడదు. అన్నయ్య తన స్వార్థానికి ఏమీ చేయలేదు. సమిష్టి సుఖసంతోషాలకే అన్నయ్య పాటుపడ్డాడు. పొలం కొని ఒకటికి నాలుగు చేసింది

అందరి కోసమే.

మనిషి మనసు కుళ్ళుది. మానవుడు ఈర్ష్యాళువు - స్వార్థపరుడు - పరాయి వాడు బాగుపడ్తే ఓర్వలేడు -

శంకరం అలా బజారు వెళ్ళి బాబుకు, సుమతికి కొత్త బట్టలు కొనుక్కొచ్చేడు. వదినెకు చీరె తెచ్చేడు.

'వెళ్ళొస్తానమ్మా - సెలవలేదు - వీలు చూచుకొని మరల వస్తాలే - అన్నయ్యతో చెప్పు'

'అయ్యో - అదేమిటయ్యా - అంత దూరం నుండి వస్తివి - వుండు - రేపు అన్నయ్య వస్తారు.'

'కాదులే వదినా - సెలవు లేదు. వెళ్ళాలిలే -' శంకరం వచ్చేసేడు.

బాబు, సుమతి కొత్త బట్టలు తొడుక్కుని, స్టేషనుకు వచ్చేరు - పంపడానికి.

కనుచూపు మేరవరకు చూస్తూ వుండిపోయాడు శంకరం.

వదినె కనుకొలకుల్లో మెరిసే నీటిని తుడుచుకున్నది.

'ఎందుకు వచ్చేడు - ఎందుకు వెళ్లేడు' ఆ ప్రశ్నకు జవాబు దొరకలేదు ఆవిడకు -

ఆవిడ సంసారం లాగనే మనసు కల్లోలిత సముద్రమయింది. వుధృతోత్తుంగ తరంగాల్లా ఎన్నో ఆలోచనలు...

● ● ●

అప్పుడే బండి దిగి లోపలకి వచ్చిన శంకరాన్ని - 'అడిగేవా - అన్నయ్య ఏమన్నాడు-' అన్నది వుత్సుకతతో కామేశ్వరమ్మ.

భృకుటి ముడిపెట్టి కోపంతో చూసి - విసురుగా లోపలికి వెళ్ళిపోయేడు శంకరం. 'యిహ ఆ విషయం ఎత్తవద్దమ్మా' అంటూ.

కామేశ్వరమ్మ నీరు కారిపోయింది. ఆమె మస్తిష్కంలో ఆలోచనలు కొల్లలు -

చిన్నబ్బాయ్ వెళ్ళిన పని ఏమయిందనే ప్రశ్నకు జవాబు దొరకలేదు. ఆమెకు జవాబు దొరుకుతుందని ఆశ లేదు - అడిగే ధైర్యం లేదు.

ప్రయాణ బడలిక తీరేక భోజనం చేస్తూ అన్నాడు శంకరం తల్లితో. "అన్నయ్య పరిస్థితి చాలా దీనంగా వున్నదమ్మా... అన్నయ్య మొదటి నుంచీ చాలా కష్టాలు పడ్డాడు. అందరికోసం ఏదో చేద్దామనుకొని యివన్నీ చేసే తాపత్రయపడి భంగపడ్డాడు. చేసిన, చేద్దామనుకున్న పని ఏదీ కలిసిరాలేదు. యిప్పుడు కూడ చాలా అవస్థలు పడుతున్నాడు. తనకుగా కావాలని ఏమీ చేయటల్లేదు. మిలిటరీకి వెళ్ళటం, నైజాం వెళ్ళటం, వ్యవసాయం చేయడం, యివన్నీ తనకోసం కాదమ్మా. అందరికోసమే. అన్నయ్య దురదృష్టవంతుడు. ... వాడిని అర్థం చేసుకోమ్మా...."

కామేశ్వరమ్మకు కళ్ళ నీళ్ళు తిరిగినై. పెద్దబ్బాయ్ జీవితం అంతా కష్టాలు పడుతూనే వున్నాడు. ... వాడి వల్లే కదా చిన్నవాడి జీవితం బాగున్నది. మిలిటరీ నుండి తెచ్చిన ఆకాస్త డబ్బూ యింటికిందే ఖర్చు చేసేసేడు. తమ్ముడిని చదివించేడు. వాడు మటుకు ఏం చేస్తాడు కాలం కలిసిరాకపోతే. సన్నాసి. పమిటి కొంగుతో కళ్ళనీళ్లు తుడుచుకున్నది.

నాలుగు రోజుల తర్వాత అన్నయ్య ఉత్తరం వచ్చిందమ్మా అంటూ శంకరం వచ్చేడు. కామేశ్వరమ్మ వింటుంటే చదివేడు శంకరం.

"తమ్ముడూ,

నీవు వచ్చి వెళ్ళేవని వదినె చెప్పింది. సాయంత్రానికల్లా నేనూ వచ్చేను. నేను వచ్చేవరకన్నా

వుండాల్సింది. నిన్ను, అమ్మను చూసి ఎన్నాళ్ళయింది. ఉద్యోగం మంచిదే. ఈ వారం దొరికేట్టే వుంది. పిల్లలకూ, వదినెకూ బట్టలూ అవీ కొన్నావట. ఎందుకవన్నీ. మనందరికీ మంచి రోజులొస్తయ్యనే ఆశ యిప్పుడిప్పుడే కలుగుతోంది. కాస్త నిలదొక్కుకోగానే, అమ్మనీ, మీ అందరినీ యిక్కడికి తీసుకొస్తాను. అమ్మని అడిగేనని చెప్పు. అన్నీ సర్దుకుంటయ్. బెంగ ఏమీ పడకు. ఉంటాను.

అన్నయ్య."

అన్నయ్యకి ఎంత ధైర్యం? ఆటుపోట్లకు తట్టుకుని నీరవ ప్రశాంతత, గాంభీర్యం, సంతరించుకున్న మహాసముద్రం అన్నయ్య.... కామేశ్వరమ్మ చిన్న కొడుకు చూస్తాడేమోనని మొహం ప్రక్కకు తిప్పుకుని కళ్ళు తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది పొయ్యి మీద పాలు పొంగినట్లుంటే.

ఆవిడ మనసు ఓ మహా సముద్రం - ఆలోచనల ఆటుపోట్లకు వుక్కిరిబిక్కిరయి పోయిందామె.

'యీ సంసారం ఒక సాగరం' గొణుక్కున్నాడు శంకరం - చిన్నబ్బాయ్.

ప్రచురణ : కృష్ణా పత్రిక 27.05.1967

● ● ●

# మంటలు

నేను ఆ వూరు వచ్చి ఆరునెలలు దాటనేలేదు. ఆరు నెలలలోనే ఆ వూరి గురించి చాలా తెలుసుకున్నాను. వచ్చిన నెలరోజులకు ... అది శీతాకాలం .. శీతాకాలం కూడ ఆ వూరు వెచ్చగా వుంటుందని గ్రహించేను... కాని తర్వాత వచ్చిన వేసవి కూడ  చల్లగా లేదు - సెగలు - మంటలు - అంత భరించలేని వేసవి. అటు తర్వాత వానలు. శీతాకాలం వేడి, ఎండాకాలం వేడి - పోనీ వానాకాలమన్నా చల్లగా వుంటేందేమోలే అని ఆశతో ఎదురుచూచేను. నా ఆశ అడియాశయింది. వానాకాలమూ మంటలే, సెగలే - అన్ని కాలాలూ వేడీ - సెగలు - భుగభుగలూ - అబ్బ - మంటలు! చల్లదనమనే మాటే లేదు - యీ వూళ్ళో -

● ● ●

ఆ రోజు అమావాస్య -

ఎందుకంటే ఆరోజు పూర్ణిమ కాదు కాబట్టి .. ..

ఆరోజు కరుణాకరం వచ్చేడు. నన్ను చూడ్డానికి. అమావాస్యనాడే నన్ను చూడ్డానికి వస్తాడని కాదు. ఆ రోజు సెలవు మాకు. కాబట్టి వచ్చేడు. ఆరోజే అమావాస్య అయింది.

కరుణాకరం ఆవూరివాడే. ఆ వూరి సంగతులన్నీ తెలుసు అతనికి. మేమిద్దరం అలా బజారుకు పోయేం. ఉడిపిలో మూడు ముక్కల మినపట్టు తిన్నాం. అప్పుడే చీకటి పడ్డది. హోటలు బయటకు వచ్చేం. ఆ రోజు అమావాస్య అని చెప్పేగా అయినా బజారంతా వెన్నెల పరిచినట్లుంది. ఎందుకంటే ఫర్లాంగుకొకటి మెర్క్యురీ లైటు పగలబడి వెలుగుతోంది. అందుకనే అమావాస్యకు అంత వెలుగు.

మేం బయటకు వచ్చేటప్పటికి వీధి నిర్మానుష్యంగా లేదు.. .. నిశ్శబ్దంగా లేదు. ఎందుకంటే మాకు ఎదురుగా ఒక పెద్ద ఊరేగింపు వస్తోంది. వూరేగింపులో జనం కేకలు వేస్తున్నారు. బాజాలు మ్రోగుతున్నాయ్.

గుంపు మధ్య టాపులేని జీపు మెల్లగా ముందుకు వస్తోంది. జీపులో ఓ లావుపాటి ఖరీదైన నల్లటి శాల్తీ జనానికి దణ్ణం పెట్టూ నిలబడ్డది. ఆయన మొహం పూలదండల మధ్యగా కొద్దిగా కనపడ్తోంది.

కరుణాకరం అన్నాడు "ఆయనే రామారావ్ - మన వూరిని వుద్ధరిస్తాట్ట. ఎలక్షన్‌లో గెలిచేడు సంబరంగా వూరేగుతున్నాడు."

"మరి ఓడిపోయిందెవరు?" అన్నాన్నేను. పరాజయం పొందినవాడి బాధ తలచుకుని జాలితో.

"బుచ్చిరెడ్డి" అన్నాడు కరుణాకరం.

'అలాగా' అన్నాను నేను. ఆ తర్వాత కాసేపు దూరంగా నిలబడే ఆ వూరేగింపును సాగనంపాం. ఓ అరగంట యిటూ అటూ తిరిగి యింటి ముఖం పట్టేం. కరుణాకరంకు ఆ రాత్రి మా యింట్లో డిన్నర్. మా యింటి కాంపౌండు దగ్గరకు వచ్చేం. తొమ్మిది గంటలవుతోంది.

మరోసారి జ్ఞాపకం చేయాలి మీకు. ఆ రోజు అమావాస్య. మా యిల్లు చేరగానే వీధి లైట్లు

అన్నీ ఆరిపోయేయ్. తర్వాత కొన్ని సెకన్లు మాత్రమే. నిలబడి చుట్టూ చూసేం. అమావాస్య! అయినా వీధీ, వూరు వూరంతా పట్టపగలులా వుంది. ఎక్కడ చూసినా వెలుతురే.

అప్పుడే ఆ వూరి గురించి మరో విషయం కూడ తెలుసుకున్నాను. ఆ వూళ్ళో అమావాస్య కూడా వెన్నెలమయం అని.

అమావాస్య - వీధిలైట్లు లేవు. అయినా వెలుతురు - ఎదురుగా ఫర్లాంగు దూరంలో కట్టెల అడ్తీ తగలడుతోంది. యింకొంచెం దూరాన రెండు పాక హోటళ్ళు ఎర్రగా మండిపోతున్నయ్. యింటి వెనుక రెండు మూడొందల గుడిసెలుంటయ్. ఆ గూడెం అంటుకున్నది. యింటి మీదుగా మంటలు నింగిని తాకుతున్నయ్. దూరాన పూరి యిళ్ళపైగా, మేడల మీదుగా, ఎర్రటి వెలుతురు - పొగ - కాలిపోయే వాసాల ఫెళ ఫెళ - వెన్నెల - - వెచ్చటి వెన్నెల.

'అమ్మయ్యో - వూరు తగలడుతోంది' అన్నాన్నేను కళ్ళింత చేసుకుని.

'యీ వూరికి పోయే కాలమొచ్చిందిలే - నువ్వేం బెంగపడకు. ఒకడికి సంతోషం... మరోడికి మంట .. ఒకడికి మోదం ... మరోడికి ఖేదం .. ఆ ఓడిన వాడికి గెలిచిన వాడి మీద మంట. అందుకనే వూరంతా ఒకటే మంట. వెధవ గాడిద కొడుకులు ...' ఉద్రేకంతో అందర్నీ కలవేసి తిడుతున్నాడు కరుణాకరం.

యింతలో యింట్లోంచి మా ఆవిడ, బాబిగాడు, మా చెల్లెలు, అమ్మ, ఆదుర్దాగా వాకిట్లోకి వచ్చేసేరు. 'హమ్మయ్యో ... ఆహుతయి పోతోందిరా' అంటూ అమ్మ.

బాబిగాడు 'హమ్మో - హమ్మో -' అంటూ చేతులు చరుస్తూ కేరింతలు.

"మీరంతా లోపలికి వెళ్ళండి - ప్రమాదం" అన్నాడు కరుణాకరం.

మేమూ లోపలికి వెళ్ళి కాంపౌండు గేటు వేసి గడపల దగ్గర కుర్చీలు వేసుకుని కూర్చున్నాం. చుట్టూ మంటలు - బిగ్గరగా హాహా కారాలు వినిపిస్తున్నయ్.

'పకడో -- మారో -- కాటో -- ' యివే కలగాపులగంగా వినిపిస్తున్నయ్. వాసాలు పేలిన మోతల్లో. జనం వీధుల్లో పరుగెత్తుతున్నారు.

'యిహ యీ రాత్రి జాగరణేలే... త్వరగా భోజనం కానిచ్చి కూచుందాం పదండి' అన్నాడు.

భోంచేస్తూ చెప్పేడు కరుణాకరం.

'ఆ వూరు ప్రతి రెండు నెలలకు ఓసారి అలా ఆహుతి కావల్సిందేట. ఆ వూళ్ళో రెండు పార్టీలు. ఒకరంటే ఒకరికి మంట - పగ. కారణం దొరకాలే గాని, దొరికితే ఆ వూళ్ళో రోజూ మంటలే. రోజూ సెగలే - రోజూ ఖూనీలే - రోజూ తన్నుకోటాలే - ఆవూరి వాళ్ళకివేమీ వింత కాదు.'

"ఏం వూరురా భగవంతుడా?" అనుకున్నాను.

భోజనం చేసి, యింట్లో వాళ్ళకి వీధి తలుపు వేసుకుని తిండి తినమని చెప్పి వీధిలోకి వచ్చేం.

మంటల సెగ ఎక్కువైంది. వూరంతా పొగ దట్టంగా అల్లుకు పోతోంది. అది పొగా - పగా?! కోలాహలం జాస్తి అయింది. అగ్ని దేవుడు విజృంభిస్తున్నాడు. ఫైరింజన్లకు నీటి ఎద్దడి ఏర్పడింది. నీళ్ళు దొరక్క కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్నయ్... అటూఇటూ గంటలు కొట్టుకుంటూ - ఎక్కడ పడితే అక్కడ ప్రతి వాడూ చేతిలో ఒక బడితె పట్టుకుని యిటూ అటూ పరిగెత్తుతున్నాడు.

మా యిల్లు ఒక మూలకు వుంది. మా యింటి వెనుక గుడిసెలన్నీ ఒక పార్టీ వారికి చెందినవి. మా యింటి ముందు కూడా వారూ వీరూ అంతా కలిసివుంటున్న గల్లీ వుంది. మళ్ళీ ఆ రెండు పార్టీల్లోనూ అంతర్గతంగా చాలా విభేదాలున్నాయ్. మూడో వాడు రానంతవరకు వాళ్ళూ తలలు

పగలగొట్టుకొంటూనే వుంటారు. వాళ్ళలో వాళ్ళకీ ద్వేషం, యీర్ష్య, క్రోధం... వున్నై.

కాని యిప్పుడు పరిస్థితి వేరు... యిప్పుడు ఆ పార్టీకి యీ పార్టీకి మధ్య మాత్రమే వున్నై అవి.

యింతలో వీధి మొగదల పెద్దగా అరుపులు వినబడినై. నలుగురైదుగురు బండి వసిగ్ర లూడబీకి బూతులు తిడ్తూ పరుగెత్తేరు. వెనుక వున్న గూడెం నుండి భయపడి ఒక ఆడ మనిషి చంకలో బాబుతో పరుగెత్తుతోంది.

నలుగురి వసిగ్రలూ ఆమె మీద పడ్డయ్. కెవ్వున కేకపెట్టి పడిపోయిందామె. బాబు కేర్ మన్నాడు. చూడలేకపోయినాను. దుర్మార్గులు - హృదయం లేదు.

యింతలో ఎదురుగా అంతా కలిసివున్న గల్లీలో పెద్ద కోలాహలం. తుపాకీల ప్రేలుడు ప్రాణాలు పోతున్నట్లుగా చావు కేకలు.

యింతలో కొందరు అటు నుండి పరుగెత్తుకొచ్చేరు.

నిలదీసి సంగతి అడిగేను. మెయిన్ రోడ్డులో రెండు రేడియో షాపులు, నాలుగైదు కిరాణా దుకాణాలు తగలపెట్టేర్ట. పెద్ద మార్కెట్టులో యిద్దర్ని పొడిచేసేర్ట....

ఓడిపోయిన పెద్దమనిషి గొడవలు లేవదీసేట్ట. పార్టీ కక్షలు ముమ్మరంగా వుండనే వున్నై.

యింతలో వీధి ఆ చివర సైకిలు షాపులకు నిప్పు అంటుకుంది. మళ్ళా అరుపులు. జనం పరుగులు. మాతో మాటలు ఆపి వాళ్ళు కూడ పరిగెత్తేరు.

యింతలో ఒక యువకుడు చిరిగిన బనీనూ, పైజమాతో నెత్తి మీద పెట్టెతో గబగబా బిక్కుబిక్కుమంటూ పరిగెత్తుతున్నాడు.

ఎక్కడ నుండి వచ్చేరో ముగ్గురు రావడం, పట్టుకు పడెయ్యడం - నాలుగు బాదడం జరిగింది. గగ్గోలు పెడ్తూ పారి పోయేడు వాడు. పెట్టె ముక్కముక్కలు చేసేరు.

అయ్యో పాపం అంటున్న నేను సగంలోనే ఆగిపోయేను. పెట్టెలో నుండి బయటపడ్డవి చూసి. అవి బాకులు.

గెలిచిన మనిషి సంబరంతో విజృంభించేడా - లేక ఓడిన మనిషి యీర్ష్యతో చేయిస్తున్నాడా - బోధ పడడం లేదు.

కాని ఒకటి మాత్రం నిజం. వూరు కాలే ముందు అకస్మాత్తుగా పోయిన దీపాలు యింకా వెలగనేలేదు.

కాబట్టి ముందు కుట్రతో యిలా జరిగి వుంటుంది. యిలా జరుగుతుందని వారికో వీరికో తెలుసునన్నమాట ముందుగానే -

"గాడిద కొడుకులు పదవి కోసం వూరిని నాశనం చేసేర్రా. యీ వూరికి పోయే కాలమొచ్చింది. యిది మనం బతికుండగా బాగుపడదు...." చెదురుమదురుగా మాటలు వినిపిస్తున్నయ్. పోయే జనం - వచ్చే జనం ...

అర్ధరాత్రి దాటింది. గలభా కాస్త సద్దు మణిగింది. యింట్లో లోపలికి తలుపు వేసుకుని నిద్దరోతున్నారు. మేము కాంపౌండు గేటు వేసుకుని కుర్చీల్లో చేరగిలబడ్డాం.

కబుర్లు చెప్పుకుంటూనే ఎప్పుడు నిద్రబోయామో మాకే తెలియదు.

కాంపౌండు గోడ పక్క గరుడవర్ధన కొమ్మలు కదిలి వులిక్కిపడి కళ్ళు నులిమి చూస్తే ఓ పదిమంది కత్తులతో వచ్చేస్తున్నారు - గూండాలు - యిద్దరి చేతుల్లో కాగడాలున్నాయ్ ... ఒక్కొక్కడూ గళ్ళ లుంగీలు -- చేతిలో బాకులు --

మాకేం తోచనేలేదు. శిలావతుగా చూస్తూవుండి పోయేం. యింతలో మమ్మల్ని చుట్టుముట్టి మా యిద్దర్నీ చెట్టుకు కట్టేశారు. కాగడా కిరసనాయిలులో ముంచి నిప్పు పెట్టేరు. యింటి తలుపులకు కిరసనాయిలు కొట్టేరు.

తర్వాత మమ్మల్ని కట్టేసిన చెట్టుకు నిప్పు పెట్టేరు.

మేమిద్దరం గుంజుకున్నాం. యిద్దరం రెండు చేతులతో దణ్ణం పెట్టేం. సమయం మించిపోతుందనే భయం ప్రవేశించింది. ప్రేతకళ ఆవహించింది. యింట్లో బాచిగాడు, చెల్లి, అమ్మ, భార్య - నిప్పు పెడ్తారు. భగభగ - మాడి బూడిదవుతారు. అంతా దహనం. అప్పుడే సెగ కొడ్తోంది. అంతా యింటి పని పట్టడానికి అటు తిరిగేరు. యిద్దరం ఎలా అరిచేమో ఏమో - గొంతులు పగిలేటట్లు వూరు దద్దరిల్లేటట్లు - రక్త నాళాలు తెగిపోయి ముక్కుల్లో రక్తం చింది బయట పడ్డది.

యింతలో ఒక తాత పరిగెట్టుకొచ్చి గోడ దూకేడు -

"ఎధవల్లారా - ఆపండ్రా - ఆరి జోలికి పోకండి - మారాజులు ఆరేం చేసేర్రా - ఫోండి -" అరిచేడు తాత. వాడి గొంతు - అది గొంతు కాదు - సింహ గర్జనలా వుంది. గుండాలంతా వులిక్కిపడ్డారు.

వచ్చి మా కట్లు వూడదీసేడు -- ! వాళ్ళను వదిలేయండి - కూడదూ కాదంటే నన్ను చంపి వాళ్ళకు నిప్పు పెట్టండి..! మళ్ళీ అరిచేడు తాత -

అప్పుడు మంట వెలుతుర్లో గుర్తు పట్టేను - ఆ తాత రిక్షా తొక్కుతాడు. వాడి రిక్షాలోనే తరచూ ఆఫీసుకు పోతూ వుంటాను. బేరంలో తకరార్ రాకుండా అడిగినంతా యిచ్చేస్తుంటాను -- ఆ తాత జీవితాన్ని నిర్వచిస్తూ హాస్యోక్తులు ఆడుతూ - కబుర్లు చెప్తూ ప్రతిరోజూ నన్ను ఆఫీసుకు తీసుకెళ్తూ వుంటాడు --

నన్ను చూసి దగ్గరగా వచ్చి --

కాళ్ళు పట్టుకుంటా మా రాజా -- చమించండి.. బోడి ఎదవలకి బుద్ధి లేదు... ఎవరొత్తారో చూత్తా -- మీ పేనాలికి నా పేనం అడ్డు వేస్తాను..! కాళ్ళ మీద పడ్డాడు తాత.

గుండాలు జారుకున్నారు. గలాటాకు యింట్లో నుండి ఏడుపులు, పెడబొబ్బలు -- తలుపులు తెరుచుకుని వచ్చేరు. అమ్మ వచ్చింది. కావిలించుకున్నది నన్ను, ఏడ్చింది. బాబిగాడు తాత మీదకి ఎగబాకుతున్నాడు....

చెల్లెలు, ఆవిడ -- సరేసరి -- కళ్ళు నీటి కుండలు.

తెల్లారబోతోంది. నిద్ర ముంచుకొస్తోంది. తాత అందర్నీ కలగాపులగంగా తిడ్తున్నాడు. వేదాంతం ... యీ ముండాకొడుకులకు చేతులు దురద -- ఎవడు గెలిస్తే ఏందంట?... వూరునంతా స్మశానం చేసేరు... దరిద్రపుగొట్టు ఎదవలు -- ! కాండ్రించి తుపుక్కున వుమ్మేశాడు.

తెల్లారుతోంది. నేనెళ్తాదొరా.. బాబులు చమించాల. చేతులు జోడించి, గేటు తీసుకొని వీధిలోకి వెళ్ళిపోయేడు.

● ● ●

పొద్దున్నే పాలది వచ్చింది.

"యీది చివరి ఎవర్నో చంపేసేరు. తెల్లారురఝామున యింటికి నిప్పు పెట్టడానికి వస్తుంటే చంపేసేరెవరో -- ఆడి చేతులుపడ -- ఏం పోయేకాలమో బాబు" పాలది తట్ట ఎత్తుకుంటూ గొణుగుతూన్నది -

కాఫీ తాగి కరుణాకరం నేనూ బయలుదేరేం సంగతులు తెలుసుకుందామని.

వీధి చివర జనం -- పోలీసులు గుంపును చెదరగొడ్తున్నారు. యిద్దరం గుంపులోకి తొంగి చూచేం - - ఒళ్ళు జలదరించింది... యిద్దరి గొంతుల్లోంచి వచ్చిన మాట యిది ... "తా......తా"

● ● ●

యిప్పుడైనా తెలిసిందా మీకు - - యీ వూళ్ళో ఎప్పుడూ వేడిగా ఎందుకుంటుందో?

యిక్కడి జనాభాలో యీ పగలూ సెగలూ -- ఎప్పుడూ వుండేవే....

యిళ్ళు తగలడ్తుంటే శీతాకాలం నెగళ్ళు వేరే అవసరమా?--

ఎండాకాలం సరేసరి - భస్తాం -- వేడిలో వేడి --

వానాకాలమూ - అడ్డేమిటండీ - పెట్రోలు మంటలకు వాన నీళ్ళు పైపైనే ఆవిరయి పోతయ్.

యీ భగవంతుని బిడ్డలకు ఒకరంటే ఒకరికి పగ - మంట - ఒకరినొకరు కత్తులతో నరుక్కుంటేగాని - ఒకరి గొంతులు ఒకరు పిసుక్కుంటే గాని, ముక్తి రాదు. పదవీ వ్యామోహంలో కళ్ళుపొరలు కప్పినై వీళ్ళకి - వీళ్ళూ మనుషులు - - యీ వూళ్ళో --

యీ వూళ్ళో మూడు కాలాలూ సెగలూ - పగలూ - ఆహా - ఏం వూరండీ!

ప్రచురణ : కృష్ణా పత్రిక 06.05.1967

● ● ●

# విరహావరోహణం

ఆమె ... చంద్రునికై పరితపించు చకోరి .... విరహతప్త హృదయ ...

ఎన్నటికీ ఆ వెన్నెల జోడు ఉదయించడాయె! ఎన్నటికి ఉదయించను!! ఎప్పుడు తన అమృత కిరణాల చూడ్కులు ప్రసరించును!? ఎన్నాళ్ళు ఆమెకీ నిట్టూర్పులు?! ... వెన్నెల రాజు పశ్చిమాద్రి దాటి వచ్చునా?! ఆమె హృదయేశ్వరుడు పడమటి సీమనుండి తిరిగి వచ్చునా?!

ఆమె మనసిచ్చిన మదనుడు పశ్చిమాననే సప్త సముద్రాల కావలివైపున అమెరికాలో శాస్త్ర పరిశోధన చేస్తున్నాడు. ఆమె ప్రోషిత భర్తృక. విరహ తాపానికి ఉష్ణోగ్రత ఎంతో లెక్కగట్టుకుంటున్నది ... యిటు సముద్రాల కివతల ... భరత ఖండాన ... ఆంధ్ర దేశపు రాజధానీ నగరాన ... పిల్లగాలిలో ... డాబాపై !!

మూడు వసంతాలు గడిచినవి ... విరహాగ్ని ఆమెను దహించె ... మన్మధుడి విరశరాల్లా అతగాడు ఎయిరోగ్రాములు రాస్తూనే వున్నాడు ... మన్మథ బాణాల్లాంటి అతడి ఉత్తరాలు నెమ్మదిగా ... హాయిగా తాకెనామెను ... విరహము ద్విగుణీకృతమయినది. ఆమె విరహోత్కంఠిత ... ఆమె నేత్రాలు హమేశా చంచలాలు ... విరహంలో ఎటూ తోచక ఆమె హరిణేక్షణాలు పోస్టు మ్యాన్ కొరకు తమాషాగా నిరీక్షిస్తుంటాయ్.

అదిగో రానే వచ్చెనారోజు... ఆమె ఆశయాలు ఫలించే బంగారు రోజు .... ఆమె నిరీక్షణకు ఫలితం దక్కే యుగాల కావలి ఒకానొక దివ్యమైన రోజు. యిన్నాళ్ళు విరహతాపంలో మరిగిపోయిన ఆమె జ్వలిత హృదయం పరవశించే సుదినం ... యిక విరహిణి కాదు .... ఆనాటి ఉదయం .... ..

పోస్టు మ్యాన్ వచ్చాడు ....

'టెలిగ్రాం!'

తామర తూడుల్లాంటి ఆమె నాజూకు హస్తాలు ఆ మాటతో కంపించినవి... ఆమె గుండె గూళ్ళలో హబ్ డబ్‌ల సంఖ్య త్రిగుణీకృతమైనది... కంపిత హస్తాలతో సంతకం చేసి టెలిగ్రాం విప్పి చూచిందామె.

ఆహా! ... ఏదీ ఆ భయం .... ఏదీ ఆ విరహతాపాగ్ని జ్వాల! ... ఆమె పరిసరాలే మరిచింది.... ఎండ ఏదీ? .... చకోరికి వెన్నెల దొర సందర్శనం కాబోతున్నది. అతడు పశ్చిమాన బయలుదేరాడు.... సముద్రాల కావలివైపున సకల విద్యా పారంగతుడై, విదేశ వేషధారియై ... తనను, తన ప్రియురాలిని పోషించుకొనుటకు . ... మూడువేల రూకల నెలసరి ఆదాయం కొరకు అర్హత సంపాదించి .... విమానంలో ....

అతడు వస్తాడు సాయంత్రానికల్లా.

చంద్రుడూ ప్రభవిస్తాడు .... ఇహ జగమంతా వెన్నెల నురుగులే ....

ఆమె హృదయంలో కోటి కోట్ల మయూరాలు నాట్యమాడినవి.

లక్ష కోట్ల పరభృతాలు పరవశించి గానమాలపించినవి.

శతకోటి సెలయేళ్ళ మధుర ముర్మర ధ్వనులు ధ్వనించినవి.

కోటి నక్షత్రాల కాంతులు ప్రతిఫలించినవి ఆమె హరిణేక్షణాలలో.

సవాలక్ష చంద్రకాంతు లీనినదామె నెమ్మోము.

లక్ష గులాబీల సౌరభం, అరుణిమ, సంతరించుకొన్నవి ఆమె చెక్కిళ్ళు.

సిగ్గుల నిగ్గుల మొగ్గే అయినది ఆమె.

వేయి వేల సంపెంగల, పారిజాతాల, మల్లెల, మొల్లల, మధుర సౌరభాల పిల్ల వాయువులు వీచినట్లాయె ఆమె పూదోటలోన .... వందవేల శరత్తులు, దశ సహస్ర వసంతాలు అనుభవద్యోతకమైనవామెకు.

సహస్ర పూశరాలు మదనుడి నుండి సరఫరా అయినవి.

వందలాది శహనాయిలు, మధుర విపంచీ క్వణక్వణ నిక్వణాలు దశ దిశల ముంచెత్తి - వీనుల విందాయెనామెకు ... ఎంత హాయి ... ఆహా! ఎంత అదృష్టం...

యాబది సితారాల మీట్లు వినిపించె .... ఆమె మానసాకాశాన యేక వింశతి హరివిల్లులు విరిచినవి.

వింశతి మార్లు ఆమె కాళ్ళు తడబడినవి....

పదిహేనుమార్లు చదువుకొన్నది ఆ టెలిగ్రాంను ఆమె ....

పదిసార్లు ముఖ ప్రక్షాళన చేసి, నీవియా క్రీం రుద్ది, పెదిమలకు లిప్‌స్టిక్ ... గోళ్ళకు క్యూటాక్సు పూసుకుని ముస్తాబయినది. ఇంతలో సాయంత్రమాయె.... అతడు వచ్చు వేళాయె.... వెన్నెల జోదు వచ్చునా?! ...

ఎయిరోడ్రోముకు వెళ్ళుటకు ముందు అయిదారు మారులు డ్రెస్ సరిచూచుకొని, కుచ్చెళ్ళు సరిదిద్దుకొనెనామె. ... వ్యానిటీ బాగ్‌లోని సుగంధాల చూర్ణం అద్దుకొని ... మిర్రర్‌లో చూచి పరవశించె.

పోర్టికోలో నాలుగడుగులు వేసెనో లేదో మరల టెలిగ్రాం. ... ఆమెకు మూడు క్షణాలు గుండియలాగిపోయెగదా! తేరుకొని తంతి చింపి చూచె ....

ఆమె రెండు కళ్ళు భయ విభ్రమాలతో విచ్చుకొనియె.

సముద్ర గర్భంలో విమానం గల్లంతు!!

చంద్రుడు రాహు గ్రస్తం!!

హా ప్రియా!

ఆమె గుండియ గూడులో ఒకే ఒక ఆటం బాంబు .... ధాం...!!

నా ప్రియా! నా ప్రియా!

కలయా!! వైష్ణవ మాయయా?!

"అమ్మడూ ఎంతసేపు మొద్దు నిద్ర? లే ... బావ వచ్చే వేళ అయింది." .... అమ్మ .... అమ్మడికి సుప్రభాతం ...

యిది కలయా?!

అవును! కలయే ... అమ్మడి ... కమ్మటి భయంకర కల!!

ప్రచురణ : చుక్కాని 15.03.1965

● ● ●

# ఏడ్చి నవ్విన కథ

హోటల్ ఎస్కిమోలో వుల్లిపాయ మినపట్టు, నెస్‌కెఫె సేవించి వచ్చి, పేవ్‌మెంట్ మీద ఒక వారగా నిలబడి బర్కిలీ పీలుస్తూ, వదలిన తెల్లటి పొగ వలయాల్లోంచి విజయవాడ పురవీధిని తాపీగా 'అబ్జర్వ్' చేస్తున్నాడు సుబ్బారావు - రచయిత అతను.

ఉదయం గంట పదయింది.

రచయిత సుబ్బారావు పత్రికాముఖం నుండి తిరిగి వచ్చిన కథల్లా రోడ్డు మీద జన సందోహం.

రిక్షాలు - కార్లు ...

బిచ్చగాళ్ళు - పొగదుమ్ము ...

తారువాసన - వెల్‌కమ్ హోటల్ కౌంటర్‌లో - రేడియోలో - సితారు సంగీతం -

ఏలూరు కాల్వ ఒడ్లు ఒరుసుకుంటూ మందంగా వ్యాపిస్తూ వస్తున్న దుర్గంధం ....

శిథిలమైన కట్టడ అవశేషాలు, మొండి గోడల కిరీటంలో గాంధీ పర్వతం దూరంగా, వెనుక యింద్ర కీలాద్రి - 'ఎస్కిమో' సెంటర్‌లో మలుపు తిరిగిన 'చిట్టి నగర్' మూడో నంబర్ బస్సు.

పత్రికలకు కథ పంపిన మరుక్షణం నుండీ అది పత్రికలో అచ్చవుతుందని ఆశించే సుబ్బారావు మనసులోని అందమైన ఆశలా తెల్లటి నల్లటి దుమ్ము. గుప్పుమని లేచిన దుమ్ము.

'యెస్సారెమ్' ఆఫీసు ముందు పగిలిన సిమెంటు రోడ్డు మీద గాడిలో ముందు వీల్ ఇరుక్కుని 'ఛర్' మని వెనుకకు తిరిగి నాట్యం చేసిన ఒక సైకిలు వెనుక చక్రం.

యివన్నీ సుబ్బారావు అనంతకోటి పరిశీలనా వస్తువుల్లో కొన్ని.

అయిదేళ్ళుగా సుబ్బారావు విజయవాడ పట్టణంలోని ప్రతి చదరపు అంగుళాన్నీ పరిశీలిస్తూనే వున్నాడు. ఏదో వస్తువు తీసుకుని లెక్కలేనన్ని కథలూ రాశాడు. అవి పత్రికలలో ప్రచురణకు నోచుకున్నదీ లేనిదీ వేరే విషయం. ఆ విషయం ఎన్నో పరిస్థితులపై ఆధారపడి వుంటుంది.

సుబ్బారావు యీ దీపావళికి కూడ పత్రిక వారు ప్రకటన చేసిన మరురోజు నాలుగు కథలను పోటీకి పోస్ట్ చేసాడు.

ఆమాటకొస్తే గత అయిదేళ్ళుగా అలా చేస్తూనే వున్నాడు. ప్రతియేటా అతను పోటీకి కథలు పంపడం నరకచతుర్ధశి, అమావాస్య వెళ్ళిన మర్నాడే భద్రంగా అన్నీ బీరుపోకుండా తిరిగి రావడం, అసంకల్పిత ప్రతీకార చర్యకు ఒక చక్కని వుదాహరణ అని కూడ అనుకున్నాడు సుబ్బారావు - భారంగా.

కాని యీసారి కథలు తనకున్న భావనా పటిమనంతా ధారపోసి మరీ రాశాడు సుబ్బారావు. యిదివరకెన్నడూ ప్రయోగించని గొప్ప శైలిని గుప్పించి మరీ రాశాడు సుబ్బారావు.

ఈ సంవత్సరం నాలుగు కథలలో ఏదో ఒకదానికి బహుమతి థపీమని వచ్చితీరాలి.

నాలుగు కథల్లో ఒకటి 'విరిగిన కొమ్మలు' అలాంటి కథ - ఆ కథాశిల్పం, శైలి యింతవరకు తెలుగు కథా సాహిత్యంలోనే రాలేదు. అసలు యితివృత్తంలోనే ప్రత్యేకత వున్నది. దానిని చదివిన తర్వాత ఎవరికైనా హృదయం కరగకుండా వుండదు. దానికి ఏదో ప్రైజ్ ష్యూర్....

'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ కావేవీ కవితకనర్హం' అన్నట్లు సుబ్బారావు తనని నిత్యజీవితంలో వేధించే ఝుంఝొప్పొగు మీద కూడ కథ రాశాడు. ఆ కథ నవరస భరితం. అందులో నవరసాలు పిండడంతో చాల శ్రమ పడ్డాడు. ఆ కథ పేరు 'ఝుంఝొప్పొగు'.

దానిని చదివిన తర్వాత మరొక కథకు ప్రైజ్ యిద్దామనిపించదు - ఎవరికైనా.

'వెచ్చటి వెన్నెల' మరోటి. కరుణరస ప్రధానం. అది చదివిన వాడి హృదయం జామ్మని కరిగి జలజలా ప్రవహించాలి మంచు కరిగినట్లు.

తనకున్న టాలెంట్ అంత ఆ కథలోనే ప్రతిఫలిస్తుందని సుబ్బారావు భావన.

'ఆకాశం ఏడ్చింది' మహా గొప్ప ట్రాజెడీ. షేక్స్పియర్ ట్రాజెడీలను తలదన్నేది ఇది అంటాడు సుబ్బారావును కదిపితే.

పోటీ కథలు సెలెక్ట్ కమిటీలో ట్రెజెడీలు లైక్ చేసే వారుంటే దీన్ని తప్పించుకునిపోలేరు ఎవరూ.

ఏ కోణం నుండి ఆలోచించినా యీసారి తన కథలకు బహుమతి యివ్వకపోవడానికి ఏ చిన్న కారణమూ దొరకలేదు సుబ్బారావుకు.

'నాతో మాట్లాడవే ఒక ఎడ్యుకేషన్' అని ఆ గిరీశం అన్నట్టు 'తన కథలకు ప్రైజ్ యివ్వడవే సదరు పత్రికకు ఒక క్రెడిట్ - గొప్ప ఘనత!'

తన ప్రచురితమైన మొదటి కథకు మొదటి బహుమతి యిచ్చిన ఘనత ఆ పత్రికకే కదా అనుకుంటాడు రచయిత సుబ్బారావు. యీసారి కూడా కథలు పంపిన మర్నాటినుండి రాత్రిపూట కలర్‌పుల్‌గా కలలు కంటూనే వున్నాడు సుబ్బారావు.

తోటి రచయిత 'కాంత్' తనను ఫెలిసిటేట్ చేస్తున్నట్లు, తన కథకు ఫస్టు ప్రయిజు వచ్చినట్లు, స్నేహితులు పార్టీలు యిస్తున్నట్లు - బ్రహ్మరథం పడ్తున్నట్లు - రథం మీద చిట్టచివర అందంగా అలంకరించిన పీఠంపైన తనను కూర్చోబెట్టినట్టు కల.

అకస్మాత్తుగా రథం ఒరిగింది. సుబ్బారావు కూర్చున్న పీఠమూ తొణికింది. యింకేముంది. రథాగ్రం నుండి సూటిగా - ధాటుగా క్రింద పడ్డాడు. 'కేవ్' మని అరిచాడు భయంతో, కల చెదిరింది.

ఎదురుగా టేబుల్ పైన టైంపీస్ గంట రెండు చూపిస్తున్నది.

కాస్త ఎడంగా పట్టెమంచం పైన సుబ్బులక్ష్మి ఆదమరచి నిద్రపోతోంది.

సుబ్బులక్ష్మి సుబ్బారావు అర్థాంగిలెండి! పక్కమీద ఏదో రాస్తూరాస్తూ పడి నిద్రపోయిన సుబ్బారావు నిబ్‌పాయింట్ కేంద్రంగా ఆరంగుళాల వ్యాసార్థంతో నల్లటి వృత్తం. పెన్నులోని సిరానంతా పీల్చేసుకున్నది పరుపు.

రథాగ్రంచుండి కింద పడ్డ షాక్‌లో కూడ వాస్తవంగా జరిగింది గ్రహించిన సుబ్బారావు సిరామరక చూస్తూ పగలబడి నవ్వుకున్నాడు. సైలెంట్ పిస్టల్ లాగ పైకి వినపడకుండా.

సుబ్బారావు గొప్ప ఆప్టిమిస్ట్. చెడు ఏమన్నావుంటే - తనపై శనిగాడి దృక్కోణం కాస్తో కూస్తో వుంటే యీ పీడ కలతో అది కూడా కొట్టుకుపోయిందని - తన ప్రతిభకు, తన అసాధారణ వ్యక్తిత్వానికి ఆ పరుపుమీది సిరామరక దిష్టిబొమ్మ అనీ భావించాడు.

తనకు ప్రైజు వస్తుందని గఠిగా నమ్మిన సుబ్బారావు ఆ వచ్చే డబ్బుతో ఏంచేయాలో ప్రణాళికలు వేసుకుంటూ ఆ మిగతా రాత్రి నిద్రపోనేలేదు.

యీసారి తన కథకు బహుమతి షూర్ .... .. .

యీ దెబ్బతో తన పేరు దేశం - ఛ - దేశమే ఖర్మ. ప్రపంచం నలుమూలలా పాకిపోతుంది.

యీ అదనులో పెట్టెలో వుక్కిరిబిక్కిరవుతున్న రచనల దొంతరలకు ప్రచురణ యోగం పడుతుంది.

అబ్బ ఎన్నిరకాల రచనలు!

కథలు, కథానికలు, పొట్టికథలు, పొడుగు కథలు, నవలలు, బుచ్చి నవలలు, స్కెచ్‌లు, డిటెక్టివ్ కథలు, నాటకాలు, నాటికలు, ఏకపాత్రాభినయాలు, ద్విపాత్రాభినయాలు, బహుపాత్రాభినయాలు, సహస్ర పాత్రాభినయాలు!!!

ఐయాన్ ఫ్లెమింగ్, అగాధా క్రిస్టీ, నెవిల్ ఘూట్, డెనిస్‌వీట్లీ - వీరంతా ఎక్కడికి పోతారో - వీరంతా తన ప్రతిభ చాటున మరుగున పడిపోతారు.

ఛార్లెస్ డికెన్స్ - వెల్స్ - స్టిన్‌బెక్ - ఎడ్గార్ వాలెస్ - మామ్ - వోడ్‌హౌస్ - కొనల్‌డైల్ -

వీరందరికీ ముందు సుబ్బారావు పేరు - టెలుగూ రైటర్ సుబ్బారావు పేరు సాహిత్య ఆకాశంలో ధృవతార!

ఒహో! సుబ్బారావుదే అగ్రస్థానం.

యివన్నీ సుబ్బారావు తీయటి కలల దొంతరలు.

రచయిత అనే వ్యక్తికి ప్రత్యేకమైన అలవాట్లు, ఆకృతి, కట్టూబొట్టూ వుండాలంటాడు సుబ్బారావు.

ఆ అభిప్రాయానికి కట్టుబడి తనూ వుంటాడు. టినోపాల్‌లో వుతికించిన తెల్లటి మల్లెపూవులాంటి పైజామా, సిల్కులాల్చీ, నల్లద్దాల కళ్ళజోడు, ఆకుచెప్పులు, గిరజాల జుట్టు, తర్జనికీ మధ్య వేలికి నడుమ బర్కిలీ సిగరెట్ - ఎడంచేతిలో ప్లాస్టిక్ కవర్ గల గ్లేజు కాగితాల నోట్ బుక్కు - జేబులో గోల్డు కాప్ పైలట్ పెన్ - తనకు గిరజాల జుట్టు వున్నదని అందరినీ తనలాగే వుండాలని బలవంతం చేయడు సుబ్బారావు. వారివారి శరీరతత్వాలను బట్టి కేశసంపద లభిస్తుంది కాబట్టి రచయితగా చెలామణీ అవబోయే ముందు జులపాలకు అంత ప్రాధాన్యత అవసరం లేదని మన రచయిత సుబ్బారావు వువాచ.

అలాగే నల్లద్దాల కళ్ళజోడున్నూ - ప్రాంతీయ వాతావరణాన్ని పరిసరాల్ని బట్టి గాగుల్స్ వాడాలంటాడు. ప్రత్యేకించి విజయవాడ రచయితలకే నల్లద్దాల కళ్ళజోడు అవసరమని అతని అభిప్రాయం.

విజయవాడ రోడ్ల మీద, యిళ్లలోను సతతమూ లోయలో మంచుతెరలా, చలికాలం పొద్దున పూట పొగమంచు పొరలా దుమ్ము వ్యాపించే వుంటుంది.

కాబట్టి నేత్ర రక్షణ కోసం నల్లకళ్ళజోడు వాడకం అనివార్యం.

యీ పై లక్షణాలకు అనుబంధంగా రచయిత అయే ముందు ప్రతివ్యక్తీ అబ్జర్వేషన్ నేర్చుకోవాలంటాడు సుబ్బారావు.

కాని సుబ్బారావు మొట్టమొదట రచయిత అయిన తర్వాతనే అబ్జర్వ్ చేయడం నేర్చుకున్నాడు.

బెజవాడ సైడు కాలవ దగ్గర్నుండి డ్రైనేజ్ గుంటల వరకు - కాలికి ఎదురు దెబ్బలు కొట్టే గతుకుల రోడ్డుమీది కంకర రాయి నుండి, 'మాచారం' కొండ వరకు అబ్జర్వ్ చేసాడు.

ఆ పరిశీలనలో ఏదో వస్తువు, సంఘటన అతనిని ఓ కథ రాయమని ఇన్‌స్పైర్ చేస్తుంది.

వెంటనే ఆ అబ్జర్వేషన్ చాలించి, స్నేహితులు వుండమన్నా వుండకుండా హడావుడిగా

యింటికి పరిగెత్తి - గబగబా తెల్లకాగితం మీద మనసులో వుబికి వచ్చేది కాస్తా కక్కేసేవరకూ వాళ్ళ అమ్మ పిలిచినా, వాళ్ళావిడ చిలిపిగా పిలిచి వలపు కురిపించినా, కదలడు - మెదలడు.

చెప్పడం మరిచా, రచయిత సుబ్బారావు పెళ్ళయిన తర్వాతనే కథలు రాయసాగాడు. సుబ్బారావుకు కథారచనలో యిన్‌స్పైర్ చేసే పదార్థాలలో సుబ్బులక్ష్మి ఒకటి. అలా ఎస్కిమో దగ్గర తాపీగా పరిశీలిస్తూ, బర్కిలీ ధూమంతో బాటు దుమ్మును కూడ పీలుస్తున్న సుబ్బారావు భుజం మీద వెనుకనుండి ఒక చెయ్యిపడ్డది. ఆ హస్తం స్వంతదారు వెంకట్రావు. వెంకట్రావు సుబ్బారావు సహస్ర మిత్ర సముదాయంలో ఒకడు.

సుబ్బారావు వెనక్కి తిరిగి వెంకట్రావుని పరిశీలిస్తూ అతని ముఖం మీదికి ధూమవలయాలు విసురుతూ హలో అన్నాడు.

'నీకీవిషయం తెలుసా?!' అన్నాడు వెంకట్రావు సుబ్బారావు 'హలో'కి జవాబుగా.

'ఏ విషయమో చెప్పు - తెలుసో, 'తెలియదో, చెప్తా'నన్నాడు రచయిత సుబ్బారావు. సుబ్బారావు ఈమధ్యనే లాజిక్ స్టడీ చేశాడు. అతని సంభాషణ లాజికల్‌గా వుంటుంది.

'ఏ విషయమేంటీ - నీ మొహం వూరూవాడా ఏకమై అట్టుడికినట్లు వుడికిపోతుంటేనూ' -

"అట్టుడికినట్లుడుకుతోందో, కాఫీ మరిగినట్లు మరుగుతోందో - నేను మాత్రం ఇప్పుడే అట్టూ, కాఫీ ఆరగారగా ఆరగించి వస్తున్నానోయ్" అన్నాడు మరో దమ్ము లాగుతూ సుబ్బారావు.

'కాంత్'కు వాడి 'బటాణీపూల'కు సెకండ్ ప్రైజ్ వచ్చింది. టెలిగ్రాం వచ్చింది. యిప్పుడే - నీకురాలా?'

మరో దమ్ము నషాళానికి లాగి 'హా-' అన్నాడు సుబ్బారావు.

'హా లేదు హీ లేదు - యిది ముచ్చటగా ముమ్మాటికీ నిజం'

'కాంత్ గాడికి ప్రైజొచ్చిందా?!'

'నిన్ను బ్లఫ్ చేస్తే నాకు ఒరిగేదేముంది?'

'నిజం?..' సుబ్బారావు సిగరెట్ గబగబా నాలుగు దమ్ములు పీల్చి విసిరి పారేశాడు.

'నిజం'

'నువు సరిగ్గా వినివుండవ్'

'నా కళ్ళారా చూసి అక్కడినుండే నేను వస్తూంట. రసమూ, విషమూ, నవరసమూ అని నాలుగు రాసి పంపితివిగా, నిన్న మొన్ననగా రాయడం మొదలుపెట్టి అప్పుడే ప్రైజ్ కొట్టేశాడు. లక్కీ ఫెలో భలే రాపిడ్‌గా ఫేమ్‌లోకి వచ్చేసాడు.'

వెంకట్రావు నోరారా వస్తున్న 'కాంత్' పొగడ్త సుబ్బారావుకి వాంతి కలిగించింది.

వెంకట్రావు దవడ ఎడాపెడా చడామడా వాయగొడ్దామనిపించింది అతనికి.

కాంత్‌కి ప్రైజు వచ్చినదని చెప్పడంతో ఆగక తనని విమర్శిస్తున్నాడు. యింకా పైగా రాపిడ్‌గా పైకి వచ్చాట్ట.

అంటే తను తాబేటి నడక గాడనేగా?

'కాంత్' గాడి అసలు పేరు కాంతయ్య. వాడిని యిన్‌స్పైర్ చేసింది తను. అసలు వాడి కథ బటాణీపూలకు మెరుగులు పెట్టింది, రంగులు పులిమింది తను. వాడికి ప్రైజు రావడమూ తనకు రాకపోవడమూనా - '

ఆనాటి రాత్రి కలలో రథం మీద నుండి కింద పడ్డట్లయింది సుబ్బారావుకు.

అతని అముద్రిత కథారాజాల్ని ఒక గోతిలో పోసి కళ్ళముందే పెట్రోలు వేసి నిప్పు ముట్టించినట్లయింది.

సుబ్బారావు తల గిర్రున తిరిగిపోతోంది. రాత్రి ఒంటిగంట వరకూ నిద్ర లేకుండా కథలు రాసినా అతని తల తిరిగేది కాదు! తమాయించుకుని, సీరియస్‌గా కనుబొమ్మలు చిట్లించి, వెంకట్రావ్ ముఖంలోకి చూచాడు.

'అయితే నాకూ టెలిగ్రాం వచ్చివుంటుంది. యిక్కడే వుండు వస్తా' అంటూ అటుగా ఖాళీ రిక్షా పోతుంటే - వెంకట్రావు పిలుస్తున్నా వినకుండా వెళ్ళి దాంట్లో పోయి పడ్డాడు.

'సత్యన్నారాయణపురం శివాలయం దగ్గరకు పోనీయ్' అన్నాడు సుబ్బారావు.

మస్తిష్కంలో ఆలోచనలు అతన్ని వుక్కిరిబిక్కిరి చేస్తున్నయ్. కాంత్ గాడికి రావడమేమిటి? డామ్ అబ్సర్డు వాడికి ఆఫ్టరాల్ సెకండ్ ప్రైజు గదా వచ్చింది. తనకు ఫస్టు ప్రైజు వచ్చేవుంటుంది ష్యూర్ -

గాంధీనగరం గతుకుల రోడ్డు మీద పడుతూ లేస్తూ వేగంగా పోతోంది రిక్షా. సుబ్బారావు హృదయం అతని కథ పత్రిక నుండి తిరిగి వచ్చినంత వేగంగా, వ్యవధానం లేకుండా కొట్టుకుంటున్నది.

యింతలో మురుగు కాలవలోని వరాహం ఒకటి జలకమాడి హడావుడిగా తోకాడించుకుంటూ వచ్చి రిక్షాకు అడ్డం పడ్డది.

సుబ్బారావు కథ రాసేటప్పుడు భావాలు దొరక్క కలం కుంటుపడ్డప్పుడు విసుక్కున్నట్లు విసుగ్గా విసుక్కున్నాడు.

యింతలో 'ప్రజారోగ్య శాఖ ప్రచార మోటారు' రాష్‌గా దూసుకుపోయింది - కొండంత దుమ్ము లేపుకుంటూ.

రోడ్ల మీద ఎక్కడపడితే అక్కడ దుమ్ము, పందుల వాసన.

యీ ప్రచార మోటారు ఎంత ప్రచారం చేస్తే మటుకు - ఆరోగ్యం ఎక్కడనుండి వస్తుందిట, అని మరోసారి విసుక్కున్నాడు సుబ్బారావు - ఎక్స్‌పెక్టెడ్ ప్రైజ్ విన్నర్.

'వరహావతారం' అని కథ రాసేద్దామనుకున్నాడు - ఆ విసుగులోనే.

ఎవరూ ప్రచురించుకోకపోతే యింట్లో సందుగు పెట్టెలో పోగయిన దొంతర్లలో అదీ ఒకటి అవుతుంది. అన్ని వ్రాత ప్రతులకు స్థానం కల్పించిన తను, భారతదేశం కాందిశీకులకు పునరావాసం కల్పించినట్లు, యీ కథకూ కాస్తంత 'షెల్టర్' - చోటు, చూపించకపోడు - అనుకున్నాడు.

అసలు రచయితలను వారి మహా ప్రస్థానానంతరమే పాఠకలోకం గుర్తిస్తుందట. దీనికి తార్కాణాలు కోకొల్లలు చరిత్రలో. బతికినన్నాళ్ళూ రచయితను నోరెత్తి పొగడని జనం, రచయిత పరలోక వాసి కాగానే సంతాప సభలు - జీవిత చరిత్రలు - అతని రచనల సంపుటాలు - ఘనమైన పొగడ్తలు - సుబ్బారావుకో మంచి వూహ తోచింది.

తను ఏ యాక్సిడెంటో అయి చనిపోతే -

ప్రజారోగ్య శాఖ ప్రచార మోటారు తన మీద నుండి పోయి వుండకూడదూ. యింట్లో మురిగిపోతున్న కథలన్నిటినీ పత్రికలు సీరియల్‌గా ప్రచురించివేస్తాయ్ అని అనుకుని తిరిగి చావకూడదని కూడ నిర్ణయించుకుని, చావకుండా, చచ్చినట్లు కుక్కిన పేనల్లే అచేతనంగా రిక్షాలో కూర్చుండిపోయాడు సుబ్బారావు.

తప్పక టెలిగ్రాం వచ్చే వుంటుంది యింటికి తనకు ఫస్టు ప్రైజు - తప్పదు -

యింతలో గతుకుల్లో రిక్షా ఎగిరిపడ్డది.

కథ తిరిగి వచ్చినప్పుడు అతని హృదయం కలుక్కుమన్నట్లు సుబ్బారావు నడుం కలుక్కుమన్నది. యింకా రెండున్నర ఫర్లాంగులు పోవాలి. యింకా సత్యన్నారాయణపురం గేటు కూడ రాలేదు.

తీరా రైల్వే గేటు సమీపించేటప్పటికి, గేటు వేసేసి వుంది. గేటుకు అటూఇటూ రిక్షాలు, సైకిళ్ళు స్తంభించి వున్నై.

చిట్టినగర్ 3వ నంబరు బస్సు హారన్ వేస్తోంది. సుబ్బారావు హృదయ రోదనలా, అది హారన్ వేస్తే గేటు తెరవబోతున్నట్లు మహా!

కొందరు సైకిళ్ళు ఎత్తుకుని సైడ్ ట్రాక్ నుండి వెళ్ళిపోతున్నారు.

ఛీ - ఇది కూడా యిప్పుడేనా - బుద్ధి లేదు - ఎప్పుడొచ్చినా గేటు వేసే వుంటుంది. అని చెడామడా తిట్టుకున్నాడు సుబ్బారావు గేటుని.

గబగబా దిగాడు. రిక్షావాడి చేతిలో చిల్లర డబ్బులు పడేసి నాలుగు అంగల్లో గేటు దాటాడు.

అదుగో - శివాలయం - యిల్లు కూడ దగ్గర పడుతున్నది.

సుబ్బారావు ఆతృత ఎక్కువైంది. కథ రాసేప్పుడు ముగింపు దగ్గర అలాగే ఆతృత పడ్తాడు అతను.

సుబ్బలక్ష్మీ, అమ్మో టెలిగ్రాం పట్టుకుని గుమ్మంలోనే వుంటారు.

యీపాటికే తెలిసిపోయి, నలుగురూ చేరి గొప్పగా చెప్పుకుంటూ వుంటారు. స్నేహితులు సైకిళ్ళు వేసుకొని తనను వెతుకుతూ వుంటారు యీపాటికే - అనుకుంటూ గబగబా పరిగెత్తినంత పనిచేసి - రొప్పుతూ యింటి ముందు నిలబడ్డాడు సుబ్బారావు.

యిల్లు ప్రశాంతంగా వుంది - భావాలు రానప్పుడు అతని మనసులా.

వీధి తలుపు ఎప్పుడూ తెరిచేవుండేది, యిప్పుడు దగ్గరకు వేసివుంది.

వాకిట్లో మెట్ల దగ్గర .... మురుగు కాలవ పొంగి పావనం చేస్తే యిసక పోయించారు.

అకస్మాత్తుగా సుబ్బారావు అబ్జర్వేషన్ యిసుక నేలమీద సైకిలు టైర్ల గుర్తులు పట్టేసింది.

'హా - దొరికెన్' అన్నాడు పైకే సుబ్బారావు. ముందు లోపల అనుకొని - సంబరపడి - ఆనందంలోపలే యిముడ్చుకోలేక.

పత్రికలో తన కథ అచ్చులో చూసుకున్నంత వుక్కిరి బిక్కిరై పోయాడు - రచయిత సుబ్బారావు.

మళ్ళీ ఎక్జాట్లీ అనుకున్నాడు - గుర్తులు పరీక్షిస్తూ డిటెక్టివ్ పోజు పెట్టూ -

'మెసెంజర్ సైకిలు గుర్తులే - పత్రిక వారి నుండి మెసేజ్ వుంటుంది.

ఎవరికోసమిస్తారు? -'

గబగబా తలుపు తోసుకుని లోపలికి పోయి పడ్డాడు.

రోజూ నానారభసగా వుండే యిల్లు 'గృహమే కదా స్వర్గసీమా'ని తలపిస్తున్నది.

వాలుకుర్చీలో సుబ్బారావు తండ్రి చేబ్రోలు పుగాకు చుట్ట ఝామ్మని పీలుస్తూ ఎదురుగా చాపమీద కూర్చున్న తల్లితో చెణుకులు విసురుతున్నాడు.

ఆ- ఇవాళ సుదినం...

నాకు ప్రైజు వచ్చిన మహర్దినం -

అని అనుకున్నాడు. అనుకుని సన్నగా యీల వేశాడు.

అప్పటివరకు అక్కడే వున్న సుబ్బులక్ష్మి రెండు చేతులలో ఏదో దాచుకుని పమిటె కొంగు చాటు చేసుకుని లోపలి గదిలోకి మళ్ళిపోయింది. చకచకా - సుబ్బారావు కథ రాసినంత స్పీడుగా.

'ఆ ... దొరికిందిరా దొంగ - ' అనుకొన్నాడు సుబ్బారావు.

'సుబ్బులు టెలిగ్రాం దాస్తున్నది సుబ్బులు నా వరహాల సుబ్బులూ..' అనుకున్నాడు - గాగుల్స్ తీసి లాల్చీ జేబులో దోపుకుంటూ..

'అబ్బాయ్ హుషారుగా వున్నాడేవ్ - యీల వేస్తున్నాడు' అన్నాడు ముసిలాయన - బోసి నోరు తెరిచి నవ్వుతూ.

'ఆకలిగా లేదుట్రా నీకు - మేం భోజనం చేసి కూర్చున్నాం. నువు కూడ తిను పో - సుబ్బులు పెట్తుంది.' అన్నది సుబ్బారావు తల్లి. ఆమె మొహంలో కూడ నవ్వు.

అదుగో - అమ్మ అలా నవ్వుతుందేమిటి? - టెలిగ్రాం విషయం ఎవరూ చెప్పరే - టెలిగ్రాం వచ్చేవుంటుంది - '

సుబ్బారావు ఎందుకో తనూ నవ్వాడు.

'ఎందుకే నవ్వుతున్నావ్' అన్నాడు తల్లిని. పెద్ద - తను నవ్వడానికి ఒక కారణం వున్నట్లు.

'అయ్యో - మేమేదో మాట్లాడుకుంటున్నాం - వూరికే - వెళ్ళి - భోంచెయ్ - కోడలు చెప్తుందిలే'

'హా కోడలు చెప్తుందిగా' అని ఒకేఒక్క గంతులో గదిలోకి పోయి పడ్డాడు.

నిజం - సుబ్బులు చేతిలో టెలిగ్రాం వుండేవుంటుంది. అంతా సస్పెన్స్‌లో పెట్టి చంపేస్తున్నారు.

సుబ్బారావు లాల్చీ చేతులు పైకి తోసి యీల వేస్తూ సుబ్బులును సమీపించాడు.

సుబ్బులు యింకా పమిట కొంగులో చేతులు ముడుచుకుని దాచుకొనే వుంది. దగ్గరకు వస్తున్న సుబ్బారావును చూసి కుంచించుకుపోతూ - ముసిముసి నవ్వులు నవ్వింది.

ఆమె ముఖం తను రాసిన కథల్లోని శిల్పంలా అందంగా వుంది సుబ్బారావుకు. 'ఏవిటోయ్ సంగతీ-' అన్నాడు సుబ్బులు దగ్గరగా చేరుతూ సుబ్బారావు.

'ఏమీలేదు ... -' అంటూ చేతులు వెనుకకు తీసుకున్నది సుబ్బులు.

'ఏదో వున్నది - దాస్తున్నావ్ - నీ మొహమే చెప్తోంది' అన్నాడు సుబ్బారావు - ఫేస్ రీడింగ్‌లో దిట్ట అయినట్లు -

'యిదొహటా - బాగానే వుంది - ఏమీ లేదండీ' సుబ్బులు సిగ్గు పడ్డది.

సుబ్బారావు ఆమె కళ్ళలోకి చూస్తూ 'ఏమోయ్ యివాళ యింత అందంగా వున్నావ్'' అన్నాడు.

'సరేలెండి - మేమంతా తిని కూర్చున్నాం. కాళ్ళు కడుక్కోండి. భోంచేద్దురు గాని'

''ఏమోయ్ తప్పుదోవ పట్టిస్తున్నావ్ - నీ చేతిలోదేమిటీ?''

''ఏమీ లేదే - ఏముందీ'' సుబ్బులు సిగ్గు పడ్డది. -

నవ్వింది నైస్‌గా.

సుబ్బారావుకు - కథ రాసేస్తుంటే - పెన్నులో సిరా అయిపోయినప్పుడు ఆతృత కలిగినట్లు ఆతృత అస్తిమితత ఎక్కువైంది.

'ఏదో వుందిలే - చూపించవా?'

'అయ్యో - యేమీ లేదండీ-!'

'టెలిగ్రాం రాలా?'

'యే టెలిగ్రామూ?'

'యిందాక యేదో చూసాలేవోయ్ నీ చేతిలో - మరీ దాచకు'

'అబ్బ - యేమీ లేదండీ - వస్తే నేనియ్యనూ'

'వున్నది-'

'లేదు-'

'వున్నది చూపించు'

'అబ్బ - పిల్లాడిలా - మంకుపట్టు - ఏమీ లేదంటే వినరేమిటి బాబూ'

'ఏదీ చేతులు బయటకు తియ్'

'వుహు - తీయను....'' సుబ్బులు బుగ్గలు ఎరుపెక్కినై. మళ్ళీ నవ్వింది.

'హాస్యానికి కూడా హద్దుండాలి.... అదేమిటో .... త్వరగా యివ్వు - ఆ..'

సుబ్బారావు ఓర్పు నశిస్తోంది.... ఆతృత రెచ్చిపోతోంది.

'టెలిగ్రాం వస్తే - నేను తింటానా - యివ్వనూ'

ఒళ్ళుమండి పోతోంది సుబ్బారావుకు. సుబ్బులక్ష్మి మీద అంత కోపమెన్నడూ రాలా సుబ్బారావుకు. కథలు తిప్పి పంపిన పత్రికల వారి మీద వచ్చినంత కోపమొచ్చింది.

'చాల్లే - నీ తెలివితేటలు - సంతోషించా గానీ - యిస్తావా యివ్వవా! టెలిగ్రాం'

'లేదు - ఇవ్వను'

'యివ్వవన్న మాట'

'ఉంటేగదా - లేకపోతే ఎలా యివ్వడం?'

సుబ్బులక్ష్మి ముఖంలో సంతోషం కూడ నశిస్తున్నది. ముఖం చిన్నబుచ్చుకున్నది సుబ్బారావు బుల్లికథలా.

టెలిగ్రాం కాకపోతే మరేమిటి? గద్దించాడు సుబ్బారావు.

మంత్రిగారు వచ్చేముందు బాగు చేయించిన రోడ్డులా సుబ్బులక్ష్మి. తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో 'అబ్బ చెప్పకూడదండీ!' అన్నది

సుబ్బారావు కోపం గ్రహించి, సుబ్బులక్ష్మి రెండడుగులు వెనక్కివేసింది.

'కోపం తెప్పించకు - మర్యాదగా చూపించు'

'వూహు' మళ్ళీ అదే నవ్వు. సుబ్బులు మొహంలోన కథలు తిప్పి పంపిన పత్రికల వారంతా పగలబడి నవ్వినట్టనిపించింది సుబ్బారావుకు.

సుబ్బులు నవ్వు సుబ్బారావుని రెచ్చగొట్టింది.

'యివ్వవూ' రెట్టించాడు ఆఖరి ఛాన్సు అన్నట్లు.

'వూహూ... అత్తయ్యా... చూడండీ'

సుబ్బులు చెంప చెళ్ళుమన్నది.

సుబ్బులు కళ్ళలో నీళ్ళు తిరిగినై గిర్రున.

సుబ్బులు యిప్పటివరకూ దాచుకున్న హస్తద్వయం బయట పడ్డది.

ఆత్రుతగా అర్థాంగి హస్తద్వయం చూచిన సుబ్బారావు నిలువునా వణికిపోయాడు... నీరు కారిపోయాడు... వంద గోల్డు క్యాప్ పైలట్‌లతో గుండెల్లో పొడిచినట్లు బాధపడ్డాడు.

సుబ్బారావు పశ్చాత్తాపపడ్డాడు సుబ్బులక్ష్మిని కొట్టినందుకు. పశ్చాత్తాపపడ్డ తర్వాత అతని పళ్ళు జలదరించినై. నోరు పులిసింది. 'అబ్బ!' అనుకొంటూ లొట్టలు వేశాడు.

సుబ్బులు చేతుల్లో ఏమీ లేకపోయినా అంత బాధ పడకపోను.

కాని సుబ్బులు చేతిలో వున్నది టెలిగ్రాం కాదు. మరో కమ్మటి శుభవార్తకు ప్రతీక.

పొడుగాటి, లావుపాటి కణుపులు గల చింతకాయ - సగం కొరికేసి రుచిచూచిన రొడ్డు చింతకాయ. సుబ్బులక్ష్మి కేకకు సుబ్బారావు తల్లి పరుగెత్తుకొచ్చింది. జరిగింది గ్రహించింది.

'ఏమిరా అది - దాని మీద చేయి చేసుకుంటావు - అది వొఠ్ఠిమనిషి కూడ కాదు' అన్నది ఆమె.

'ఎండలో తిరిగిరావడమూ ... ఎక్కడ లేని కోపమూ దాని మీద చూపించడమూనూ....'

కుర్చీలో కూర్చునే ముసిలాయన నసుగుడు.

సుబ్బులు తల వంచుకుని ... నవ్వు ఆపుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ వంటింట్లోకి దారితీసింది.

సుబ్బులుకన్నా ఎక్కువ సుబ్బారావు సిగ్గుపడిపోయాడు.

'హా సుబ్బులక్ష్మి వొఠ్ఠి మనిషి కాదూ ... అయితే భలే గఠ్ఠి మనిషే' అనుకున్నాడు.

'పిచ్చినాగన్న' అనుక్నుది వాళ్ళమ్మ.

'సుబ్బారావుగారున్నారా!' అన్నాడు వాకింట్లోంచి ఎవరో.

'పోస్టు మనిషి వచ్చాడు యిటురా అబ్బాయ్' అన్నాడు ముసిలాయన.

'హా పోస్టే!' అని పరుగుతీసాడు సుబ్బారావు.

'టెలిగ్రాం వచ్చింది ... సుబ్బారావుగారూ' అన్నాడు నవ్వుతూ మెసెంజర్ మస్తాన్.

అందరూ నవ్వే.... వారు నవ్వితే తనకేడుపొస్తుంది. అనుకుంటూ 'ఎందుకు నవ్వుతావ్' అన్నాడు.

'ముందు మీరు సంతకం పెట్టండి... తర్వాత మీరూ నవ్వుతారు'

'హా'

'అవునండీ'

గబగబ గిలికాడు సంతకం స్లిప్ మీద.

కవర్ ఛర్‌మని చింపాడు.

మీ "ఆకాశం ఏడ్చింది" పోటీ కథానికకు మొదటి బహుమతి యిచ్చామని తెలుపుటకు సంతసిస్తున్నాం. మీ బస్ట్ ఫోటో ఒకటి పంపండి.

సంపాదకుడు

చదివి - హా - నే ముందే అనుకున్నా అని నవ్వేశాడు సుబ్బారావు.

మీరు నవ్వుతారని నే ముందే చెప్పా! అన్నాడు మెసెంజర్ మస్తాన్.

గబగబా లోపలకి పరుగెత్తాడు సుబ్బారావు 'రేపు పార్టీకి నిన్ను పిలుస్తాలే మస్తాన్' అంటూ.

అమ్మా నా కథకు ప్రైజొచ్చింది.

నాన్నా - డిటో -

సుబ్బులక్ష్మీ - డిటో - అన్నాడు సుబ్బారావు - ఎర్రకాగితం గాలిలో వూపుతూ.

గదిలోవున్న సుబ్బులక్ష్మి దగ్గరకెళ్ళి "క్షమించు సుబ్బులూ నిన్ను ఏడిపించాను" అన్నాడు.

"యిప్పుడు నవ్వుతున్నాగా!" అన్నది సుబ్బులు నవ్వుతూ. మళ్ళీ అదే నవ్వు. సుబ్బారావుకు తేళ్ళూ జెర్రులూ పాకించే నవ్వు.

"నువ్వెంత అందమో!" అన్నాడు దగ్గరకు చేరుతూ సుబ్బారావు.

అత్తయ్యా....!

ఒహో వుట్టిమనిషివి కాదుకదా ... ఇప్పుడే వస్తా..... ! అని గుమ్మం దాకా పరిగెత్తాడు సుబ్బారావు.

పరుగెత్తి గుమ్మంలో నిలబడ్డ వెంకట్రావుని చూసి ఆగిపోయాడు.

ఆగిపోయి, ఒరేయ్ నాకూ ఫస్టు ప్రైజొచ్చిందిరోయ్! అని వెంకట్రావుని కుదిపించి బయటకు లాక్కుపోయాడు.

"అయ్యో అన్నం తిని వెళ్లరా" అని తల్లి కేక పెట్టుంటే "యిప్పుడే వస్తా... ఫోటో తీయించుకోవాలి..." అంటూ.

అద్దంలో తన చెంపపై తేలిన భర్త అయిదు వేళ్ళను చూసుకుంటూ ఉబికివస్తున్న కన్నీటిని తుడుచుకుని, ఏడ్వలేక ఏడ్వలేక ఏడ్పులాంటి నవ్వుకొంది సుబ్బులక్ష్మి - టెలుగూ రైటర్ సుబ్బారావు భార్య.

ప్రచురణ : ఆంధ్ర భూమి 15.07.1966

● ● ●

# వర్షంలో నేనూ అతనూ

ఆ క్రితం రోజే కాస్త మాసిపోయిందని అంబాసిడర్‌ని అమ్మిపారేసి ఎర్ర ప్లిమత్ కొన్నాడు కళానిధి -

కొత్త కారులో ఆ సాయంత్రం షికారు బయలుదేరేడు. క్రొత్త కారు కాబట్టి అతను షికారు బయలుదేరేడని కాదు. అతను ప్రతి రోజూ సాయంత్రాలు అలా వూరంతా చుట్టి వస్తుంటాడు. కొత్త కారు అవడంతో యివాళ మరింత హుషారుగా వున్నాడు - అంతే ...

అతను హుషారుగా లేనిదెప్పుడు? అతనికి జీవితమే ఒక హుషారు. అతని జీవితం వడ్డించిన విస్తరి. విస్తరి కూడ కాదు - పంచ భక్ష్య పరమాన్నాలతో నిండిన బంగారు పళ్ళెం. ఆ పళ్ళెంలో వాడినా తరగడమంటూ వుండదు. అక్షయ పాత్రలా ఎప్పుడూ నిండుగా వుంటుంది.

రోజుకొక ప్లిమత్ - ఒకటేమిటి - అలాంటి వెన్నైనా కొనగలడు - కళానిధి - క్షణానికో 'టేస్ట్' మార్చగలడు.

వాళ్ళ నాన్న ఆ పట్టణంలో ఒక పెద్ద బిజినెస్ మాగ్నెట్ - తెల్లారినది మొదలు ఆ వూళ్ళో విచ్చలవిడిగా విన్యాసం చేసే సర్వ రాజకీయాలూ అతని కనుసన్నలలోనే మెదులుతుంటాయ్.

ఆ పట్టణంలో - ఆ దేశంలో అతను షేర్లు కొనని, అతని భాగస్వామ్యం లేని కంపెనీలే లేవు. అతని దగ్గర నల్ల డబ్బు చచ్చేంత వుంది. వాళ్ళ బంగళాలోని పరుపుల్లో, గోడల్లో, భూమిలో - అండర్ గ్రౌండ్ గదుల్లో - కొల్లలుగా నోట్ల కట్టలున్నై.

ఒక సంవత్సరంలో ఆయన కారు క్రింద పడి శ్రమలేకుండా - ఫ్రీగా - కైవల్యం పొందిన వారు ఎంతమందో సరిగా చెప్పలేం గానీ, నెలకు ఒకటి రెండుసార్లు అలాంటివి జరుగుతూనే వుంటయ్.

ఆ అదృష్టం మటుకు ఎంతమందికి దొరుకుతుంది. తపస్సులు చేసి, గెడ్డాలు మీసాలు పెంచుకుని, ఒంటి మీద పుట్టలు మొలిపించుకున్నా దొరకని ముక్తి - ఒక్క క్షణం - రెప్పపాటులో - కళానిధి వాళ్ళ కారు క్రింద పడి -

కళానిధికి చీకూలేదు - చింతాలేదూ -

ద్రవ్యోల్బణమన్నా - డివాల్యుయేషన్ అన్నా అతనికి గుండె దడ లేదు - పంచదార మార్కెట్లో కిలో నాల్రూపాయలు అమ్మినా - ముక్కిన అక్కుళ్ళు బస్తా నూట నలభై అమ్మినా - కిరసనాయిలు అసలు దొరక్కపోయినా అతనికి దిగులు లేదు.

తను చాల అదృష్టవంతుడని, తనో కారణజన్ముడని - మహనీయుడని - అతని ఒక విధమైన భ్రమ - మహాగర్వం.

ఆ భావన బారుల్లో - బార్ - బీ - క్యూల్లో మత్తుగా మస్తుగా వున్నప్పుడు - స్కాచ్ విస్కీ - మార్టినీ ఆందీరాక్స్ కడుపులో ఎగదంతూ మనిషి గుర్రం మీద సవారీ చేస్తున్నప్పుడు మరీ ఎక్కువగా వుంటుందతనికి.

కొత్త కారులో మంచి హుషారుగా షికారుకు బయలుదేరిన కళానిధి నోట్లో సిగార్ పైపు వుంది - సిగార్ పైపులో సీమ నుండి తెప్పించుకున్న వర్జీనియా పుగాకుంది. కళ్ళకు బంగారు ఫ్రేము

చలవజోడుంది. కాళ్ళకు వేసుకున్నా వేసుకోనట్లుండే ఖరీదైన షూ వుంది. ఒంటి మీద కమ్మటి యీవెనింగ్ యిన్ ప్యారిస్ వుంది. చుట్టూ అద్దాలతో మూసివున్న ఆకారులో కమ్మటి సెంట్ సౌరభం వుంది.

విశాలమైన రోడ్లు నాలుగు దాటి సాయంత్రపు చల్లటి గాలి తనివి తీరా అనుభవించి - మరో రోడ్డు మలుపు తిరిగేటప్పటికి - అప్పటికే మబ్బులతో కమ్ముకుంటున్న ఆకాశం - భయంకరంగా వురిమింది. ఆ పట్టణం దద్దరిల్లింది - రోడ్ల మీద వాళ్ళు ఉలిక్కిపడ్డారు. ఆకాశంలో వురుములు, మెరుపులు విన్యాసం చేస్తున్నాయ్.

చల్లగాలికి చినుకులు కూడ ప్రారంభమయినై. ఆఫీసుల నుండి యింటికి వచ్చే వాళ్ళు - సాయంత్రం పూట హాయిగా షాపింగ్‌కి వెళ్ళే వాళ్లు - ఏ పనీ లేక రోడ్ల మీద వూరికినే పచార్లు చేసేవాళ్లూ - చినుకులు ప్రారంభం కాగానే -హడావిడిగా పరుగెత్తుతున్నారు.

వాతావరణం మనస్సును గిలిగింతలు పెట్టడంతో కళానిధి వుప్పొంగిపోయేడు.

పరుగెత్తే జనాన్ని చూసి అతని పెదిమలపై దరహాసం మెరిసింది. 'పాపం, పూర్‌ఫెలోస్!' అనుకున్నాడు.

తర్వాత - నేనెంత గొప్పవాణ్ణి -నాకిలాంటి వెధవ భయాలేంలేవు - నేనన్నిటికీ అతీతుడ్ని - అనుకుని విర్రవీగేడు - ఇంతలో వర్షం పెద్దదయింది. ఆకాశం నల్లటి గొడుగులా తయారయింది.

డబ్బాలు కొట్టినట్లు ఒకటే వురుములు - వర్షం తీవ్రరూపం దాల్చింది.

ఎక్కడి జనం అక్కడ. దొరికిన చోట తలదాచుకుంటున్నారు.

కళానిధి నవ్వుకున్నాడు - 'వాళ్ళలాగా తనెందుకు భయపడాలి. తనకు వానంటే భయం లేదు- పారిపోయే ఖర్మమేమొచ్చింది. మెల్లిగానే నడుపుతూ హాయిగా ఆహ్లాదకరంగా వున్న యీ ప్రకృతిని చూస్తాను - ' అనుకున్నాడు - కారు స్పీడు పూర్తిగా తగ్గించి చాలా నెమ్మదిగా నడిపేడు.

అక్కడ జనం అంతా 'వీడెక్కడివాడ్రా - చాదస్తం మనిషిలా వున్నాడే' అనుకున్నారు. కొందరు అతని అదృష్టానికి మహా యీర్ష్య పడ్డారు.

వాళ్ళందర్నీ చూసి యింకాస్త భుజాలు ఎగరేసి, కుడి చేత్తో 'పైపు' అందంగా పట్టుకుని ... ఎడం చేత్తో 'వీల్' పట్టుకుని చాలా కేర్‌లెస్‌గా కారు పోనిచ్చేడు.

ఆహా - వాతావరణం ఎంత హాయిగా వుంది - ప్రపంచమంతా వాతావరణం చూసి జడిసి పారిపోతుంటే - తానొక్కడే ఆనందిస్తున్నాడు - అందుకు తనకొక్కడికే అర్హత వుంది. ఆ యోగ్యతగల అదృష్టవంతుడు తనొక్కడే - తనని యీ వాన ఏమీ చేయలేదు -'

తాబేటి నడకలా మెల్లిగా నడుపుతున్నాడా కారును. వరండాలోని జనాన్ని చూసి, వారి అవస్థను, బేలతనాన్ని చూసి లోలోపలే పగలబడి నవ్వుకున్నాడు.

అతని అహంభావంలో తెలియలేదు కాని, అతన్ని చూసి కూడా జనం వ్యంగ్యంగా నవ్వుకున్నారు. మళ్ళీ అతను చూస్తే ఏమనుకొంటాడో అని అతను చూసే వేళ్టికి ముఖకవళికలు మార్చుకుంటున్నారు.

ఆహా ఎంత బావుంటున్నదీ వర్షం - అనుకున్నాడా కారు లోపలి కళానిధి మూడోసారి.

మరి రెండు అడుగులు కదిలింది కారు - కళానిధి గర్వం మరి రెండు మెట్లు పైకి ఎక్కింది - యింతలో ....

ఆకాశం పగిలిపోయినట్లు ఫెళఫెళమంది కళ్ళు పోయేలా తళుక్కున తటిల్లత మెరిసింది.

మరుక్షణం హిరోషిమా నాగసాకీలపై హైడ్రోజన్ బాంబు పడ్డట్టు - పాకిస్థాన్ పాటన్ టాంకుల్ని మన అబ్దుల్ హమీద్ పేల్చినట్లు, అమెరికా ఫైటర్స్‌ని వియత్నాంగులు తునాతునకలు చేసినట్లు, చెవులు పగిలేటట్లు - పిడుగు పడ్డది కళానిధి కారు ఎదురుగా - పది గజాల ముందున్న చెట్టు మీద!!

చెట్టు కూలింది - పిడుగు పడ్డ చోటు మసి అయింది.

కళానిధి అదిరిపోయేడు. పిడుగు మోతకు బెదిరిపోయేడు - అతని గర్వం, అహం చెట్టులాగా నేలకూలినై.

అతనిలో భయం ఆవహించింది. ప్రకృతి భయంకర వికటాట్టహాసం చేస్తున్నది....

పిడుగు "నువ్వూ మానవుడివేనోయ్ కళానిధీ - విర్రవీగకు - అందరిలాంటివాడివే నువ్వూనూ - కాకపోతే నీకు డబ్బుంది - నేను నీమీద పడితే నిన్ను ఆ డబ్బు అడ్డుకోమను చూస్తా!" అని హెచ్చరించింది కళానిధిని.

"అమ్మో - నీముందు నేనెంత - మనిషిని నేను - నీ దృష్టిలో అందరూ ఒకటే - యింకాస్తలో గండం గడిచింది - లేకపోతే యీపాటికి కొత్త ప్లిమత్‌తో సహా భస్మమయిపోయేవాడిని - బతికించేవ్ - యీ విషయంలో నాకన్నా ఆ జనమే నయం ... "

కళానిధి అహం తునాతునకలయి పోయింది - మృత్యుభయం అడుగు ముందుకు పోనివ్వలేదు.

గబగబా ఆ జనం నిలబడ్డ వరండావారగా కారుపోనిచ్చి - కారు పార్కు చేసి - హడావుడిగా పరిగెట్టి బురదలో కాలుజారి పడబోయి - నిలదొక్కుకుని ... వరండాలోకి చేరి అందులో ఒకడికి ఢీకొట్టి "సారీ" అని, ప్రాణం కుదుటపడగా చావు భయం నుండి కాస్త కోలుకుని "హమ్మయ్య" అనుకున్నాడు -

చావంటే ఎంతటి వాడికైనా ఎంత భయం -

పాపం! కళానిధి ఢీ కొట్టుకున్న మనిషి బొప్పి కట్టిన తన నుదురు తడుముకున్నాడు.

ఆ నుదురు తడుముకున్న మనిషి ఒక రచయిత. ఆ సంఘటనను కళ్ళారా చూడగలిగినందుకు చాలా సంతోషించేడు. ఢీ కొట్టినందుకు కళానిధిపై ఏమాత్రం కోపం రాలేదతనికి -

పైగా ఆ రాత్రి యింటికి పోయి ఆ సంఘటనపైన ఓ కథ రాసేడు - అతను.

అతని పేరు రామారావు -

ఆ రామారావునే నేను !!

ప్రచురణ : చుక్కాని 01.09.1967

• • •

# బళ్ళు ఓడలు

బుర్ర మీసాలు, గిరజాల జుట్టు. అధో పుండ్రాలు. నుదుటన పదిపైసల బిళ్ళంత ఎర్రటి కుంకమ బొట్టు. నీర్కావి లాల్చీ, పంచె. గోనె సంచీమీద బాసింపట్టు వేసి కూర్చున్న శాల్తీ ఆకారమది. పక్కనే పంజరంలో చిలుక యినుప తీగె మీద ' ఫీట్స్' చేస్తున్నది. ఎదురుగా జ్యోతిషానికి సంబంధించిన సాహిత్యం - పంచాంగాలు. ప్రపంచ ప్రజల భవిష్యత్తును రెడీమేడ్‌గా రాసిపెట్టి వుంచిన కొన్ని నలిగిపోయిన కార్డులు. ట్రంకు పెట్టె, దానిమీద ఏటవాలుగా నిలబెట్టిన అట్ట. దానిమీద రంగురంగుల హస్తమూ, వంకర టింకర రేఖలు.

ఆ శాల్తీ ఎడమ చేతిలో బావుటా బీడీ. కుడి చేతిలో ఏదో తెలుగు సినిమా పాటల పుస్తకమూ. ఇంతకీ అతనెవరో కాదు - చిలక జోస్యుడు. బిజినెస్ లేక పాటలు బట్టీ పడ్తున్నాడు.

పాటల పుస్తకంలో మునిగిపోయిన జోస్యుడి ఎడమ చేయి చూపుడు వేలు చురుక్కుమంది. బావుటా బీడీ తుంపు చురక వేసింది.

"అబ్బా" అంటూ బీడీ ముక్క విదిలించి తలెత్తి చూచేడు జోస్యుడు.

అప్పుడే అటుగా వెళ్తున్న వీరాస్వామి జోస్యుడి బీడీ ముక్క తన బూటు క్రింద పడడంతో ఇటు తిరిగి చూచేడు. వీరాస్వామి చూపులు జోస్యుడి చూపులు కలుసుకున్నై.

ఆ క్షణంలోనే వీరాస్వామికి భవిష్యత్తుపైన కొండంత ఆశ అనే పదార్థం ఏర్పడింది. అదే క్షణంలో వీరాస్వామి తన జీవితాన్నంతా చర్వితచర్వణం చేసుకున్నాడు.

"బళ్ళు ఓడలు, ఓడలు బళ్ళు అవుతయ్యని పెద్దవాళ్లు అంటూ వుంటారు. మరి తన జీవితం ఇంతవరకూ బండి లాగానే వుంటూ వచ్చింది. గుంటల్లో, మెట్టల్లో, కుదుపులతో లంకణాల బోటులా యింతవరకూ నెట్టుకొచ్చింది. దాదాపు ప్రయాణం అయిపోవచ్చింది. జీవన సంధ్య కాచుక్కూర్చుంది. తన జీవితానికి ఈ బండి ప్రయాణం తప్ప ఓడ ఎక్కే అదృష్టం లేదు కాబోలు. ఒహవేళ వున్నట్లయితే ఈ పాటికే ఎక్కడో ఎక్కేయాల్సింది. తనకు తెలిసిన ఓడ ఎక్కిన వాళ్ళంతా ఈ సరికి ఎప్పుడో ఎక్కేసిన వాళ్ళే. యిక తనకు బండే రాసిపెట్టి వుందేమో!

తనొక చచ్చు దద్దమ్మ. మరోడు ఈ పోలీసు వుద్యోగంలో వుంటే ఎంత సంపాదించేవాడో. నిన్న మొన్నటి కానిస్టేబుల్ కనకయ్య. హవ్వ ఎంత సంపాదించేడు! ఎంత డబ్బు ఎంత డబ్బు! తన తత్వమే అంత. పోలీసు వుద్యోగానికి పనికి రాని పరమ ఛాందసమ్మనిషి తను. తప్పు పుట్టేడు. యింకా రెండు నెలల్లో ఈ వుద్యోగం కూడ ఖాళీ. తను రిటైరై పోతాడు. పోనీ డబ్బు లేకపోతే మానే. పిల్లలు. వాళ్ళకేం కొదవ. ఆరుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు. ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు అప్పు చేసి అయిందనిపించుకుని తర్వాత ఆ అప్పును వడ్డీలతో సహా వాయిదాలలో తీర్చుకున్నాడు ఎంతో శ్రమ పడి. నలుగురు మగ పిల్లలకు కొద్దిగా చదువులు చెప్పించేడు. నలుగురిలో ముగ్గురికి పెళ్ళిళ్లయి కొద్ది చదువులకు తగ్గ కొద్ది సంపాదనతో వారి పొట్ట వారు పోషించుకొంటున్నారు. నాలుగో వాడికి ఏదో చిన్న వుద్యోగం దొరికింది గాని పెళ్ళి కాలేదు.

యింకా ముగ్గురు ఆడపిల్లలకు, ఆ ఒక్క పిల్లవాడికీ పెళ్ళిళ్ళు చేయాలి.

చేయాలి. నిజమే. ఎలా చేయాలి? లంచాలు పుచ్చుకుంటే ఈపాటికి జంజాటమంతా వదిలించుకుని హాయిగా వుండేవాడు. లాటరీ టిక్కెట్లు ఎన్ని కొన్నాడో లెక్క లేదు. అవీ రాలేదు.

జీవితంలో మూడొంతులు అయిపోయింది. యిక మిగిలింది ఒకవంతు. జరిగిపోయిన జీవితాన్ని ఎలాగో అలా ముప్పతిప్పలు పడి మూడు చెరువుల నీళ్ళు తాగి నెట్టుకొచ్చేడు.

పోనీ అప్పుడయితే ఎన్ని ఆటలు ఆడినా ఆడడానికి వుద్యోగమంటూ వుండేది. ఓపిక వుండేది.

అగచాట్లుపడయినా ఈ పిల్లల్ని ఒక ఒడ్డుకు చేరుద్దామంటే సమయమూ లేదు, ఓపిక అంతకంటే లేదు. వుద్యోగం పోతే అప్పులు కూడా పుట్టవు. కొడుకులకు తమ భుక్తికే సరిగ్గా చాలని సంపాదన. వారికి తన పరిస్థితులేవీ పట్టవు.

మరి ఈ ఒక వంతు జీవితం ఎలా జరుగుతుందో? వీరాస్వామి మనస్సులో ఆరాటం ఎక్కువైంది. జోస్యం చెప్పించుకోవాలి అనే నిర్ణయానికి కూడ వచ్చేసేడు ఆ క్షణంలో.

వీరాస్వామిని చూడగానే పాటల పుస్తకం, గోనెసంచీ క్రిందకు త్రోసి మీసాలు ఒక చేత్తో తడుముకుంటూ, మరో చేత్తో నలిగిన అట్టముక్కలు సరిచేసేడు జోస్యుడు. మీసాల క్రింది పెదిమలపై చిరునవ్వు తెప్పించుకుని కనుబొమ్మలతోనే ఏమిటన్నట్లు ప్రశ్నించేడు. కూర్చోమన్నాడు.

"మాసిలక బెమ్మాండంగా జోస్యం చెప్పుద్దిలే. చెప్పించుకుంటారా?"

ఈ ఒకవంతు జీవితం, పిల్లల పెళ్ళిళ్ళు - గొణిగాడు వీరాస్వామి.

కార్డులు కలిపి వరుసగా పేర్చి చిలకను వదిలేడు. అటూ యిటూ తచ్చాడి ముక్కుతో ఒక కార్డు లాగి యజమానికి అందిచ్చింది చిలక.

"అకస్మాద్ధన లాభం.పట్టినది బంగారమగును" అందులో రాసివున్న జాతకం చదివేడు చిలక జోస్యుడు.

వీరాస్వామి వులిక్కిపడ్డాడు. అనుమానం కలిగి కార్డు తనే లాక్కుని చదువుకున్నాడు.

హయ్య బాబోయ్. ధనలాభమే. నాకే. నిజంగా అక్కడ పొర్లాడినంత పనిచేశాడు వీరాస్వామి. చిందులు తొక్కేడు. చిలకను మెటికలు విరిచి ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత యింకా డబ్బు రాలేదు కదా అని గుర్తుకొచ్చి చప్పబడిపోయేడు.

మరో రెండు రూపాయలిస్తే హస్తం కూడా చూస్తా. రెండు రూపాయలొక లెక్కా మీకు. లక్షాధికార్లు.. తంజావూర్ తైర్ కొట్టేసేడు జ్యోతిస్యుడు.

వీరాస్వామి హస్తం చూపించేడు.

ఆహా! ఏమి రేఖ. జెర్రిగొడ్డు వస్తోంది. ధన లక్ష్మి నీయింటికి వస్తోంది. నీ జీవితం వున్నదంతా యిక ముందేవుంది. డబ్బుసంచులతో నీ ఇంటికి వస్తోంది అన్నాడు.

వీరాస్వామి వినయంగా సిగ్గుపడ్డాడు.

ఆ నాదగ్గరేముంది? నేను లక్షాధికారిని కావడమేమిటి?

మెలికలు తిరిగిపోయాడు. కిచకిచమని ధ్వనులు చేస్తూ అచ్చం ఆ చిలకలాగానే నవ్వేడు. ఆ సంతోషంలో రెండు రూపాయలివాల్సింది అయిదు ఇచ్చేడు.

నే చెప్పింది ఢంకా మీద దెబ్బ కొట్టి అవుద్ది నెల రోజుల్లో. అయిదు రూపాయలు లాల్చీ జేబులో వేసుకొంటూ యికిలించేడు జ్యోతిష్యుడు.

గబగబా పోతున్న రిక్షాలో పోయిపడ్డాడు వీరాస్వామి బేరంసారం లేకుండా.

ఈరాస్వామి భార్యా రత్నం మొగుడి ముఖంలో తాండవమాడే సంబరానికి ఆశ్చర్యపడ్డది.

అంతటితో ఊరుకోక బుగ్గలు నొక్కుకున్నది. తర్వాత ''నవ్వుతున్నారుగాని - పిల్లల విషయమేమైనా పట్టిందాంట మీకు? పెళ్ళిళ్ళు చేసి నవ్వుదురుగాని - యిప్పుడు కాదు'' అన్నది.

''ఇంకా నెల రోజులు ఓపికపట్టు'' అని టోపీ తీసి చిలక కొయ్యికు తగిలించేడు వీరాస్వామి.

● ● ●

వీరాస్వామి హెడ్ కానిస్టేబుల్ : స్నేహితులు, తోటి పోలీసులు, ఎస్ఐ, చివరికి వాళ్ళ సూపర్నెంట్ కూడ అతన్ని 'యీరాసామి' అనే పిలుస్తారు.

యీరాసామి చాలా మంచివాడు.

రోడ్డు మీద డబుల్స్ పోయేవాళ్ళకి, సైకిళ్ళకి లైట్లు లేకుండా తొక్కేవారికి, ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా 'ర్యాష్'గా తోలుకుపోయే లారీ డ్రైవర్లకీ, ఫుట్‌పాత్ పక్కన పళ్ళు అమ్ముకునే వారికి, పాములాడించుకునే వారికి, అందరికీ 'యీరాసామి' దేవుడు. డబుల్స్ పోయేవాళ్ళూ, లారీ డ్రైవర్లూ - దూరం నుంచే యీరాసామి ఆకారాన్ని పోల్చుకుని ''మన ఈరాసావేలే - పోనియ్యవోష్' అని నిర్భయంగా ముందుకు దూసుకుపోగలరు. బీటులో యీరాసామి వుంటే రోడ్డు పక్కన పాములాడు నాగస్వరం యింకా కాస్త గట్టిగా వూదుతాడు బెదురులేకుండా.

అలాంటి మంచి యీరాసామికి యిప్పుడు అంతా అగమ్యగోచరంగా వుంది. వుద్యోగం నిండుకుంటూంది. జేబులో డబ్బులూ నిండుకున్నై. బ్యాంకులో కూడ డబ్బు లేదు. మరి పిల్లల పెళ్ళిళ్ళు ఎలా చేయాలి? చచ్చే వరకూ ఎలా బతకాలి? ఎలా?

ఇలా భవిష్యత్తు మీద బెంగ పెట్టుకున్న వీరాస్వామికి చిలక జ్యోస్యుడు కాస్త శాంతి చేకూర్చేడు.

ఆ రాత్రి కాస్త సుఖంగా నిద్రపోయేడు వీరాస్వామి. వీరాస్వామి భార్యకు మాత్రం అదేమర్థంగాక మూతి విరిచి - ''ఏమ్మనుషులో బాబూ'' అన్నది.

● ● ●

మూడేళ్ళ క్రితం సుబ్బయ్య శెట్టి ఆ వూరికి కట్టుగుడ్డలతో వచ్చి అందరినీ నోరెత్తి సహాయం అడిగేవరకూ అతనంటే ఎవరికీ తెలియదు. ఇప్పుడు మాత్రం అందరికీ తెలుసు.

మూడేళ్ళ క్రితం తను ఫలానా గ్రామస్థుడినని, అక్కడ తనకు ఓ పచారీ దుకాణం వుండేదనీ, ధర్మాత్ములు ఎవరో నిప్పు పెట్టేరనీ, దుకాణం యావత్తూ ఆహుతయిపోయిందనీ, కాబట్టి ఎవరికి తోచినట్లు వారు సహాయం చేసి తన బతుకు నిలబెట్టమనీ, ఆ వూరి షాహుకార్లందరినీ అర్థించేడు.

అంతా ''పాపం'' అని జాలిపడ్డారు. అందరూ తమతమ తాహతుకొద్దీ అప్పులుపెట్టి సుబ్బయ్యను ''సుబ్బయ్య శెట్టి''గా తీర్చి దిద్దేరు.

ఇదంతా మూడేళ్ళ క్రిందటి మాట.

ఈ మూడేళ్ళలో వ్యాపారం రెండింతలయింది. కొట్లో లెక్కలు రాయటానికి, వ్యాపారంలో సహాయం చేయడానికి గుమాస్తాను కూడా పెట్టుకొన్నాడు. అతని పేరు రామబ్రహ్మం. అతనికి నా అనేవాళ్ళు ఎవరూ లేకపోవడంతో రాత్రింబవళ్ళూ అతను శెట్టితోనే వుండేవాడు. శ్రీరాముల వారికి నమ్మినబంటులాగ.

అందరూ ''ఇహ సుబ్బయ్య శెట్టికి ఫరవాలేదు'' అనుకొంటుండగా - ఓరోజున అమాంతంగా సుబ్బయ్య శెట్టి 'దివాలా' ఎత్తేనని చేతులు ఎత్తేసేడు. ఆ వార్త వూరంతా పాకింది. మూడేళ్ళ క్రితం అతని దురదృష్టానికి జాలిపడి ''పాపం'' అన్నవారే యిప్పుడు కూడ ''పాపం'' అన్నారు.

"దురదృష్టం కాకపోతే, అక్కడ అలా తగలేసుకొచ్చేడు. యిక్కడ అందరూ సహాయం చేసినా దానిని నిలబెట్టుకోలేకపోయేడు" అనుకొన్నారు.

"అయ్యో - నాకు వెయ్యి రూపాయలు యివ్వాలి. ఎలా - అప్పు యిచ్చిన మరో షాహుకారు గోల పెట్టేడు. కొందరు జాలి పడ్డారు. అప్పులు యిచ్చిన వాళ్ళు "అయ్యో - ఎలా" అనుకున్నారు. "నా డబ్బు" అని నోరెత్తి అడిగిన వారికి "నా కర్మ యిలా కాలింది.... ఐపి వేస్తున్నా - కాస్తన్నా రాకపోదు - యిస్తాగా" అని జవాబు యిచ్చేడు సుబ్బయ్య శెట్టి.

చివరికి సుబ్బయ్య 'ఇన్‌సాల్వెన్సీ పిటిషన్' వేసేడు...

దుకాణంలో అడుగు బొడుగు సరుకులు అన్నీ స్వాధీనం చేసుకొని, సుబ్బయ్య యివ్వాల్సిన బాకీలు అన్నీ లెక్కగట్టి చివరికి సుబ్బయ్యకు కొంత డబ్బు యిచ్చింది కోర్టు.

సుబ్బయ్య నెత్తీనోరూ బాదుకుంటూ కొన్ని అప్పులు తీర్చేడు. కొన్ని "నేను తీర్చలేను బాబోయ్" అని వదిలించుకున్నాడు.

మర్నాడే సుబ్బయ్య శెట్టి తన స్వగ్రామం వెళ్ళి పోవాలనుకున్నాడు.

ఆ సాయంత్రమే రామబ్రహ్మం వచ్చేడు సుబ్బయ్య దగ్గరకు.

"రామబ్రహ్మం రేపు నేను వెళ్ళిపోతున్నా. ఇదిగో నీ జీతం తీసుకో"

"శెట్టి గారూ - గవర్మెంటునీ, లోకాన్నీ మోసం చేస్తే చేసేరుగానీ, ఇరవై నాలుగ్గంటలూ మీతో వుండి, మీ బాగోగులు చూసిన నన్నే అన్యాయం చేయకండి... రెండు మూడు వేలన్నా ఇస్తే ఓ చిన్న కొట్టు పెట్టుకుని మీ పేరు చెప్పుకుని బతుకుతాను. నన్ను కూడా కాస్త కనిపెట్టండి"

"అబ్బే రామబ్రహ్మం. దివాలా గాక ఏం బావుకున్నాను. నా దగ్గర ఏముందనీ నీకిచ్చేది? అప్పులు తీర్చడానికే సరిపాయే"

రామబ్రహ్మం చాలా ఆశ్చర్యపడిపోయేడు. "నిన్నటి వరకూ లెక్కలు చూసిన తనకే టోపీ వేయబోతున్నాడు. ఈ పాపిష్టి వెధవ దగ్గర లక్షన్నర మూట వుంది. ఎంత కక్కుర్తి వెధవో" అనుకున్నాడు రామబ్రహ్మం.

"ఐ.పి అబద్ధం అని తెలిస్తే చాల ఇబ్బందుల్లో పడతారు శెట్టిగారు. మంచివాడిని - మర్యాదగానే అడుగుతున్నా"

"అబ్బే రామబ్రహ్మం - నీ మంచితనం నాకు తెలియదూ! ఈ వంద వుంచుకో. ఇంత కన్న ఇవ్వలేను."

"ఛీ - పిసినిగొట్టు వెధవ." అని ఆ వంద కూడ పుచ్చుకొని మెదలకుండా వూరుకున్నాడు రామబ్రహ్మం.

● ● ●

అర్ధరాత్రి. సుబ్బయ్య మనసులోని స్వార్థంలా బయట చిక్కని చీకటి తాండవం చేస్తోంది.

ఎత్తయిన ప్రహరీ వెనుక డాబాలో ఓ గదిలో సుబ్బయ్య శెట్టి గురక పెట్టి నిద్ర పోతున్నాడు. కాస్త ఎడంగా రామబ్రహ్మం. దొంగ నిద్ర. అతని కడుపులో దేవినట్లుగా వుంది. సుబ్బయ్య తన చేతిలో వంద రూపాయలు పెట్టినప్పటి నుండి -

మూడేళ్ళు వీడికి చాకిరి చేసినందుకు ఇదేనా ప్రతిఫలం. వీడి బండారాన్నంతా బట్టబయలు చేస్తే వీడి గతేం కాను. వాడి దోవకు తను అడ్డుపోడు గదా - అంత డబ్బుతో వెళ్తూ తనకు రెండు మూడు వేలు ఇస్తే వాడి అబ్బ సొమ్ము ఏం పోయిందట? -

వీడి మాయరోగం కుదర్చాలి.

సుబ్బయ్య శెట్టి తలగడ కింద మూట తొంగి చూస్తోంది. శెట్టి గాఢ నిద్రలో వున్నాడు. మూటలో లక్ష రూపాయలుంటయ్.

రామబ్రహ్మం మెల్లగా లేచేడు. ఒళ్ళు విరుచుకుని పిరికితనాన్ని పారద్రోలేడు. శెట్టి దగ్గరకు వెళ్ళి జాగ్రత్తగా మూటనందుకున్నాడు.

మూటను గట్టిగా వాటేసుకుని పిల్లిలా డాబా బయటకు వచ్చేడు.

అమావాస్య. రామబ్రహ్మం మనసులోని పగలా దట్టమైన చీకటి - ముందు ఎత్తయిన ప్రహరీ వుంది.

అది దాటితే డబ్బు మూట హుష్ కాకీ!!

సుబ్బయ్యకు మెలకువ రాకుండానే వుడాయించాలి. "ఒరేయ్ సుబ్బయ్యా - బాగా నిద్ర పోరోయ్!."

చిన్న గుమ్మడి కాయంత బరువుంది మూట. ప్రహరీ గేటు ఇనుప కటకటాలతో తాళం వేసివుంది. ప్రహరీ గోడ వారగా చీకట్లో నిలబడి మూటను గోడ అవతలి వైపుకు విసిరేడు రామబ్రహ్మం. తర్వాత ప్రహరీ ఎక్కే ప్రయత్నం చేసేడు. చేయిజారి పట్టుతప్పి క్రింద పడ్డాడు.

సరిగ్గా ఆ క్షణమే -

అటు వీరాస్వామి జీవితం ఓడగా మారిన క్షణం.

రామబ్రహ్మం మూటను విసిరేసిన క్షణమే ఎస్.ఐ కబురంపితే వెళ్ళొస్తున్న వీరాస్వామి మూటపడిన చప్పుడుకు గోడ దగ్గరకు వచ్చి - "ఏంటబ్బా" అని చేతుల్లోకి తీసుకుని క్షణం అటూఇటూ చూశాడు. ఆ సమయాన రామబ్రహ్మం కాలుజారి బోర్లబొక్కలా పడి వున్నాడు గోడకు అవతల చీకట్లో.

యింటికి పోయి చూద్దాంలే అని, వీరాస్వామి మూటను భద్రంగా పట్టుకుని పదిబారలు నడిచి పక్కనే వున్న సందులోకి తిరిగేడు. " అబ్బ పొద్దుపోయింది" అని ఆవులిస్తూ.

కష్టపడి పది నిమిషాలకు ప్రహరీ దాటిన రామబ్రహ్మానికి మూట పత్తా దొరకలేదు. గంతులు వేసేడు రామబ్రహ్మం. కాని మూట మాత్రం కనపడలేదు. గప్‌చిప్‌గా పోయి పడుకున్నాడు.

తెల్లారి లేచి "నా మూట ఏదీ" అన్నాడు సుబ్బయ్య గోచీ సవరించుకుంటూ భయంతో.

"నాకేం తెల్సు సుబ్బయ్యగారూ - అయినా ఏం మూట?" అన్నాడు రామబ్రహ్మం.

గోల చేస్తే లాభించేదేమిటో సుబ్బయ్యకు బాగా తెలుసు. కృష్ణ జన్మస్థానం - అదొహటి-

పళ్ళు పటపట కొరుక్కుని ఆ రోజే నెత్తిన తుండు వేసుకుని వూరు వెళ్ళిపోయేడు.

రామబ్రహ్మం కూడా ఉసూరుమన్నాడు.

● ● ●

వీరాస్వామి ఇంటికి వెళ్ళి తన గది తలుపు వేసుకుని ఆ దొరికిన మూట విప్పేడు. సంచీ అడుగు పట్టుకుని మూటను దులిపేడు. వంద రూపాయల నోట్ల కట్టలు టపటప రాలినై. వీరాస్వామి కళ్ళు నలుముకుని మరీ చూచేడు. నిజంగా డబ్బే - ధనలక్ష్మి. మూర్ఛపోతానేమోనని వీపు చరుచుకున్నాడు.

పాపం ఈ డబ్బు ఎవరిదో - ఎవరో దొంగలు పడేసి వుంటారు. మనస్సు పోగొట్టుకున్న వాళ్ళ మీద జాలి పడ్తుంటే - "ఛీ, ఈ మెతకతనమే ఇంతవరకూ తెచ్చింది నన్ను." అని జాలిని

తరిమివేసేడు -

ఎదురుగా గొడుగు తగిలించి వున్న ఏడు కొండల స్వామి వారి ఫోటో ముందు అమాంతం సాష్టాంగ పడిపోయాడు. తర్వాత లేచి కట్టలు సంచీ లోకి సర్దుతూ - ''బళ్ళూ ఓడలూ'' అనుకున్నాడు చివరికి వీరాస్వామి.

తర్వాత సంచీని అలమారా లోనికి తోసి తాళం వేసి -

''మూడొంతులు జీవితం సుఖపడకపోయినా ఈ నాలుగో వంతు రాజభోగమేలే నీకు ఈరాసామీ! అనుకున్నాడు వీరాస్వామి.

''ఒసే రత్నం - రేపు కైతేపల్లి సంబంధం నడిపిదానికి ఒప్పేసుకొంస్తా. డబ్బు పోతే పోయింది - మంచి సంబంధం!'' అన్నాడు వీరా స్వామి కునుకు తీస్తున్న భార్యని పనిగట్టుకుని లేపి.

ప్రచురణ : ఆంధ్ర జ్యోతి 22.12.1967

● ● ●

# పిరమిడ్

ఆ వూళ్ళో ఒక పెద్ద కాలవ వుంది.

ఆ కాలవ ఎక్కడో బయలుదేరి మరెక్కడికో పోతూ మధ్య ఆ వూరిని పరామర్శిస్తుంది. ఆ కాలవ ఒడ్డున బొమ్మరిళ్ళలా చిన్న చిన్న గుడిసెలున్నాయ్.

ఆ గుడిసెల్లో దగాపడిన తమ్ముళ్ళున్నారు. దగాకోరు ధీరులున్నారు. నీతిమాలిన నాతులున్నారు. మానధనులైన మగువలున్నారు. చితికిపోయిన బతుకులున్నాయి. యింకా ఆ కాలవ ఒడ్డున భరించలేని దుర్వాసన కూడా వుంది. అలాగంటే ఆ కాలవ పుట్టిన చోటు నుండి అంతమయే వరకూ దాని ఒడ్డున అలాంటి జీవితాలు కోకొల్లలుగానే వుండొచ్చు. వాటి అన్నిటిలోను యీ వూరికి సంబంధించినదే ప్రకృతము.

కాబట్టి - ఆ వూళ్ళో - ఆ కాలవ ఒడ్డున ఆ దుర్వాసనలో మునిగి తేలుతున్న చీకిపోయిన తాటాకు గుడిసెల్లోని ఒక గుడిసె లోపలి బతుకే యీ కథ.

ఆ గుడిసె భూమి నుండి నాలుగడుల ఎత్తు వుంది. అడుగున ఆరడుగుల వ్యాసంలో గుండ్రంగా వుండి పోను పోను కోనుగా తయారై - త్రిభుజపు శీర్షంలా, ఈజిప్టు పిరామిడులా అది కనపడుతుంది. ఆ పిరమిడుకు ఒకవైపున రెండడుగుల నలుచదరపు ద్వారబంధం - దానికి తలుపులు లేవు.

లోపల ఒక చిన్న దీపం బుడ్డి యిష్టం లేనట్లు మినుకు మినుకు మంటున్నది. ఎందుకంటే బుడ్డిలో కిరసనాయిలు నిండుకుంది. ఆ గుడిసెలో ఒక మూల దడినానుకుని ఒక చిన్న కుక్కి మంచం. అందులో 'నాగి' సొమ్మసిల్లి పడుకునుంది. ఆమె ముఖం గుడిసెలో దీపం లాగానే మినుకు మినుకు మంటున్నది. ఎందుకంటే ఆమె ఒంట్లో సత్తువ, ఆమె ముఖంలో జీవ కళ పూర్తిగా నిండుకున్నై. ఆ గుడిసె లోపల నుండి తలెత్తి చూస్తే చంద్రుడు కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఆ గుడిసెకు పైన తాటాకులు ఎగిరిపోయి పెద్ద కంత తయారయింది.

మంచం పక్కన ఏడుకొండలు ఏడుపు మొహం పెట్టి దీనంగా నాగి ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఆ రోజు పొద్దుననుండీ పొయ్యి మీద చట్టి ఎక్కలేదు. ఎందుకంటే కుండలో బియ్యం నిండుకున్నై. ఏడుకొండలు జేబులూ నిండుకున్నయ్.

ఆరోజు పొద్దున నుండీ ఏడుకొండలు విశ్రాంతి లేకుండా రిక్షా తొక్కి అయిదు రూపాయలు సంపాదించేడు.

ఆ అయిదూ నాగికి గ్లూకోజు నీళ్ళకూ - మందులకూ సరిపోయినై. నాగికి కలరా వచ్చిందిట. అలాగని డాక్టరు చెప్పేడు.

నాగికి ఆ కాలవలోని నీళ్ళు తాగి తాగి కలరా వచ్చింది. ఆ గుడిసెకు ఎదురుగా ఒక పెద్ద మురుగు గుంట వుంది. ఆ కాలవ మీదుగా వచ్చిన చల్లటి గాలి మురుగు గుంట దాటుతూ దాని దుర్వాసన పట్టించుకుని ఆ గుడిసెలోకి జొరబడుతుంది ప్రతి రోజూ -

ఆ మురుగు వాసన పీల్చిపీల్చీ కలరా తెచ్చుకుంది నాగి -

నాగిని ధర్మాసుపత్రిలో జేరుద్దామనుకున్నాడు ఏడుకొండలు. ధర్మాసుపత్రిలో జరిగేదేమిటో అతనికి తెలుసు. సీసాడు ఎర్ర నీళ్ళు యిస్తారు. రంగు నీళ్ళ మందుల్తో కలరా ఎక్కువై పోతుందే గానీ తగ్గదు. పోయినేడు పాళిగాడు కలరా వచ్చి సర్కారు ఆసుపత్రిలో చేరి వున్న ప్రాణం పోగొట్టుకున్నాడు. నాగిని కూడా అందులో చేర్చి చేతులారా పోగొట్టుకోడమే అవుతుంది. నాలుగు రోజుల్లోనే ఎంత చిక్కిపోయిందో నాగి. ప్రతిరోజూ రిక్షా కూలితో మందులు యిప్పించి ప్రాణం నిలపాలని ప్రయత్నిస్తున్నాడు ఏడుకొండలు. డబ్బులివ్వలేదని ఆ డాక్టరు కూడా సరిగా చూడడల్లేదు. ఆరు రోజులయింది. యివాళ మరీ డోకులు అవీ ఎక్కువైనయ్. డాక్టరు దగ్గరకెళ్ళేడు. యాభై రూపాయలిస్తే వచ్చి చూసి మందులిస్తానన్నాడ. తర్వాత బతకడం, బతక్కపోవటం ఆయన చేతుల్లో లేదట. ఆ భారం భగవంతుడిదేట.

"యాభై రూపాయలు ఎన్ని రోజులు రిక్షా తొక్కితే కూడాలి. కానీ నాగి తనకు కావాలి. నాగిని ఎలాగైనా దక్కించుకోవాలి. నాగి తన రాణి. నాగి తనంటే ప్రాణమిచ్చింది.

తను తన తల్లిని ఎరుగడు. తన బుద్ధి తెలియకముందే పోయివుంటుంది. తండ్రి తనకు బుద్ధి తెలిసిన తరువాతే ఒకరోజు పోయేడు. బతికినన్నాళ్లూ తెగతాగి తందనాలాడే వాడు. తాగి తాగి చివరికి చచ్చేడు.

యిహ తను మిగిలేడు. తను ఏకాకి - తనకు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. తను తర్వాత బస్టాండులో, రైల్వే స్టేషనులో బూట్ పాలిష్ చేసేడు. పేపర్లు అమ్మేడు. సోడాబండీ నడిపేడు. రైల్లో బటాణీలు అమ్మేడు. తర్వాత ఒక కొత్త విద్య నేర్చేడు. బాగా కిక్కిరిసిపోయిన రైలు పెట్టెలో దూరి, బరువుగా వున్న జేబులు కత్తిరించడం.

ఆ వృత్తిలో రాత్రంతా రైల్లో తిరుగుతున్నప్పుడే నాగిని చూసేడు. నాగితో పరిచయం కూడా విచిత్రమైన పరిస్థితుల్లో జరిగింది. నాగి పాటలు పాడుతూ అడుక్కుంటూ వుండేది. చక్కటి గొంతు, చిరుగులు పట్టిన చీరెతో, చెదిరిన జుట్టుతో కూడా ఆమె నిండుగా ఉండేది. నాగిలో ఆకర్షణ వుంది.

ఒకరోజు .... ఆరోజు మూడో తరగతి రైలు పెట్టెలో ఒక పెద్ద మనిషి జేబు కత్తిరించి పర్సు తీసుకుని తలుపు వైపు వెళ్ళబోయేడు. యింతలో ఆ మనిషి జేబులు తడుముకుని, తనని పట్టుకున్నాడు. పర్సు లాక్కొని నాలుగు తన్ని స్టేషనులో పోలీసులకు వప్పజెప్పేరు.

పోలీసు తీసుకెళ్ళి కేసు పెడితే జైల్లో వేస్తారు. తగిలిన దెబ్బలకు ఏడుస్తూ, విడిచిపెట్టమని ప్రాధేయపడుతున్నాడు తను. పోలీసు ససేమిరా అంటున్నాడు.

అది చాల చిన్న స్టేషను. ప్లాట్‌ఫారం మీద గుడ్డి దీపాలు వుండీలేనట్లు వెలుగుతున్నాయి. అప్పుడే నాగి రైలు దిగి వచ్చింది. చూసి ఆశ్చర్యపోయింది.

పోలీసును తనుకూడా బతిమిలాడింది. రొంటిలోంచి అయిదు రూపాయలు తీసి పోలీసు చేతిలో పెట్టింది. పోలీసు తనను విడిచి హుషారుగా వెళ్ళిపోయేడు.

నాగిని తను ఆశ్చర్యంగా చూసేడు.

పోలీసు వెళ్ళిపోయిన తర్వాత స్టేషనులో - ఆగుడ్డి వెలుతురులో నాగి కళ్ళలో మెరిసిన మెరుపు, ఆమె ముఖంలో తొణికిన ప్రేమ తన గుండెల్లో అనురాగాన్ని కురిపించింది.

"ఎందుకు నీ అయిదు రూపాయలిచ్చేవ్" అడిగేడు తను.

"నిన్ను విడిపించుకోడానికి. ఆ దొంగ సచ్చినోళ్లు సావతన్ని జైల్లో వేస్తారు"

'నేనే దొంగ సచ్చినాడిని'

'పుట్టూనే ఎవరూ దొంగలు కాదులే'

'అయినా నీవెవరివో ... నేనెవరో...? నువ్వెందుకు అడ్డుకున్నావ్?'

'నువ్వంటే నాకిష్టం .... '

'నీ పేరేమిటి ...?'

"నాగి" అన్నది - సిగ్గుపడ్డది.

"మీ అమ్మానాన్నా లేరా ...."

"సచ్చిపోయేరు"

"యింకెవరూ లేరా?"

"నువ్వు తప్ప .... ... " అన్నది అదే సిగ్గుతో తలవంచుకుని.

అప్పటి నుండి నాగి తనదే అయింది. పెళ్ళి చేసుకోలేదు గానీ, చేసుకున్న వాళ్ళ కన్నా బాగానే, ప్రేమతోనే గడుపుతున్నారు.

నాగి వచ్చిన తర్వాత జేబులు కొట్టడం మానివేసేడు. అప్పటి నుంచి రిక్షాలు లాగి సంపాదిస్తున్నాడు. ఎలాగో తిండికి వెళ్ళి పోతున్నది.

యిది జరిగి సంవత్సరం కూడ తిరగలేదు. యింతలో నాగికి ఈ జబ్బు ఒకటి దాపురించింది.

డోకులు అవీ తగ్గటం లేదు. డాక్టరు యాభై రూపాయలు ఇస్తే గానీ రానంటున్నాడు. యీళ్ళు గొప్ప గొప్ప చదువులు చదువుకున్నది డబ్బు సంపాదించడానికి గాని, పేనాలు రక్షించడానికి కాదు - తనకు ఎక్కడ నుండి వస్తాయి యాభై రూపాయలు!

ఏడుకొండలు గతం నుండి వర్తమానం లోకి వచ్చిపడ్డాడు. గుడిసె అంతా చీకటిమయంగా వుంది. దీపం బుడ్డి కొండెక్కింది. కుక్కి మంచంలో - చీకట్లో నాగి ముఖం లీలగా కనిపిస్తోంది. నాగి స్పృహ లేకుండా పడివుంది. గాలితో బాటు తెరలుతెరలుగా మురికి కంపు లోపలికి దూసుకు వస్తున్నది. గుడిసెపై కంత లోంచి తొంగి చూసి చూసి ఎప్పుడో వెళ్ళిపోయేడు చంద్రుడు.

ఏడుకొండలికి తెల్లవారు ఝామున ఎప్పుడో కునుకు పట్టింది.

తెల్లవారింది. నాగి పరిస్థితి అధ్వాన్నంగా వుంది. భగవంతుడి మీద భారం వేసి, బయలు దేరాడు ఏడుకొండలు.

ఏడుకొండలు ధ్యాస అంతా యాభై రూపాయలమీదే వుంది. ఎలాగైనా యాభై రూపాయలు సంపాదించాలి.

రిక్షా వేసుకుని వూరంతా తిరిగాడు. మూడు బాడుగలు దొరికినై. పదకొండు గంటలైంది. మూడు బాడుగలకు కలిపి రూపాయిన్నర కూడా రాలేదు. రిక్షాను రోడ్డు వారగా ఆపి ఆలోచిస్తుంటే, ఒక మెరుపులాంటి ఆలోచన అతని మెదడులో తళుక్కుమంది.

ఎదురుగ్గా పోష్టాఫీసు కనపడుతోంది. గబగబా లోపలికెళ్ళేడు. అన్ని కౌంటర్లూ చాలా రద్దీగా వున్నై. మనియార్డర్ కౌంటర్‌లో పెద్ద క్యూ వుంది. చూస్తూ వుండగానే ఒక చిన్న తోలు పెట్టెతో ఒక సఫారి మనిషి క్యూలోకి వచ్చేడు. అతని కుడిచేతిలో మనియార్డరు ఫారం, వంద రూపాయల నోట్లు వున్నై. ఏడుకొండలు అతని వెనుక నిలబడ్డాడు- అతని జేబుల వైపు చూపులు నిలిపి. వెనుక ప్యాంటు హిప్ పాకెట్‌లో నల్లటి పర్సు ఎత్తుగా పైకివచ్చి కనిపిస్తోంది. నాలుగువైపులా పరికించేడు. ఎవరి ధోరణిలో వారున్నారు.

అయిదు నిమిషాలు - అంతే - ఆ వృత్తి వదిలి చాలా రోజులయినా నేర్పుతోనే పని చేసేడు

ఏడుకొండలు. వచ్చిన పని అయిన తర్వాత కూడా కొన్ని సెకండ్లు అక్కడే నిలబడ్డాడు. క్యూ ఎంతకూ కదల్దేమని గొణుక్కున్నాడు. తర్వాత విసుక్కొంటూ వరండాలోకి వచ్చేసేడు. మళ్ళీ రిక్షాలో కూర్చున్నాడు. లోపలకు జరిగి పర్సు తీసి చూసేడు. వంద రూపాయల నోటు, కాస్త చిల్లర వుంది. చిల్లరతో సహా పర్సును సీటు కింద పెట్టెలో పడేసేడు. నోటు మడిచి జేబులో పెట్టుకున్నాడు.

పది నిమిషాలు గడిచినై. సూటువాలా వరండాలోకి వచ్చేడు. తర్వాత గబగబా ఏదో రిక్షాలో పడి ఎటో వెళ్ళిపోయేడు.

హమ్మయ్య అనుకున్నాడు ఏడుకొండలు. తర్వాత సన్నగా యీల కూడ వేసేడు. కాస్త హుషారు ఎక్కువైంది. మనసంతా హాయిగా వుంది అతనికి.

సంతోషంగా పోస్టాఫీసులోకి పోయేడు. ఒక కౌంటర్‌లోకి వెళ్ళి వంద చిల్లర అడిగేడు. గుమస్తా విసుక్కున్నాడు. లేవు పొమ్మన్నాడు. పోస్టాఫీసులో చిల్లర దొరకలేదు.

రిక్షా వేసుకుని బ్యాంకుకు వెళ్ళేడు. లోపలకిపోయి అల్లంత దూరానే ఆగిపోయేడు. కాస్త భయం వేసింది. క్యాష్ కౌంటర్‌లో ఆ సూట్‌వాలా మనిషి. అతను సూట్‌కేసు తెరిచి వంద రూపాయల కట్టలు యిచ్చి పదుల చిల్లర అడిగేడు.

గుమాస్తా కట్టల్ని పరీక్షించేడు. యిస్తానని లోపలకి వెళ్ళేడు. పది నిమిషాలయింది. గుమాస్తా వచ్చేడు. 'ఒక పదినిమిషాలు ఆగండి - తెస్తున్నాడు - ప్లీజ్' అన్నాడు. మరో అయిదు నిమిషాలు గడిచినై. అంతలో వెనుకనుండి పోలీసు ఇన్‌స్పెక్టర్, నలుగురు పోలీసులు సూట్‌వాలాను చుట్టుముట్టేరు.

అందరూ మూగేరు. 'దొంగనోట్లు' అన్నాడు బ్యాంకు గుమాస్తా. సూట్‌వాలాను తీసుకుపోయేరు. గుమాస్తాను మెచ్చుకున్నారు.

ఏడుకొండలు కాళ్ళు వణికినై. తల దిమ్మెక్కింది. తనే ముందు చిల్లర తీసుకుంటే, తన పనీ అంతే అయేదే గదా అనుకున్నాడు.

రక్షించేవు భగవంతుడా అనుకున్నాడు. మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టేడు.

గబగబా బ్యాంకు బయటకు వచ్చేడు. రిక్షా తీసుకుని యింటివైపు వెళ్తూ ధైర్యం చేసి ఒక హోటలులోకెళ్ళాడు. వంద చిల్లరడిగేడు. చిల్లర యిచ్చేడు హోటలు మేనేజరు. నోటును అంత పట్టించుకోకుండా గల్లాలో పడేసుకున్నాడు.

ఏడుకొండలు హుషారుగా రిక్షా ఎక్కేడు.

నాగిని డాక్టరు దగ్గరకు తీసికెళ్ళాలి. అప్పుడు తనను ఆపద నుంచి రక్షించింది నాగి దేవతలాగా. ఇప్పుడు దానికేమీ తను చేయలేకపోతున్నాడు. దేవుడు తన మొర ఆలకించి ఎలాగైతేనేం డబ్బు దొరికేట్లు చేసేడు.

సరాసరి యింటికి వెళ్ళేడు ఏడుకొండలు. రిక్షా సీటు తెరిచి పర్సు తీసి, చిల్లర వుంచుకుని పర్సును కాలవ లోకి విసిరికొట్టేడు.

సాయంత్రం మూడయింది. గుడిసెల్లో కుక్కలు మొరుగుతున్నాయ్. నాగికి ఎలావుందో డాక్టర్ కాళ్ళు పట్టుకుని ఎలాగైనా వైద్యం చేయించాలి. ఎవడికోసమొస్తాడు డాక్టర్. డబ్బులిస్తే వాడి తాత కూడ వస్తాడు. డబ్బు యివ్వలేనని కదా నీలిగేడు.

ధీమాగా, వంగి గుడిసెలోకి వెళ్లేడు. శిలావతుగా నిలబడిపోయేడు.

'నాగీ' అంటూ గొంతు పగిలేట్లు వూపిరితిత్తులు చిరిగిపోయేట్లు అరిచేడు.

గూడెం దద్దరిల్లింది.

మంచం పక్కన నాగి పడివుంది. నోట్లోంచి నురుగులు కక్కుతోంది. ఒళ్ళంతా చెమటతో నీటి ముద్దయిపోయింది.

ఆఖరు చూపులో - వేలితో చూపించింది నాగి. ఏడుకొండలు గబగబా గుడిసె బయటకి వచ్చేడు. గోధుమరంగు కోడెనాగు జరజరా గడ్డి దుబ్బులోకి పాకిపోయింది.

గుడిసెల్లో జనమంతా పోగయేరు.

'ఏమయిందిరా కొండా' అంటూ.

ఏడుకొండలు కళ్ళు నీటి కుండలయినై.

ముఖం చేతులతో కప్పుకుని అక్కడే కుప్పగా కూలిపోయేడు. అంతా గుడిసెలోకి చేసేరు.

పిరమిడులా గుడిసె. లోపల పాము కాటుకు చచ్చి పడున్న నాగి - ఏడుకొండల రాణి - అతని ప్రాణం....

నాగి రాణి - గుడిసె పిరమిడు..

నాగి సమాధి ---

ప్రచురణ : సైనిక్ సమాచార్ 1968

● ● ●

# భవ బంధాలు

ఆ ఆఫీసుకు కొత్త సూపర్నెంట్ ప్రకాశరావుగారు వచ్చి రెండు నెలలయింది. అయినా ఆయన బంగళాలో ఒంటరిగా ఉండడం, ఆర్డర్లీ వంట చేసిపెట్టడం - ఈ రెండూ ఆఫీసు గుమాస్తా బృందంలో ఒక విధమైన సంచలనం, ఆశ్చర్యం రేకెత్తించాయి.

ఆర్డర్లీ సీతయ్య. సీతయ్యను ఒంటరిగా పట్టుకుని ఒక మధ్యాహ్నం "అయ్యగారికి పెళ్ళాం, బిడ్డలూ నువ్వేనేమిటి సీతయ్యా!" అన్నాడు ప్లానింగ్ గుమస్తా శేషగిరి.

"అయ్యగారి వాలకమేమిటో తెలీడం లేదు బాబూ, ఉప్పు ఎక్కువ వేసినా ఏమీ అనరు. ఎలా చేసినా తింటారు." అన్నాడు సీతయ్య.

గుమాస్తాల పోరుపడలేక ఒకరోజున సీతయ్య ప్రకాశరావుగారిని అడిగాడు "అమ్మగోరు, పిల్లకాయలు ఎప్పుడొస్తారేటి బాబూ!" అని.

అయ్యగారు కాసేపు జవాబు ఇవ్వలేదు. తరవాత "సీతయ్యా" అన్నారాయన.

"ఆయ్ -- ఏటి బాబూ"

"నీకు వంట చెయ్యడం కష్టంగా ఉందా సీతయ్యా?"

"అదేటి బాబూ, నాకేటి కష్టం లేదు."

"అమ్మ లేదురా, ఎన్నడో పోయింది. నీకు కష్టమయితే చెప్పు. మరెవర్ని అయినా కుదుర్చుకుందాం." అన్నారు ప్రకాశరావుగారు.

"ఇంకోడు ఏటికి బాబూ - నేనే చేస్త. తెలీక అడిగినా క్షమించాల." అన్నాడు సీతయ్య.

● ● ●

"శ్రీపురం బస్సు ఎప్పుడుందో కనుక్కో సీతయ్యా. తనిఖీకి వెళదాం." అన్నారు ప్రకాశరావుగారు.

"అరగంటకో బస్సుంది బాబయ్యా. పదండి."

"శ్రీపురం పోస్టుమాస్టర్ పేరేమిటిరా?" అన్నారాయన.

"శేఖరం బాబు దొరా. చాలా మంచోరు."

ఆ ప్రాంతాలకు బదిలీ అయి వచ్చిన తరువాత శ్రీపురం వెళ్ళడం ఇదే మొదటిసారి. ఆయనకు ఆ ప్రాంతాలన్నీ కొత్తకొత్తగా వున్నాయి.

శ్రీపురం అక్కడికి ముప్ఫయి మైళ్ళు.

ఆ పరిసరాల ప్రకృతి వింతగానే వుంది. ఎటుచూచినా పెద్ద పెద్ద గుట్టలు. పచ్చటి చెట్లు. పరిసరాల అందచందాలకు పరవశించిపోయారు.

"ఇదే బాబూ శ్రీపురం. దిగుదాం రండి." అన్నాడు సీతయ్య ఏదో ఆలోచనలలో లీనులైన ప్రకాశరావు గారితో.

పోష్టాఫీసు బస్సు స్టాండుకు దగ్గిరగానే వుంది.

పోష్టు మాష్టరు శేఖరం ఎదురువచ్చి సాదరంగా లోనికి తీసుకువెళ్ళాడు. తన టేబుల్‌కు ఎదురుగా కుర్చీ చూపించి "కూర్చోండి." అన్నాడు శేఖరం.

కౌంటర్‌లో నలుగురైదుగురున్నారు.

ఒక పక్కన టెలిగ్రాఫ్ సౌండర్ కట్టుకడల గోల చేస్తున్నది.

మరో మూల క్లాస్‌ఫోర్ ఉత్తరాల మీద ముద్రలు వేస్తున్నారు.

శేఖరం భారీ యువకుడు, ఉంగరాల జుట్టు --

చక్కని వర్ఛస్సు. ముఖంలో సౌమ్యత. జనంతో మర్యాదగా మాట్లాడుతున్నాడు, వారు కూడ అతనితో ప్రేమతో వ్యవహరిస్తున్నారు.

కౌంటర్‌లో మాటల గలగల.

పక్కన స్టాంపింగ్ చప్పుడు.

మరో పక్కన టెలిగ్రాఫ్ బీట్స్ బీటిల్స్ మ్యూజిక్.

ప్రకాశరావుగారి ఎదట శేఖరం. శేఖరం వెనకు గోడకు భారత రాష్ట్రపతి పెద్ద ఆయిల్ పెయింటింగ్ వేలాడదియ్యబడివుంది. ప్రకాశరావుగారి మనోయవనిక మీద వర్తమానం చెరిగి, విస్మృత కఠిన శృంఖలాలు ఛేదించుకుని పాతికేళ్ళ గతం తారట్లాడింది. అలాగని ఆయన ఆ గతాన్ని పూర్తిగా మరిచిపోనూ లేదు. కాని గత స్మృతులు ఆయనను ఖిన్నున్ని చేస్తాయి. ఆయన హృదయంలో విషపు కైజార్లు దింపుతాయి.

సుఖప్రదమైన సుషుప్తిలో పీడకలలా, సాఫీగా సాగిపోయే జీవితంలో ఆ సంఘటన జరగకుండా వుంటే?

వాడూ ఇంతవాడే అయి ఉండేవాడు. అప్పుడే పిల్లాడు చిదిమితే పాలు కారేటట్లు బంతిలా ఉండేవాడు.

ఇంతకీ ఆ పాతకికి పెదబుద్ధులు పుట్టబట్టి ఇంత జరిగింది. తన జీవితాన్నే నట్టేట్లో ముంచి పిల్లాణ్ణి తీసుకుని దేశాల వెంబడి వెళ్ళిపోయింది ధగుల్బాజీది.

ఎంతగా ప్రేమించాడు తను. పువ్వులతో పూజించాడు. కాని జీవనగతి మరోలా వుంది. మనం అమితంగా కాంక్షించేవి అరుదుగా పొందగలుగుతాం. కావాలని కోరి తెచ్చుకున్నవి కలకాలం నిలవవు. అంతే అయింది తనకు.

ఆ రోజుల్లో తను దుర్గాపురంలో పోష్టు మాష్టర్‌గా ఉండేవాడు. పాతికేళ్ళు ఉండేవి. దూరాన దుగ్గిరాల దగ్గర కుగ్రామంలో అమ్మా, నాన్న ఉండేవారు. అప్పుడే రుక్మిణితో పరిచయమైంది.

పాత పద్ధతులకు బూజు దులిపి, కొత్త పద్ధతుల్ని ఆదర్శాలని సజావుగా కలిపి, నవీన భావాలతో ఉరకలు వేస యౌవనంలో జీవితాన్ని పరుగులు తీయిస్తున్న కాలం అది.

రుక్మిణి ఆ ఊళ్ళోనే మిడిల్ స్కూలు టీచర్.

ఒకరోజు కౌంటరులో బాగా జనం వున్నారు. రుక్మిణి బాంకు పుస్తకమూ, డబ్బు తెచ్చి కౌంటర్‌లో నిలబడ్డది. ఆమె ఒక్కత్తే! కౌంటర్‌లో జనం ఆమెను ముందుకు రానివ్వడం లేదు. కొంతసేపు చూసి, విసుగు పుట్టి గబగబా లోనికి వచ్చింది. పుస్తకమూ, డబ్బు టేబులుపైన పెడుతూ ''తరవాత వస్తా మాష్టారూ చేసి ఉంచండి'' - అని చిరునవ్వు నవ్వుతూ వెళ్ళిపోయింది, తను జవాబు ఇచ్చే లోపలే. నిర్ఘాంతపోవడం తన వంతే అయింది. కిటికీ అవతల జనం సన్నగా నవ్వుకున్నారు.

తనకు మాత్రం ఒక తటిల్లత మెరిసి సర్దుకున్నట్లయింది. ఆ రోజు సాయంత్రం బడి వదలగానే వచ్చింది రుక్మిణి. పుస్తకం తీసుకుని ''థ్యాంక్స్ - మాష్టారూ. వస్తాను.'' అన్నది.

అనాడు నాటిన స్నేహబీజం మొలకై, చిగిర్చి, చెట్టై, మానై, మహాతరువై - తమ ఉభయుల జీవితాలను తనలో ఇముడ్చుకుంది.

పాల పొంగులాంటి యౌవనం.

పాతకొత్తల మేలు కలయికల ఆదర్శాలు.

ఇద్దరికీ పెద్దలు దూరంగా ఉండటంతో ఊరంతా కోడయి కూస్తుంటే ఇద్దరి మనస్సులు ఏకమయి ''లోకం పాడుది - లోకులు కాకులు'' అన్నవి.

రుక్మిణి వాళ్ళ అమ్మానాన్నలకు ఉత్తరం రాయలేదు. తనూ అంతే.

ఒక సెలవు రోజు చూసి కోర్టులో పెళ్ళి అయిందనిపించారు. పెళ్ళి పెద్దలు ఒకరిద్దరు స్నేహితులు, ఆఫీసు ప్యూనూను.

తరవాత రుక్మిణి తన తల్లిదండ్రులకు రాసింది. తనూ రాశాడు.

అటునుండి ఆమెవాళ్ళు, ఇటునుండీ తనవాళ్లూ వచ్చారు. తామిద్దరు కిమ్మనలేదు. తమని వదిలి వాళ్ళు వాళ్ళు పోట్లాడుకుని, ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

ఇక మిగిలింది తామిద్దరు.

కొన్నాళ్ళు స్వర్గధామంలా గడిచిపోయింది జీవితం.

ఒకరోజున కౌంటర్‌లో ఒకడు ''పోష్టుమ్యాష్టారు గోతిలో పడ్డార్రా!'' అని గబగబా వెళ్ళిపోయాడు. అసలే తను చిన్నమెత్తుమాట పడేరకంగాదు. వాడన్నమాటమీద తర్జనభర్జన మొదలయింది.

బాబు కలిగాడు. అపరంజిలాంటి బాబు. ఎర్రతేలులాగ ఉండేవాడు.

అమ్మనాన్నలకు తాము ఇరువురూ రాశారు. ఎవరూ రాకపోగా ఉత్తరం కూడా రాలేదు.

ఊళ్లో గుసగుసల ఉద్ధృతం ఎక్కువైంది.

''హెడ్‌మాష్టర్ కమలాకరం నట్టేట్లో మునిగాడు. పంతులమ్మ గట్టిది.'' తను రాగానే మాటలు ఆపివేశారు రోడ్డు మీద ఒకరోజు.

పాతకిని తను చరిత్ర తెలుసుకోకుండా చేసుకున్నాడు.

కమలాకరానికి, రుక్మిణికి సంబంధం - ఎవరినోట విన్నా అదే. అందరు చెవులు కొరుక్కుంటారు.

తనను వింతగా, జాలిగా, సానుభూతిగా చూస్తారు. అయినా ఓర్చుకున్నాడు తను. అనుమాన బీజం మొలకెత్తనే కూడదు.

కొన్ని రోజులు పరీక్షించాడు.

పిల్లవాడిని ఇంట్లో ఒంటరిగా నౌకరుకి వదిలివేసి చీకటిపడ్డ తరవాత వచ్చేది. ఒక రోజున తాను నిలదీసి అడిగివేశాడు. బడిలో పని ఎక్కువగా వుండటం వల్ల ఆలస్యమౌతున్నదని చెప్పేది. బడిలో పని నెలల తరబడి వుండదు. రుక్మిణి తీరులో మార్పు ఏమీ రాలేదు. ఊళ్ళో గాలిమాటల జోరు ఎక్కువైంది.

ఒకరోజు నెల జీతం తక్కువ ఇచ్చింది. - ''అదే''మంటే, ''ఎక్కడో పోయింది'' అన్నది.

మరునాడు ''కమలాకరం అదృష్టవంతుడు'' అన్నారు ఒకరు.

''ఎదురు డబ్బులిచ్చేవారెవరు దొరుకుతార్రా?'' మరొకడు.

తన హృదయం పిండేస్తున్నాయి మాటలు. గౌరవం మంటగలిసింది. ఊళ్ళో తల ఎత్తుకోలేకుండా ఉన్నాడు.

రుక్మిణిని నయానా భయానా అడిగి చూశాడు. కాని ఆమె మూగనోమేగాని ఒక్కదానికీ

జవాబు ఇచ్చేదికాదు. శంకాకుల మనస్సులో రుక్మిణి స్తబ్ధత మరికాస్త ద్వేషాన్ని రంగరించింది.

ఎన్నడూ చేయి చేసుకుని ఎరగని తను రుక్మిణిని మొదటిసారిగా కొట్టాడు. తిట్టాడు. ఉద్యోగానికి ఉద్వాసన చెప్పమన్నాడు. ససేమిరా అంది.

చివరికి కమలాకరం మీద, రుక్మిణి మీద దావా వేశాడు.

అప్పుడు ఏడ్చింది రుక్మిణి. తను ఏ పాపమూ ఎరగనంది. సంవత్సరంన్నర పైచిలుకు మనస్సు మలినమైపోయింది. ఇప్పుడు రుక్మిణి ఏడుపుతో కరిగేటంత మెత్తని హృదయం కాదు తనది.

ఒక అభిప్రాయమంటూ ఏర్పడకూడదు. ఏర్పడిన తరవాత అంత తేలికగా వదిలివేసే స్వభావం కాదు తనది. దాని అంతు తేలవలసిందే. తప్పుకు శిక్ష అనుభవించవలసిందే.

అంతే, రుక్మిణి, పిల్లాడు దూరమైపోయారు.

ఒక ఊరిలో ప్రభుత్వోద్యోగిని మూడు నిండు సంవత్సరాలు ఉంచుతారు.

ఆ ఊరిలో అడుగు పెట్టేటప్పుడు రుక్మిణి తన జీవితంలో అడుగిడనే లేదు. ఈమధ్యలో గాలితెరలా, ఆకసాన మెరుపులా వచ్చింది. ఆ ఊరినుండి వెళ్ళేలోపలే రుక్మిణితో బాంధవ్యం తీరిపోయింది. ఆ మూడేళ్ళకాలంలోనే జీవితం భయానకమైన మలుపు తిరిగింది.

ఏనాటి బాంధవ్యమో, అంత అందమైన రుక్మిణి మనస్సు లోపల మాలిన్యం నిండి ఉందని ఎవరికితెలుసు? పైకి కనబడే వెన్నలాంటి హృదయంలో పదును కత్తులు, విషపు బాకులు నిండి ఉన్నవని తెలుసా?

అమ్మ, నాన్న కత్తిగట్టారు. అసహ్యించుకున్నారు. రుక్మిణి విషపు కత్తి గుండెల్లో కస్సున నాటిపోయింది.

బాబు కూడా లేడు. పోతూపోతూ రుక్మిణి తీసుకువెళ్ళింది వాణ్ణి.

తరవాత ఇంటికి ఉత్తరం రాశాడు. జవాబు లేదు. 'మనసులు మార్చుకోకపోతారా?' అనే ధీమాతో, మానవ సహజమైన నమ్మకంతో వరసగా నాలుగు ఉత్తరాలు రాశాడు. విసుగెత్తి పదిహేనురోజులు సెలవు పెట్టి ఊరు వెళ్ళాడు. తెలిసిన వారు నానామాటలు అన్నారు. "మీ అమ్మ నాన్న పోయి ఆరునెలలయింది. బుద్ధి ఉందా నీకు?" అన్నారు. తను రసాతలానికి కుంగిపోయాడు.

అమ్మ నాన్న బెంగతో, తను చేసిన నిర్వాకానికి, ప్రయోజకత్వానికి కుళ్ళికుళ్ళి చనిపోయారు.

ఇక దుర్గాపురంలో ఒకరోజు కూడ ఉండలేదు. మరో ఊరికి బదిలీ చేయించుకున్నాడు.

ఒకరి ఆలనా పాలనా లేకుండా - మరొకరితో సంబంధం లేకుండా ఇన్నేళ్ళూ గడిపాడు విరక్తితో. లోకంలో తను ఏకాకి పిచ్చిచెట్టులా. అది ఎవరికీ ఉపకరించదు. అలాగే తనూ. ఒకరిని ఉద్ధరించవలసిన, ఒకరి కోసం త్యాగం చేయవలసిన బ్రతుకు తనది.

అందరూ జాలిపడేవారు. తను అందర్నీ ప్రేమించాడు. అదృష్టం కలిసివచ్చి అంచలంచలుగా ఉన్నతస్థానాన్ని ఆక్రమించాడు. అందరూ తనని ప్రేమించారు.

అందరిలోనూ తన బాబుని చూసుకుంటున్నాడిప్పుడు. ఉన్నారో లేదో, అయితే ఎక్కడ ఉన్నారో? ఆ పాతకి గొంతు నులిమి చంపేసి చక్కగా ఆవెధవతో లేచిపోయి ఉంటుంది.

ఇంతలో టేబుల్‌పైన ఫోను రింగుమంది.

గతం కరిగిపోయింది. ప్రకాశరావుగారు ఉలిక్కి పడ్డారు.

"కాఫీ తాగండి" అన్నాడు శేఖరం.

కౌంటర్‌లో జనం పల్చబడ్డారు. కట్టుకడలు మోగుతూనే వున్నాయి. శేఖరం వెనుక రాష్ట్రపతి

ఫోటోపై రెండు పిచ్చుకలు ముక్కులు రాచుకుంటూ మరో రకమైన మోర్స్ ఆలాపిస్తున్నాయి. ఫోటో అద్దంలో చూసుకుంటూ లోపల ప్రతిబింబాన్ని ముక్కుతో పొడుస్తున్నాయి.

సీతయ్య ట్రే తెచ్చి బిస్కట్ల ప్లేటు అక్కడ పెట్టాడు.

"ఎందుకు నాయనా ఇవి?" అన్నారు ప్రకాశరావు గారు.

శేఖరం ఆశ్చర్యపోయాడు, ఆయన వింత స్వభావానికి.

"ఈ ఊరు నీకు సౌకర్యంగా ఉంటుందా శేఖరం?" అన్నారు ప్రకాశరావుగారు.

శేఖరం ముఖంలో సౌమ్యత, అతని పనితనము చూసినప్పటి నుండీ అతనిమీద మంచి అభిప్రాయం కలిగింది ఆయనకి.

ఆఫీసు రికార్డులు అన్నీ చాలా అందంగా, శుభ్రంగా ఉంచాడు - ఆయనకు తప్పులేవీ కనపడలేదు.

శేఖరాన్ని, ఆఫీసును చూసినప్పటి నుండీ ఆయనకు తన చిన్నతనం గుర్తుకు వచ్చింది. తనూ ఆ రోజుల్లో ఒకరు వేలెత్తి చూపలేనట్లు పని చేసేవాడు. ఇప్పుడు శేఖరానికి, ఆనాటి తనకూ ఎక్కడా భేదం కనబడడంలేదు. అందుకనే తృప్తిగా శేఖరాన్ని కష్టసుఖాలు కనుక్కున్నాడు.

ప్రకాశరావుగారి ఉదారహృదయానికి శేఖరం తబ్బిబ్బైపోయాడు. ఆ ఊళ్ళో అతను సుఖంగానే ఉంటున్నాడు. ఆ ఊరి ప్రజతో ఎలాంటి గొడవా లేకుండా నెట్టుకు వస్తున్నాడు. ఆమాటే శేఖరం చెప్పాడు ప్రకాశరావుగారితో.

ఆ రాత్రి శేఖరం తన ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేశాడు. తరవాత తన గొడవ చెప్పసాగాడు.

"ఇలా రండి సార్. ఈయన మా మేనమామ సీతాపతి. ఈమె మా అమ్మగారు"

ఇద్దరు హస్తద్వయం జోడించారు.

శేఖరం తల్లి వికృతంగా ఉన్నది. ముఖం నిండా భయంకరమైన స్ఫోటకం మచ్చలు.

"బాబూ, మిమ్మల్ని చూసే భాగ్యంలేదు మాకు. భగవంతుడు మా దృష్టి లాగేసుకున్నాడు. పనిమీద వచ్చిన మిమ్మల్ని బాధించడం మంచిది కాదు. అబ్బాయ్ శేఖరం.... "

ప్రకాశరావు స్తంభీభూతులై పోయాడు. కాసేపు శిలావతుగా వారిని చూస్తూ ఉండి పోయాడు.

ఆయనకు కడుపులో దేవినట్లయింది.

"జీవితం ఎంత భయానకమైనది?" అనుకున్నాడాయన.

నాలుగు మెతుకులు కతికి లేచారు. ఏమీ తినబుద్ధి కాలేదు. శేఖరం రెండుమూడుసార్లు చెప్పి చూచాడు.

కాని లాభం లేకపోయింది.

ప్రకాశరావుగారికి ఇన్‌స్పెక్షన్ బంగ్లా రిజర్వ్ చేయించారు. రాత్రి పది గంటలవుతూంది. సీతయ్య వరండాలో కునికిపాట్లు పడుతున్నాడు.

ప్రకాశరావుగారితో శేఖరం బంగళాకు బయలుదేరాడు. దారిలో అన్నాడు శేఖరం -

"క్షమించండి. మీకు వారిని చూపవలసింది కాదు. భోజనం సరిగా చెయ్యలేదు."

"లేదు శేఖరం, బస్సు ప్రయాణం వల్ల బడలికగా ఉంది. మరేం లేదు." అన్నారు ప్రకాశరావుగారు.

తిరిగి శేఖరం తన గోడు చెప్పుకున్నాడు.

"ఆయన మా మేనమామ మేజర్ సీతాపతి. ఆమె మా అమ్మగారు. ఇద్దరికీ దృష్టి లేదు.

ప్రపంచంలోని కుత్సితాన్ని, కుళ్ళును చూసే దురదృష్టం వారికి లేదు. ఆ దృష్ట్యా వారు అదృష్టవంతులు. లోకం దృష్టిలో శాపగ్రస్తులు వారు. సీతాపతి మామయ్య వరల్డ్ వార్‌లో మేజర్. బర్మాలో కాంప్‌లో బాంబులు పడ్డాయి... చావు తప్పి కన్ను లొట్టపోయింది. రెండు కళ్ళూ పోయాయి. మా అమ్మ దైవోపహతురాలు. ఆమెదో గాథ.

మొదట కొన్నేళ్లు నాకూ తెలీదు - తరవాత పోట్లాడగా నిజం చెప్పింది. ఆమె ఆ రోజుల్లో దుర్గాపురంలో టీచరుగా ఉండేదట. ప్రకాశ్ అని పోష్టుమాష్టరు ఉండేవాడు. కులం ఒకటిగాదు. కాని లోకాన్ని ఎదిరించి వివాహం చేసుకున్నారు. తరవాత వారికి నేను కలిగాను.

మా నాన్న మారిపోయాడు. కారణం లోకం.. అనుమానస్థుడు. ఊళ్ళో వాళ్ళందరికీ ఆవిడ నిప్పులాంటిదని తెలుసు. కాబట్టే పగబట్టింది. నింద వేశారు. అమ్మ కుళ్ళికుళ్ళి ఏడ్చింది. - నిజం తెలుసుకోలేకపోయాడు. - హెడ్ మాష్టర్‌కీ, ఆమెకీ అక్రమ సంబంధం అంటగట్టారు. నాన్నలో అనుమానం పేరుకుపోయింది. కావాలని ఎదిరించి చేసుకున్న వివాహ బంధాన్ని కర్కశంగా తునాతునకలు చేశాడు.

అంతే. అమ్మ నన్ను తీసుకుని తల్లిదండ్రుల దగ్గరకు వచ్చింది. కాని వారికి ఇష్టం లేని సంబంధం. వారు దరికి రానీయలేదు. అప్పుడే మా మామయ్య యుద్ధం నుండి వచ్చాడు. గుడ్డివాడు. గుడ్డివాడని తెలుసుకుని ఆయన భార్య సంబంధం తెగతెంపులు చేసుకున్నది. లోకమంతా స్వార్థం కృత్రిమ ప్రేమలతో నిండి ఉన్నది మాష్టారూ. ఆయనకు అమ్మంటే ప్రాణం. యుద్ధం నుండి వస్తూ 'కొంత డబ్బు తెచ్చాడు. నన్ను వారిద్దరు పెంచారు ఎటో తీసుకుపోయి.

అమ్మ నిర్దోషి కాబట్టే కుమిలిపోయింది. తనలో తాను దహించుకుపోయింది. మంచాన పడ్డది. స్ఫోటకం అమ్మ దృష్టిని లాక్కున్నది.

ఇద్దరూ గుడ్డివాళ్ళే నన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు మాష్టారూ. వారిద్దరూ బాగుండి, మా నాన్న కూడా ఉంటే . . . '' శేఖరం కంఠం రుద్ధమైంది.

తమాయించుకుని తిరిగి చెప్పాడు.

''కాని ఆ అదృష్టం నాకు లేదు. అంతటితో దురదృష్టం మమ్మల్ని వీడలేదు.

నాకు సుశీలతో పెళ్ళి అయింది. సుశీల చదువుకున్నది కాస్తోకూస్తో. ఈ జీవితాలన్నీ శాపగ్రస్తాలు. సుశీల పేరుకు పూర్తిగా విరుద్ధం. కళ్ళు లేని మామయ్యనీ, అమ్మనీ అగౌరవపరిచింది - వారిని వదిలివేసి రమ్మన్నది.

నా బతుకుబాటను తీర్చిదిద్దిన మామయ్యను, దావానలాన్ని మింగి, నవనీతంలాంటి మనసు, మమతా పంచి చల్లగా పెంచిన నా అంధురాలైన మాతృమూర్తిని ఎలా వదిలేది చెప్పండి?

ఇన్ని జీవితాలు పాడవగా తను దూరంగా పారిపోయి బావుకొనేదేమిటి?

''నీ సుఖం చూసుకో - నాతో బాధలు పడకు. వెళ్ళిపో'' అన్నాను.

దుష్టవిధి క్రూర నియంతృత్వం మమ్మల్ని విడదీసింది.

దీపం, జీవితం - ఈ రెంటికీ సామ్యం ఉంది మాష్టారూ. మీ ముఖం చూస్తుంటే ఇంత చెప్పాలనిపించింది. మీ పక్కన నడుస్తూంటే, మీతో మాట్లాడుతుంటే చల్లని నీడన సేద తీర్చుకున్నట్లున్నది. జీవితం దీపశిఖలాటిదయితే - ప్రేమానురాగాలు, మల్లెలాంటి మను చమురులాంటివి. చమురు లేని దీపాలు కొడిగట్టవా మాష్టారూ? అలాగే మా నాన్న, అమ్మ, మామయ్య, నేను,

అంతా కొడిగట్టిన దీపాలం మాష్టారూ!''

శేఖరం కళ్ళు తుడుచుకున్నాడు. ప్రకాశరావుగారి హృదయస్పందన ఎక్కువైంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

''క్షమించండి. మీకు బాధ కలిగించాను. ఉదయం వస్తాను.'' శేఖరం వెళ్ళాడు.

అర్థరాత్రి తలుపు ఎవరో బాదుతున్నారు. శేఖరం బద్ధకంగా తలుపు తెరిచాడు. లైటు వేశాడు. కాంతి సీతయ్యను పరిచయం చేసింది.

''ఏమిటి సీతయ్యా?'' అన్నాడు శేఖరం.

సీతయ్య గాభరాగా ''అయ్యగారు పడిపోయారు. రండి! ఏమిటో అంటున్నారు. నాకర్థం గావడం లేదు బాబూ!'' అన్నాడు.

ఆదుర్దాగా శేఖరం బంగళాకు వెళ్ళాడు. సీతయ్య వెంబడించాడు.

వరండాలో లైటు వేసి వుంది. ప్రకాశరావు గారు కింద గచ్చుపైన బోర్లాపడి ఉన్నారు. అస్పష్టంగా ఏవో గొణుగుతున్నారాయన.

శేఖరం ఆయన దగ్గిరగా వెళ్ళి ఆత్రతగా ''ఏమిటి మాష్టారూ'' అని లేవదీసే ప్రయత్నం చేశాడు. ప్రకాశరావుగారు ఏదో సంజ్ఞ చేశారు. శేఖరం చేతుల్ని తన గుండెకి హత్తుకుంటూ - నిర్వేదం తొణికిసలాడగా - నూతిలో నుండి మాట్లాడినట్లు అన్నారు -

''శేఖరం, ఇహ బతకను. గాబరా పడకు. ఒకసారి 'నాన్నా' అను నాయనా. మీ అమ్మ బతుకును సర్వనాశనం చేసింది ఈ పాతకుడే. ఈ దీపం ఇహ వెలగదు. నీవన్నట్లు మన బతుకులు కొడిగట్టిన దీపాలే. ఇంతకన్నా ఏమీ చెప్పలేను బాబూ. నువ్వు, అమ్మ, మామయ్య నన్ను క్షమించండి. వారిని ఎన్నడూ నిర్లక్ష్యం చేయకు - '' అంతే. ఆయన పక్కకు ఒరిగిపోయారు.

ప్రకాశరావుగారి బతుకు దీపశిఖ ఆరిపోయింది.

శేఖరం ''నాన్నా!'' అని ఆయన నిర్జీవ శరీరం మీద పడిపోయాడు.

సీతయ్య అశ్రునయనాలతో 'ఘన తిమిర నిబిడ నిశీధి' లోకి చూస్తూ ఉండిపోయాడు!

ప్రచురణ : ఆంధ్ర ప్రభ 07.02.1968

• • •

# ముగింపు లేని కథ

(ఈ రాసే ఆయన నాకు బాగా తెలుసులెండి. ఓ రోజున ఆయనకు నా కథ ఆసాంతం చెప్పాను. బోలెడు జాలిపడ్డారు. ఎలాగో జాలిపడ్డారు కాబట్టి ఆ జాలితో ఓ కథ రాయండి - ఎన్నడూ సంతోషం అన్నమాట ఎరుగని నేను నా కథను అచ్చులో చూచుకొని సంతోషిస్తాను అని అడిగాను. సరేనన్నారు. ఓ వుదయం 'రాసేశాను మాష్టారూ!' అంటూ పట్టుకొచ్చేసారు. అబ్బ ... .. నా జీవితంలో మొట్టమొదటిసారి చాల సంతోషించాను సుమండీ! యీ కథ ఎవరినీ విమర్శిస్తూ వ్రాసింది కాదని యిప్పటికే తెలుసుకునే వుంటారు. మీ ఎరుకలో ఎక్కడైనా వేకెన్సీలు వుంటే చెప్పండి - రెక్కలు కట్టుకువచ్చి మీ దగ్గర వాల్తాను - సరేనా? లాపోతే మీమీదే ఓ కథ మా రాసే ఆయనకు చెప్పి రాయించి మీకే అంకితమిప్పిస్తాను - నవ్వి వూరుకోక సిన్సియర్‌గా ప్రయత్నం చేయండి. -- మీ పంతులు )

అదుగో వూరు.

ఆ వూళ్ళో ఆకాశం వుంది.

ఆ వూళ్ళోనూ రాత్రింబవళ్ళూ, చీకటి వెలుగులూ వున్నయ్.

చీకటి లాంటి కష్టాలు, వెలుతురు లాంటి సుఖాలతో తోచక సతమతమవుతున్న వాళ్ళూ, గతం కలవాళ్లూ, భవిష్యత్తు వున్న వాళ్ళూ, వర్తమానాన్ని దాని మానాన దాన్ని వదలి గతాన్ని పట్టి వేలాడే వాళ్ళూ, రంగురంగుల భవిష్యత్తు బయోస్కోపును మనోయవనిక మీద చూసుకుని లొట్టలు వేస్తూ వర్తమానాన్ని నిర్లక్ష్యించి గాలిలో సాము చేసే వాళ్ళూ ఆ వూళ్ళో వున్నారు.

బొజ్జలు పెంచిన సేట్లూ, విపరీతంగా పెరిగిన రేట్లూ, చీకటి బజార్లూ, వెలుతురు బజార్లూ, మసక బజార్లూ, చిరునవ్వులు చిందిస్తూనే రొంటిలో తళుక్కుమనే విషపు కైజార్లూ వున్నయ్ .... ఆ వూళ్ళో.

పాముల్లాంటి మనుషులూ, కోరలు తీసిన పాముల్లాంటి మనుషులూ, పనిబోయిన తహసిల్దారులూ, పని వున్న తహసిల్దారులూ, బల్ల క్రింద చేతుల వాళ్ళూ, బల్లపైన చేతుల వాళ్ళూ అందరూ వున్నారు.

ఆ వూళ్ళో మురుగు కాలవలూ వున్నయి. భారతదేశ పటంలో రైల్వే లైన్ల గీతల్లాగ. ఆ కాల్వలలో పుష్కలంగా వాసన. పందులు - రోడ్లు - రోడ్ల మీద చలికాలం మంచు పొగలా దుమ్మూ - కార్లు - లారీలు - లారీల చక్రాల నడుమ పిప్పి అయిన పిల్లలు- ఐదో ఫారం - క్రూడాయిలు కంపు - యింకా చాలా వున్నాయి ఆ వూళ్ళో.

బారులూ - బీరులూ - రాకెన్రోళ్ళూ - ట్విస్ట్‌లూ - జిప్సీలూ - నాలుగు మార్టినీలు - ఏక్దంన పీల్చేసే హైక్లాస్ బూజర్సూ - తిన్నది అరక్క గంతులేసే తైతక్కలాటగాళ్ళూ - కౌబాయ్ జీన్సూ - టైట్ ఫిట్టింగ్సూ అబ్బో ... ఎన్నో యింకా బోలెడువున్నాయ్. ....

ఆ వూళ్ళో వుద్యోగాలు చేసే ఆడవాళ్ళూ, మగవాళ్ళూ - ఆడవాళ్ళు ఉద్యోగం ఏడ్వడం యిష్టం

లేని మగవాళ్లూ - వుద్యోగం మీద యింటరెస్ట్ లేని మగరాయుళ్ళూ - యిద్దరూ సంపాదిస్తు డబుల్ యింజన్‌లా సంసారాన్ని లాగే భార్యాభర్తలూ వున్నారు.

ఆ వూళ్ళోనే ఒక యిరుకయిన గొంది వున్నది. ఆ గొందిలో ఒక చాలీచాలని యింట్లో అతను వున్నాడు. ఆ వూళ్ళో వున్న చాల మంది "అతన్ల" లాంటి వాడే అతను. కాని యితర అతన్లకు వుద్యోగాలున్నయ్. - సుఖముంది. సమస్యలు లేవు. కష్టాలు లేవు.

కాని యీ 'యితనికి' వుద్యోగం లేదు. ముఖ్యంగా - తర్వాత సుఖం లేదు - సమస్యలున్నయ్ - కష్టాలున్నయ్. యితనికి మిగతా అతన్లలా బొడ్డు కోసి పెట్టిన పేరూ వున్నది. అమ్మా, నాన్నా, పెళ్ళాం, తమ్ముడూ, చెల్లెళ్ళూ వున్నారు. యిహ తక్కువయినది బిడ్డలు.

యిహ కులమత భేదాలు అప్పే లేవు అంటూనే అన్నిచోట్లా పాటించబడుతున్నయ్ గాబట్టి అందరిలానే అతనికీ కులముంది.

యిహపోతే అతని పేరు వి. మురళీకృష్ణ మోహన లక్ష్మి నరసింహ శర్మ. ఆయన కులం అతని పేరులోనే వున్నది చిట్టచివర. పెళ్ళయింది గాబట్టి అతనికి యజ్ఞోపవీతమూ వున్నది ఒంటిమీద. ఆ కుటుంబ పూర్వ ప్రాభవానికి ప్రతీకలాగ.

వాళ్ళింట్లో వాళ్ళ నాన్నకు కూడ యజ్ఞోపవీతమున్నా - సంధ్యావందనం - గాయత్రీ మడీ దడీ ఏమీ లేవు. కనీసం పూర్వ ప్రాభవం చాటే ఉద్ధరిణ - హరివేణం కూడ లేవు. వి.ము.కృ.మో.ల.న.శ. నాన్నకు పూర్వం కాస్త పొలముండేది. యిప్పుడదీ లేదు. కొంతమంది కూతుళ్ళకు పెళ్ళి చేయడానికే సరిపోయింది అది.

అయిన వారి పెళ్ళిళ్ళు అవగా - యింకా ముగ్గురు ఆడపిల్లలు - యిద్దరు మగపిల్లలూ మిగిలారు. ప్రస్తుతం వాళ్ళు చదువుకుంటున్నా వారికీ ఎప్పుడో పెళ్ళిళ్ళు చెయ్యక తప్పదు.

వి.ము.కృ.మో.ల.న.శ. వాళ్ళ నాన్న ఆ వూరి బళ్ళో పంతులు. వి.ము.కృ.మో.ల.న.శ. చదువుకున్నాడు. కాని స్కూలు ఫైనల్ వరకే చదువుకున్నాడు. ఆడంబరం - ఆర్భాటం యిష్టం లేక - చాలా మామూలుగా - ప్రత్యేకత ఏమీ లేకుండా కాసిని మార్కులతోనే ప్యాసయినాడు.

ఆ యిరుకైన గొందిలో - యింకా చుట్టుపక్కల గొందుల్లో తెలిసిన వాళ్ళు అతనిని పంతులు అంటారు - అంత పొడుగాటి పేరు వల్లించలేక.

ఝంఝుప్పొగు తెచ్చిన పేరది. దాని వల్లనే తనకా 'పంతులు' పేరు వచ్చింది అని విసుక్కుంటాడు అతను - అందరూ అతన్ని 'పంతులూ' అన్నప్పుడల్లా వాళ్ళ నాన్న లాగానే తను కూడా బడి పంతులులవుతానేమోనని భయపడేవాడు అతను - కాని అంతా అలాగే పిలుస్తారు అతనిని. అతని ఎస్సెల్సీ రిజిష్టర్‌లో కులం యింగ్లీషులో గుండ్రంగా రాశారు - హిందూ బ్రాహ్మడు అని -

ఒంటిమీద యజ్ఞోపవీతం -

పేరు చివర రెండక్షరాల గుర్తు -

యివన్నీ తన ప్రగతి పథానికి అడ్డుగోడలు అనుకుంటాడు పంతులు. తను బ్రాహ్మణుడు కాబట్టి గదా అందరికీ యింత లొగుసాను అయింది - అందుకనేగదా తనని అందరూ పంతులు అంటారు అని ఎంతో బాధపడ్తాడతను-

పంతులు ఎస్సెల్సీ ప్యాసయి ఆరేళ్ళయింది. ఆరేళ్ళలో అరవై వుద్యోగాలకు దరఖాస్తు పెట్టాడు. ఒకసారి యింటర్వ్యూకి యిద్దరే వచ్చారు. ఆ యిద్దర్లో పంతులు ఒకడు - పంతులు కన్నా

తక్కువ పర్సంటేజ్ అతనిది - కాని అదృష్టం అప్పుడూ పంతుల్ని యీడ్చి తన్నింది.

కాని పంతులికి టెరిలిన్ చొక్కాలేదు - మరో అతనికి టెరిలిన్ చొక్కా వుంది - టెరిలిన్ ప్యాంట్ వుంది. నైలాన్ సాక్సు ఎంబాసిడర్ షూ - స్క్వేర్ వాచ్ వున్నయ్-

పంతులుకి పైజామా వుంది - చిరుగులు పట్టిన కాటన్ షర్ట్ వుంది - అరిగిపోయిన కంట్రీ మేడ్ చెప్పులు - కూడ వున్నయ్.

మరో యింటర్వ్యూ - ఎలా వెళ్ళాడో అలానే తిరిగి వచ్చాడు - ముందు వెళ్ళాడు ఛాంబర్ లోకి - అప్పుడే పక్క గదిలో వాల్ క్లాక్ గంటలు కొట్టింది - ఎన్నో - పంతులు పట్టించుకోలేదు.

"యిప్పుడు గడియారం ఎన్ని గంటలు కొట్టింది?" ఆఫీసర్ వేసిన మొదటి ప్రశ్న. అదే ఆఖరు ప్రశ్న కూడ అయింది.

పంతులు చేతికి గడియారం లేదు -

గంటలు లెక్కపెట్టలేదు -

నోరు వెళ్ళబెట్టాడు -

"యూ కెన్ గో ప్లీజ్!" అనగానే అలాగే నోరు తెరుచుకునే వచ్చేసాడు -

యిలాంటి యింటర్వ్యూలు ఎన్నో.

● ● ●

వుద్యోగాలు యిచ్చేవారు వెలివేసారు పంతుల్ని - యింట్లో కూడా సానుభూతి లేదు. పంతులు తండ్రి పంతుల్ని గోడపై నల్లిని చూచినట్లు చూస్తాడు. పంతులు తల్లి - భోజనం దగ్గర కాస్త కూర ఎక్కువ వెయ్యమంటే విసుక్కుంటుంది.

ఆకలి వేసి అన్నం పెట్టమంటే "వస్తున్నా - ఏం - అంత వెలగబెట్టే వుద్యోగాలు ఏమి వున్నయ్యిట?" అంటుంది.

చివరికి పంతులు చెల్లి కూడ స్నానాల దగ్గర - ఎత్తి పొడుస్తుంది. "నీకేం ఆఫీసుందా - నే బడికి పోవాలి. నన్ను పోనీ ముందు" అని.

చిట్టచివరికి పంతులు గొప్ప వేదాంతి అయిపోయాడు - వేదాంతి అవడానికి ఏ క్వాలిఫికేషనూ, డిగ్రీ అక్కరలేదు - అలాగంటే పంతులు స్థానంలో ఎవరున్నా అలాగే అయిపోతారు -

ప్రపంచంలో కులమతాలు లేవన్నారు - కానీ అవి బాహాటంగానే వున్నయ్.

అవినీతి నిర్మూలనం అన్నారు - కాని అదీ ఎక్కడపడితే అక్కడే వున్నది. లంచం లేనిదే వుద్యోగం రాదు.

ఔటర్ బ్యూటీ అన్‌నెసెసరీ అన్నారు - కానీ టెరిలిన్ చొక్కా లేకపోతే సెలక్షన్ రాలేదు.

తనకు ఉద్యోగం రాకపోవడానికి తను బాధ్యుడు కాడు. అయినా తండ్రి చీదరిస్తాడు. అప్రయోజకుడు తను. అమ్మ చీదరిస్తుంది. చెల్లి వెక్కిరిస్తుంది.

మమత - ప్రేమ - వున్నయ్యంటారు - తల్లికి తండ్రికి అవి లేవు - యిహ ప్రపంచమంతా డబ్బుతో నడుస్తున్నది.

ఉద్యోగం డబ్బుతో కొనుక్కోవచ్చు.

ప్రేమ - మమత - అనురాగం - యిలాంటివి కూడ డబ్బుతోనే ముడిపడి వున్నయి.

తన దగ్గర డబ్బు లేదు.

కాబట్టి ఉద్యోగం రాదు -

తల్లీ తండ్రీ సానుభూతి లేదు - లోకుల సానుభూతీ లేదు - కట్టుకున్న భార్య సానుభూతి కూడా లేదు -

పెళ్ళయి నాలుగేళ్ళయింది - ఒక్క చీర కొనలేదు యీ నాలుగేళ్ళలో.

మొదట భార్య ప్రేమగానే వుండేది.

కాని నిరుద్యోగానికి టైంబార్ లేకపోయేటప్పటికి ఆవిడ ప్రేమ యిగిరిపోయింది.

ఆహా ! నీకు ఉద్యోగం దొరికినట్లే - అన్నట్లు తీసిపారేస్తుంది.

అసలు వుద్యోగం లేనిదే పెళ్ళెందుకు? తనేదో తాడు తెంచుకు పోతున్నట్లు తొందరపడి తెచ్చి కట్టారు - మేనమామ కూతుర్ని -

ఆవిడ పంతుల్ని - "బావ కూడ ఒక మొగుడేనా" అన్నట్లు చూస్తుంది.

అంతా మిథ్య బతుకులు.

పంతులుకి బతుకంటే వెగటు పుడుతోంది. తను యిక యీ బాధలు పడలేడు. తనకిక ఉద్యోగం రాదు. తన భవిష్యత్తుకు తన కులమే అడ్డుగోడై నిలిచింది. యీ జన్మకిక యీ బతుకు చాలు!

వచ్చే జన్మలోనైనా ఉద్యోగాలకు అర్హత వున్న కులంలోనే పుట్టాలి - హే భగవాన్! లేక డబ్బు వున్న కుటుంబంలోనైనా పుట్టాలి.

ఆరునెలల క్రితం ఒక వుద్యోగానికి దరఖాస్తు పంపాడు. సర్టిఫికెట్లు ట్రూ కాపీలు కూడ పంపాడు. యింకా ఏమీ తెలియలేదు.

యిహ అది రానట్లే - యింకా అదేమొస్తుంది.

యింకా యీ బతుకెందుకుట?

చచ్చిపోవాలి.

ఏకగ్రీవంగా తీర్మానించుకొన్నాడు పంతులు.

● ● ●

ఆ రోజే పంతులుకి ఆఖరి రోజు.

ఆ రోజు సాయంత్రం వరకూ వుద్యోగం గురించి ఏమైనా వస్తుందేమోనని చూసాడు.

అర్థరాత్రి అంతా నిద్రోతున్నారు.

పంతులు మెల్లిగా లేచాడు. చొక్కా విప్పి జంధ్యం తీసాడు - యిదే యింత చేసింది - దీని వల్లనే వుద్యోగానికి అర్హత లేకుండా పోయింది.

కనీసం చావడానికైనా పనికొస్తుంది. అందుకు సంతోషించాలి. యజ్ఞోపవీతాన్ని తాజు ముడివేసి మెడకు తగిలించాడు - గోడకున్న చిలక కొయ్యకు జంధ్యం చివర తగిలించాడు.

మెడ బిగిసింది.

తను చనిపోతున్నాడు - మరుక్షణంలో తను వుండడు- పక్షి ఎగిరి పంజరం మిగిలిపోతుంది.

అంతా లేచి చూస్తారు - ఏడుస్తారు. వీళ్ళ బొంద - పోయినందుకు సంతోషిస్తారు. బతికినన్నాళ్ళు తన మీద ఏడ్చి యిప్పుడు చస్తే చక్కగా నవ్వుతారు.

ముడి బిగుస్తున్నది - గొంతు నొప్పి పుడుతున్నది.

వుద్యోగం వస్తుందేమో - యింకా తెలియలేదు కదా? అమ్మో వస్తే? - తను వుండడు. తను అనవసరంగా చస్తున్నాడేమో ... చనిపోయిన తర్వాత వుద్యోగం వస్తుందేమో -

మెడ ఒరుసుకున్నది - నొప్పి ఎక్కువైంది. నాలిక తేలవేస్తున్నాడు. వుద్యోగం అమ్మో - చావను-

భయంతో పెద్దగా అరిచాడు.

చిలకకొయ్య దగ్గర జంధ్యం పుటుక్కుమన్నది. అరుస్తూనే క్రింద పడ్డాడు.

భార్య పరుగెత్తుకొచ్చింది.

ఏడుపు మొదలు పెట్టింది. అప్పుడే తన పసుపు కుంకుమలు పోయినట్లు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయింది పంతులుకి.

అమ్మయ్య - తను చావలేదు - కళ్ళు మూసుకున్నాడు.

భార్య ఏడుపు వినిపిస్తోంది. తండ్రి పరిగెత్తుకొచ్చాడు - తల్లి గోల పెట్టేస్తున్నది.

తను బతికితే అంతా రాబందుల్లా పొడిచేవారు - చావగానే ప్రేమ వున్నట్లు ఏడుస్తున్నారు.

ఏడవండి - లోపల సంతోషపడుతున్నాడు పంతులు.

ఎంత పని చేసావురా నాయనా - వుద్యోగం లాపోతే యింత పని చెయ్యాలిట్రా - నాయనా! నిన్నేమైనా అన్నాముట్రా-

యింకా ఏడిపించాలి వీళ్ళని రాస్కెల్స్ -

వూపిరి బిగపట్టాడు పంతులు - అంతా ఏడుస్తున్నారు - పంతులు కదల్లేదు - యింతలో తెల్లారింది.

అయ్యో పంతులు వురోసుకున్నాడా?

పాపం వుద్యోగం రాలేదు మరి -

చచ్చిన తర్వాత కూడ పంతులే తన పేరు. ఏనుగు చచ్చినా బతికినా వెయ్యి రూపాయలే అన్నట్లు.

కాస్త సద్దు మణిగింది. పంతులు కాస్త కన్ను తెరచి చూశాడు - తండ్రి కుక్కి మంచంలో కూర్చుని ఏడుస్తున్నాడు. ఏడుపు ఏడ్వడానికి కూడ మంచం కావాలి గావల్ను.

వచ్చే వాళ్ళు వస్తున్నారు. పంతులు సంబరపడుతున్నాడు.

మెల్లగా మూలిగితే -?

యిలా వూరుకుంటే తీసికెళ్ళి చక్కగా తగలేసి కూడ వస్తారు - హమ్మో కపాల మోక్షం! బాబోయ్ వుద్యోగం రాకేం చేస్తుంది - వస్తుంది.

అబ్బో .... హు అ - హ - మూలిగాడు పంతులు - వాళ్ళ అమ్మ పరిగెత్తుకొచ్చింది.

అయ్యో - ఏమండీ - యిలా రండి - చిట్టి తండ్రి మూలుగు తున్నాడు. అయ్యో స్పృహ పోయినట్లుంది.

పంతులు తండ్రి పరిగెత్తుకొచ్చాడు.

నీళ్ళట్రండి!

ఎంత పని చేసావురా నాయనా - పంతులు మొహం మీద చెంబుడు నీళ్ళు కళ్ళాపి చల్లారు. వొళ్ళు ఝుల్లుమంది - మళ్ళా మూలిగాడు. పొద్దెక్కుతున్నట్లుంది. - మెల్లగా కన్ను తెరిచాడు.

హ - అ - ఆ - అన్నాడు - మాటాడకుండ నవ్వు వస్తున్నది. ఆపుకున్నాడు.

ఏమిట్రా నాన్నా - వొరేయ్ మురళీ - హమ్మయ్య - అబ్బాయ్ మనకి దక్కినట్లే...

ఎవరూ - పోష్టుమ్యాన్ - ఆ ఏమిటి?- రిజిష్టరా - పంతులు ప్రాణం పోయినది కాస్తా

వచ్చేసింది - ఆ - వుద్యోగందే తప్పకుండా -

మెల్లిగా లేచి కూర్చున్నాడు - అమ్మా - హ - హ - అంటూ.

అందరి కళ్ళూ తృప్తిగా మెరిసినై.

అబ్బాయ్ వొంట్లో కులాసాగా లేదే - గాని నే సంతకం చెయ్యొచ్చా? - అంటున్నాడు ముసిలాయన.

అబ్బే ఆయనగారే చేయాలి -

అయితే ఇలారా -

పంతులు పొంగిపోతున్నాడు. తను నిజంగా చనిపోయినట్లయితే - యీ వుద్యోగం కాస్తా - గోహోవిందా-

సంతకం చేసాడు నీరసం నటిస్తూ -

నువ్వలా కూర్చో - నేచూస్తా -

ఎవడి అబ్బ సొమ్ము - ఆఫీసార్డరేలే -

ఎవరికోసమిస్తార్రా - ఛర్‌మని చింపాడు ముసలాయన కవరుని.

తెల్లని కాగితం మడత విప్పాడు -

చదివాడు -

మీ మార్కుల సర్టిఫికెట్ ట్రూ కాపీలపై గెజిటెడ్ ఆఫీసరు సంతకం లేదు. కావున మీ దరఖాస్తును స్వీకరించలేము. --- మానేజర్

నీరుకారి పోయాడు పంతులు.

చనిపోయినా బావుండేదనుకున్నాడు.

యీసారి గట్టిగా చనిపోవాలని కూడా నిశ్చయించుకున్నాడు.

ప్రచురణ : చుక్కాని 15.10.1966

● ● ●

# డెవిల్ ఇన్ డిజ్‌గైజ్

లవ్ లవ్ మీ డూ - యూ నో ఐ లవ్ యూ, ఐ విల్ ఆల్వేస్ బి ట్రూ - సో ప్లీజ్ లవ్ మీ డూ --- హమ్మింగ్ చేస్తూ, మంచి హుషారుగా వెంకుబాబు ఎస్కిమో హోటల్ బయటికొచ్చేడు కాఫీ తాగి హడావుడిగా.

"ఒరే వెంకూ" అన్నాను పక్కనే వున్న బుక్‌స్టాల్‌లో ఏదో పుస్తకం కొందామనుకొంటున్న నేను. "హాయ్ శీనూ.... పద లీలామహల్‌కి... " అన్నాడు వెంకు.... నా భుజం మీద చేయి వేసి.

"ఏమిట్రా నీ హడావుడీ నువ్వూనూ... ఆ కూనిరాగాలేంటి?"

"ఓరినీ... కూనిరాగాలుట్రా యివి... బీటిల్స్ లవ్ సాంగ్స్‌రా ... లవ్ లవ్ మీ డూ, యూ నో ఐ లవ్ యూ....1962లో క్రియేటివ్ రైటింగ్ జీనియస్ జాన్ లెన్నన్, పాల్ మెక్కారటనీ, రాసిన పాటరా యిది. వాళ్ళే పాడారు.. అంత తేలిగ్గా కూనిరాగం అని తీసి పారెయ్యకు... పద.. లీలామహల్‌లో మంచి సినిమా... మారిపోయిందేమో కూడా... టు సర్ విత్ లవ్ సినిమా మారితే ఆపరేషన్ థండర్ బోల్ట్... ఎ స్ట్రైక్ ఆన్ ఎన్‌టెబ్బీ... ఏదైనా ఫరవాలేదు. ఏదైతే అది చూద్దాం పద." వెంకుబాబు చెప్పుకొంటూ పోతున్నాడు.

"భలే వాడివిరా... యింగ్లీషు పాటలూ, సినిమాలూ, ఎప్పుడూనూ .... నువ్వొళ్ళిరాలే...."

వెంకుబాబు వదల్లేదు. పట్టువదలకుండా .... "టు సర్ విత్ లవ్ అయినా చాలా సుపెర్బ్. సిడ్నీ పోయిషీర్. 1967లోని బ్రిటిష్ డ్రామారా. లండన్‌లోని యిన్నర్ సిటీ స్కూల్ లోని సోషల్, రేషియల్ యిస్యూస్‌కి సంబంధించిన సినిమా రా. సిడ్నీ పోయిషీర్ గొప్పగా నటించేడులే. గ్రేట్ పిక్చర్. టు సర్ విత్ లవ్ సాంగ్ కూడా సుపెర్బ్. లూలూ కూడ ఆ పాట పాడింది. పదరా... ఎప్పుడూ వుండేవే పనులు...."

యిక వీడు నన్నొదిలేట్టు లేడని -- సరే పద అన్నాను.

"పిక్చర్ టైమ్ అయిపోతోందిరా... టిక్కెట్లు దొరికేనా?..." అన్నాను.

"వ్హైనాట్... డెఫినెట్లీ... డోంట్ వర్రీ... నేనున్నాగా.. లోపల నా ఫ్రెండ్ ఆంజనేయులున్నాడులే.. అంత మరీ టైట్‌గా వుంటే, ఆయనకు చెప్దాంలే. అది నేను చూసుకుంటాలేరా.. యిప్పటివరకూ టిక్కెట్టు దొరక్క ఎప్పుడూ తిరిగి వెళ్ళలేదు."

రిక్షా ఎక్కేం. మళ్ళీ జెనిఫర్ లోపెజ్ 'వెయిటింగ్ ఫర్ టు నైట్' సాంగ్ మొదలుపెట్టేడు.

వెంకుబాబుకు ఇంగ్లీషు పిక్చర్స్ అన్నా, పాటలన్నా ప్రాణం. వాటి గురించి చెప్పడం మొదలుపెట్టేడంటే, మనం నోరు వెళ్ళబెట్టి, వింటూ వుండాల్సిందే.

యింతలో పాట ఆపి, టాపిక్ మార్చేడు. "ఎస్సెల్సీ వరకు పరీక్షలు లేకుండా ఏకంగా టెన్త్‌లోనే పబ్లిక్ పరీక్షలుట. యీ పిల్లలకి యింగ్లీషు ఏమొస్తుందిరా." అన్నాడు వెంకు.

"ఏం... ఎందుకు రాదురా..." అన్నాను.

"పరీక్షలుంటేనే అంతంత మాత్రం.. లేకపోతే పిల్లలేం చదువుతారురా.. యింగ్లీషు అసలు రాదు... పిక్చర్‌లో ... టెన్ కమాండ్‌మెంట్స్ అనుకుంటాను. కమ్ టు మీ నో మోర్ మోజెస్ ... అనే

డైలాగ్ విని... నోరు మూసుకోమంటున్నాడనుకుంటారు.''

ఒక్కసారి పగలబడి నవ్వేసేను.

''సరేలేరా వాళ్ళ తిప్పలు వాళ్ళు పడతారు.''

వెంకుబాబుకు యీ యింగ్లీషు పిక్చర్స్ చూడ్డానికి వచ్చే వాళ్ళ గురించి కూడ ఒక మిస్ నోమర్ వుంది.

''చాల మందికి యింగ్లీషు పిక్చర్స్ అర్థం కానే కావురా. యింగ్లీషు సినిమాలు చూడ్డం ఒక ఫ్యాషన్. ఏదో కొంతమందికే అర్థమవుతుంది. సరదాకు వచ్చేవాళ్ళు, పక్కవాడు నవ్వుతే తను నవ్వడం, పక్కవాడు ఏడిస్తే తను ఏడ్వడం.... యిదే తంతు....''

''భలేవాడివి రా'' ... నాకు నవ్వొచ్చింది.

వెంకుబాబును చాలసార్లు చూసేను. టిక్కెట్లు దొరకవనే భయం అసలు లేదు. అంత మరీ క్యూ వుంటే... ఆ క్యూలో వాడితో బాటు ఎప్పుడూ సినిమాలు చూసే హ్యాబిట్యుయల్ సినీ గోయర్స్, తెలిసిన వాళ్ళు చాలా మంది వుంటారు. వెంకుబాబును చూడగానే, ఎవరో ఒకరు వీడిని ఒరే వెంకూ అని పిలవడం, అక్కడే వుండరా టిక్కెట్టు నేను తెచ్చిస్తాలే అని అనడం... వీడి ప్రోబ్లమ్ సాల్వ్డ్....

'ఫర్ ఎ ఫ్యూ డాలర్స్ మోర్' పిక్చర్ టైటిల్ మ్యూజిక్ విజిల్ వెయ్యడం మొదలుపెట్టేడు. యీ పాటలూ, యీల పాటలూ వాడి మనసులో చెలరేగుతున్న ఆరాటానికి ప్రతి రూపాలే. టిక్కెట్టు దొరికిందంటే యీలలూ, పాటలూ వాటంతట అవే ఆగిపోతయ్.

యింతలో 'జెర్రీ లూయిస్' ఎవరో తెలుసురా నీకు శీనూ అన్నాడు ఉన్నట్టుండి యీల ఆపేసి.

''తెలియదులే'' అన్నాను.

''అరె తెలియదా? అంత మరీ నాలెడ్జ్ లేకపోతే ఎలారా? జి.కె... ఇంప్రూవ్ చేసుకోవాలి. ఆయన అమెరికన్ కమెడియన్. నటుడు, గాయకుడు. యీ మాటలు యింగ్లీషులోనే చెప్పాలి. అతను యాక్టర్, సింగర్, ప్రొడ్యూసర్, స్క్రీన్ రైటర్, డైరెక్టర్... ఆల్ రోల్డ్ యిన్ టు వన్. నాకు చూడు... అతని బర్త్‌డే కూడ గుర్తుంది. 16.3.1926. న్యూజెర్సీ, న్యూయార్క్‌లో అతను నటించిన పిక్చర్స్ నట్టీ ప్రొఫెసర్, ది బెల్ బాయ్, ది యరెండ్ బాయ్. ఆయన 'నైట్ క్లబ్స్' లో పని చేసిన వాడు తర్వాత హాలివుడ్‌లో గొప్ప కమెడియన్ యాక్టర్ అయినాడు.

వీడికి యిన్ని వివరాలు... యింత నాలెడ్జ్ ఎలా వచ్చిందో.... జీనియస్ వెంకూ.. అనుకున్నాను. ఆ మాటే వాడితో అన్నాను.

నవ్వేడు వెంకు బాబు. .... ది జీనియస్... అదో పెద్ద కథలే... అన్నాడు.

''నేను ఒకసారి ఫ్రెండ్స్‌తో వైజాగ్‌లో ఇంగ్లీషు పిక్చర్‌కి వెళ్ళేను. ఆ వూళ్ళో వున్నప్పుడు. అప్పుడు యింగ్లీషు పిక్చర్స్‌కి నేను కొత్త. అందరూ నేను యిప్పుడు మాట్లాడుతున్నట్లు మాట్లాడుతుండేవారు. యాక్టర్స్ గురించి, సినిమాల గురించి, పాటల గురించి. నేను బిక్కమొహం పెట్టేవాడిని. నాలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ వచ్చింది. పౌరుషం, పట్టుదల వచ్చి ఎలాగైనా నేను వాళ్ళంత ఎదగాలని పట్టుబట్టాను. తర్వాత యిక్కడికొచ్చేక గత అయిదు సంవత్సరాలుగా లీలా మహల్, నవరంగ్ థియేటర్స్‌లో వచ్చిన ప్రతి ఇంగ్లీషు సినిమా వదలకుండా చేసేను. వాటి వివరాలు ఒక డైరీలో రాసుకున్నాను. అయిదేళ్ళలో 250 సినిమాలు చూసేన్రా.

యిప్పుడు నాకున్న నాలెడ్జ్ వైజాగ్‌లోని ఫ్రెండ్స్‌కి కూడ వుండదు. ఒకసారి ఆ వూరు వెళ్లేను.

వాళ్ళు ఇంగ్లీషు సినిమాకు తీసుకెళ్ళేరు. అక్కడా లీలామహల్ వున్నది. నా నాలెడ్జ్ చూసి అదిరిపోయేరు.''

``గ్రేట్ వెంకూ...'' అన్నాను భుజం తడ్తూ.

``ఎంటర్ ది డ్రాగన్ చూసేవుట్రా'' అన్నాడు మాట మారుస్తూ.

``చూడలేదురా'' అన్నాను.

``అది చూసి తీరాలిరా. 1973లో తీసిన హాంగ్‌కాంగ్ యాక్షన్ ఫిల్మ్‌రా. బ్రూస్‌లీ, జాన్‌శాక్సన్, జిమ్ కెల్లీ, అహానా కాప్రి యాక్టర్స్. టెర్రిఫిక్ యాక్షన్, మార్షల్ ఆర్ట్స్ ఫిల్మ్. యీసారి నేను చూపిస్తాలే. యిక నిన్ను నాలాగా తయారు చేయడం నా డ్యూటీ.

యింకా చాలా చూడాల్సినవి వున్నయ్. మెకన్నాస్ గోల్డ్. 1969 సినిమా. గ్రెగరీ పెక్, ఒమర్ షరీఫ్, టెల్లీ సావలాస్, జైలీ న్యూమర్, కామిల్లా స్పార్వ్. కొలరాడో గ్యాంగ్‌స్టర్, మార్షల్ మెకన్నాని కిడ్నాప్ చేసి, బంగారు గనులున్న కొండ లోయల్లోకి... ఏం పిక్చర్ తీసినా నాచురల్‌గా తీస్తార్రా... హాలివుడ్ వాళ్ళు... గొప్ప డైరెక్టర్ జె.లీ థాంప్సన్.

క్లింట్ యీస్ట్ వుడ్... వ్హేర్ యీగిల్స్ డేర్.. 1968 ఫిల్మ్. వర్‌ల్డ్ వార్ టూ యాక్షన్ ఫిల్మ్. రిచర్డ్ బట్టన్, క్లింట్ యీస్ట్ వుడ్, మేరీ యీరె నటులు.

యీస్ట్ వుడ్ నోట్లో సిగార్ చూసేవా. అతన్ని చూస్తే మనకి కూడ ఒక సిగార్ నోట్లో పెట్టుకుని గుండెల్లోకి ఒక దమ్ములాగి చూద్దామనిపిస్తుంది. దమ్ము లాగుతామో, దగ్గిదగ్గి చస్తామో, తర్వాత మాట. డేరింగ్ రెస్క్యూ, యింకా భయానకమైన డేరింగ్ ఎస్కేప్ ఆపరేషన్స్ చూసి తీరాలిరా శీనూ....

జేమ్స్ బాండ్ పిక్చర్స్ చూసేవూ... అన్నాడు ఉన్నట్టుండి. అసలు యింగ్లీషు పిక్చర్స్ అంటే సీన్‌కానరీవే జేమ్స్ బాండ్ 007 సిరీస్‌వి చూడాలి. డాక్టర్ నో చూసి తీరాలిరా నువ్వు. 1962లో వచ్చింది. బ్రిటిష్ స్పై సీన్ కానరీ. 1958 లోని యియాన్ ప్లెమింగ్ నవల. ఇంటర్నేషనల్ జువెల్ స్మగ్లింగ్ ఆపరేషన్స్ పట్టుకోడానికి సీన్‌కానరీ స్పై ఉర్సులాయాండ్రెస్ వాళ్ళది గొప్ప జోడి. గొప్ప అడ్వెంచరస్ యాక్షను. టారెన్స్ యంగ్ డైరెక్షను. వాళ్ళిద్దరూ సముద్రంలోంచి బయటపడటమూ చాలా గొప్ప థ్రిల్లర్‌లే... చూసి తీరాలి.

యింకా యిలా చెప్తూ పోతుంటే కోకొల్లలు. యీ సినిమాలు చూస్తుంటే మన జ్ఞానం పెరుగుతుంది. మనకి బయటి ప్రపంచంలో ఎంత టాలెంట్ వున్నదో తెలుస్తుంది. మన బుద్ధి వికసిస్తుంది.

ది మెర్సినరీస్, ది కరాటే కిడ్, బెన్‌హర్, డర్టీ డజన్, వన్ ఫ్లూ ఓవర్ ఎ కుక్కూస్ నెట్ ఎన్నో...

యింతలో రిక్షా గతుకులలో పడ్డది. ఒక కుదుపు కుదిపింది.

సినిమాల సినాప్సిస్ వదలి పాట మొదలెట్టేడు వెంకు. లీలా మహల్ దగ్గరపడింది.

ఐ థ్రూ ఎ విష్ యిన్ ది వెల్, డోన్ట్ ఆస్క్ మీ ఐ విల్ నెవర్ టెల్, ఐ లుక్డ్ ఎట్ యూ యాజ్ యిట్ ఫెల్, అండ్ నవ్ యూ ఆర్ యిన్ మై వే... జప్సన్ పాడేడు.

జస్టిన్ బీబర్ సాంగ్ సే యూ లవ్ మీ యాజ్ మచ్ యాజ్ ఐ లవ్ యూ, వుడ్ యూ హర్ట్ మీ కుడ్ యూ డూ దట్ టు మీ య్యా...

మైకేల్ జాక్సన్ హీల్ ది వరల్డ్

దేరీజ్ ఎ ప్లేస్ యిన్ యువర్ హార్ట్ అండ్ ఐ నో దట్ యిట్ యాజ్ లవ్.

సార్ బారిల్లెస్ సాంగ్ --- యూ కెన్ బి అమేజింగ్... యూ కెన్ టర్న్ ఎ ఫ్రేజ్ యింటూ ఎ

వెపన్ ఆర్ ఎ డ్రగ్...

సడన్‌గా హమ్మింగ్ ఆగిపోయింది. లీలా మహల్ ఎదురుగా రిక్షా దిగాం. క్యాంటీన్‌లో ఇరానీ సమోసాల వాసన. యిరానీ చాయ్ ఘుమఘుమలు. టైం అయిపోయింది. యింటర్వెల్‌లో వీటి సంగతి చూద్దాం రా. పద. అంటూనే ఆంజనేయులుగారూ అని కేక పెట్టేడు. టికెట్టు కౌంటర్ రష్‌గా వుంది.

హలో వెంకుబాబూ అన్నాడాయన. రెండు కావాలా అని లోపలికి వెళ్ళి రెండు టిక్కెట్లు తెచ్చి యిచ్చి డబ్బులు తీసుకున్నాడు.

పదరా శీనూ మనం లక్కీరా యివాళ. ఆంజనేయులుగారే మనని వెతుక్కుంటూ వచ్చేరు. క్యూలో కుస్తీలు తప్పినై. నో ప్రాబ్లెమ్.. యింకా టైముంది - పద - సమోసా, చాయ్ లాగించి వెళ్దాం అన్నాడు. అవి కానిచ్చి హాల్లోకి వెళ్ళి సీట్లో కూర్చున్నాం. సినిమా ఆపరేషన్ థండర్ బోల్ట్ . టూ సర్ విత్ లవ్ వెళ్ళిపోయింది. యీ సినిమానే ఆపరేషన్ జొనాథన్, ఆపరేషన్ ఎన్టెబ్బీ అని కూడ అంటారులే. ఎ స్ట్రైక్ ఆన్ ఎన్టెబ్బీ ఒక చాలా భయంకరమైన మిలిటరీ రెస్క్యూ ఆపరేషన్.

సినిమా జరుగుతున్నంత సేపూ ప్రాణాలు బిగపట్టుకుని భయం భయంగా కూర్చున్నాం. వెంకు కూడ ఎప్పుడూ మాట్లాడుతుండే వాడు, కామ్‌గా కూర్చున్నాడు.

ఆరోజు, 27.06.1976. 248 ప్యాసెంజర్స్ వున్న ఎయిర్ ఫ్రాన్స్ విమానం హైజాక్ చేయబడ్డది. పాలస్టీన్ లిబరేషన్ ఫ్రంట్, జర్మన్ రెవెల్యూషన్ సెల్స్ వారి సభ్యులు ఆ విమానాన్ని హైజాక్ చేసి ఉగాండాలోని ప్రధాన ఎయిర్ పోర్ట్ ఎన్‌టెబ్బీకి తీసుకెళ్ళేరు. ప్రయాణీకుల్ని ఇజ్రాయిలీస్, జ్యూస్‌లుగా విడగొట్టి వారిని వేరు వేరు గదుల్లో ఖైదీ చేసేరు. హైజాకర్స్‌ను ఉగాండా డిక్టేటర్ ఇది అమీన్ సపోర్టు చేసేడు. ఆరోజే 47 మంది యిజ్రాయిలీస్ కాని వాళ్ళను వదిలివేసేరు. రెండో రోజు 101 మందిని మళ్ళీ వదిలేసేరు. వాళ్ళందర్నీ ఎయిర్ ఫ్రాన్స్ విమానంలో పంపేసేరు. 100 మంది కంటే ఎక్కువ యిజ్రాయిలీస్, జూయిష్ ఖైదీలను ఒక నాన్ జూయిష్ కెప్టెన్ బాకోస్‌ని ప్రిజనర్స్ చేసి చంపేస్తామని బెదిరించేరు.

యీ విషయం యిజ్రాయిలీ డిఫెన్స్ ఫోర్సెస్ మొస్సాడ్‌కి ఇంటిలిజెన్స్ ఏజెంసీల ద్వారా తెలిసింది. హైజాకర్స్ 101 మంది యిజ్రాయిలీ, జ్యూయిష్ హోస్టేజెస్‌ని, వారి ప్రిజనర్స్ ఇజ్రాయిల్‌లో వున్న వాళ్ళను వదలకపోతే, చంపేస్తామని బెదిరిస్తున్నట్లు ఐడిఎఫ్ వారికి తెలిసింది కూడ.

ఐడిఎఫ్ వారు ఒక వారం రోజులు తీవ్రంగా ఆలోచించి ఎన్ టెబ్బీపై దాడి చేయడానికి ప్లాను వేసేరు. 2500 మైళ్ళు (4000 కిలో మీటర్లు) దూరాన వున్న ఎన్‌టెబ్బీపై, 100 మంది కమెండోలతో 90 నిమిషాల పాటు పోరాడి 102 మంది యిజ్రాయిలీ హోస్టేజెస్‌ని విడిపించినై. 5గురు కమేండోస్ చాలా తీవ్రంగా గాయపడ్డారు. ఒక యూనిట్ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ యొనాటన్ నేతన్యహు చనిపోయేడు పోరాటంలో. 45 మంది యుగాండా సైనికులు చనిపోయేరు. 30 సోవియట్ మిగ్ 17లు, మిగ్ 21లు, ఉగాండా ఎయిర్ ఫోర్స్‌వి పూర్తిగా ధ్వంసం చేసేరు. యూనిట్ లీడర్ యొనాటన్ నేతన్యహు ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నేతన్యహుకి పెద్ద అన్నగారే. 2500 మైళ్ళు యుద్ధ విమానంలో ప్రయాణించి, ప్రాణాలకు తెగించి తమ వారిని ప్రాణాలతో తిరిగి తెచ్చిన యీ ధైర్య సాహసోపేతమయిన యుద్ధానికి ఆపరేషన్ జొనాథన్ అనీ, ఆపరేషన్ ఎన్టెబ్బె, ఎ స్ట్రయిక్ ఆన్ ది ఎన్టెబ్బె అని కూడ అంటారు.

ఇజ్రాయిల్ లైటెనింగ్ స్ట్రయిక్, ది రెయిడ్ ఆన్ ది ఎన్టెబ్బె అని కూడ పిలుస్తారు. 1976లో

సైమన్ డన్‌స్టన్ అనే రచయిత ఒక పుస్తకం కూడ రాసేడు.

వెంకుబాబు మూలంగా నాక్కూడ చాల రోజుల తర్వాత ఒక మంచి ఎడ్వెంచర్ ఫిల్మ్ చూసేను అని తృప్తిగా వుంది.

వెంకుబాబు అన్నాడు - ఇజ్రాయిల్ స్పెషల్ ఫోర్సెస్ రెస్క్యూ ఆపరేషన్స్ మానవజాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డయ్. 2500 మైళ్ళు శత్రువుల రాడారు నుండి తప్పించుకుని, ఎంటెబ్బీపై దాడి చేసి తమ దేశవాసుల్ని సురక్షితంగా తమ దేశానికి తీసుకు వెళ్ళడం అంత తేలిక పనా?.. ఎంత ధైర్యస్తులురా యిజ్రాయిల్ సైనికులు ... అన్నాను...

వెంకుబాబు గ్రేట్ ఫైటర్స్ అన్నాడు.

వెంకూ, నేనూ వాళ్ళ యింటికి వెళ్ళేం. హాల్లో సోఫాలో నన్ను కూర్చోమని వెంకు లోపలకి వెళ్ళేడు.

వాడి భార్య నిర్మల ఏదో అంటోంది ఇంతసేపు ఎక్కడికి వెళ్ళేరని.

వెంకు అంటున్నాడు "శీను హాల్లో వున్నాడు. నాతో వచ్చేడు. కాఫీ యివ్వు వాడికి"

"మీరు బయటికి వెళ్ళేటప్పుడు ఒక రూపాయి యిచ్చేనుగదా. మల్లెపూలు పట్రమ్మని. తెచ్చేరా?"

"తేలేదులే. శీను అర్జెంటుగా అవసరం అని అయిదు రూపాయలు అడిగేడు. నా దగ్గర వున్నవి, నీవు యిచ్చినవి కలిపి అయిదు రూపాయలు వాడికిచ్చేసాను. పాపం ఏం అవసరమో వాడికి. మల్లెపూలు రేపు తెచ్చిపెడతాలే.

నాకు ముచ్చెమటలు పట్టినై. వెంకుబాబు భయంకరమైన అబద్ధం ఆడేడు చాలా తేలికగా. పాపం నిర్మల మల్లెపూల కోసం యిచ్చిన డబ్బు కూడ ఖర్చు చేసి, పైగా నాకు యిచ్చేనని చెపుతున్నాడు. యీ సినిమా మానియా వుంటే ఎంతకైనా తెగిస్తారు. పచ్చి అబద్ధాలు కూడ అలవోకగా ఆడేస్తారు.

నిర్మల కాఫీ పట్టుకొచ్చింది. "బావున్నారా అన్నయ్యా" అంటూ. చిరునవ్వు నవ్వేను.

కాఫీ తాగేను. వెంకుతో చెప్పి బయటకు వచ్చేను. 'థాంక్సురా... వస్తా' అంటూ.

'థాంక్సు దేనికిరా....' అన్నాడు.

'నాకు అయిదు రూపాయలు యిచ్చినందుకు'

వాడు బిక్కమొహం పెట్టేడు.

బయటకు వచ్చి ఏలూరు కాలవ బ్రిడ్జి దాటి సెంటరులోకి రాగానే మల్లెపూల నరసమ్మ కనబడ్డది. రెండు రూపాయల మల్లెపూలు, మరువం, దవనం, కనకాంబరాలు ప్యాక్ చేయించుకుని తిరిగి వెంకు యింటికి వెళ్ళేను.

తలుపు తీసేడు. "అరే ... శీనూ... ఏమిట్రా మళ్ళీ వచ్చేవు. ఏమైనా మరచిపోయేవా... ఏమైనా సోఫాలో వదిలేసి వెళ్ళేవా ఏమిట్రా...." అన్నాడు.

నిర్మల కూడ వచ్చింది. "ఏమిటన్నయ్యా" అంటూ. "ఇదిగో చెల్లాయ్.. సెంటర్లో నరసమ్మ పూల కొట్టు తెరిచే వుంది. మల్లెపూలు, కనకాంబరాలు కొనాలనిపించింది.... తీసుకో..." అని యిచ్చేను.

నిర్మల మొహంలో వేయి చంద్రుల మల్లెల వెన్నెలలు పూసినై.

వెంకుబాబు మొహం అమావాస్య చీకటి... సరే పొద్దుపోయిందిరా.. మళ్ళీ

కలుద్దాం...వెళ్ళొస్తానమ్మా.....

బయటకు వచ్చేను.

వెంకుబాబు భలేవాడు.... డెవిల్ ఇన్ డిజ్‌గైజ్... అనుకున్నాను.

వెంకుబాబు!

.... డెవిల్ ఇన్ డిజ్‌గైజ్...

ప్రచురణ : నిర్మల ఏప్రెల్ 1974

• • •

●●●

# తుది పలుకులు

కమలాకాంత్‌గా అలనాటి తెలుగు పాఠకులకు చిరపరిచితులయిన శ్రీ సీతారామ శర్మ పుట్టి పెరిగింది గుంటూరు జిల్లా పల్లెకోనలో. ఇపుడు స్థిరపడింది ముంబాయిలో. ఎన్నో కవితలు, కథలు, నవలలతో ఆయన తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఈనాటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేకానేక సామాజిక సమస్యల గురించి ఆనాడే ప్రతిభావంతంగా వ్రాసిన దార్శనికుడు కమలాకాంత్.

పైగంబర కవులలో ఒకరిగా కమలాకాంత్ సమాజంలోని అసమానతలను వివరిస్తూ 1970వ సంవత్సరంలో కవితలను వ్రాశారు. అమితమైన మనస్తత్వ పరిశీలనా, అధ్యయనమూ, వ్రాసిన ప్రతి పదానికీ ప్రాణం పోస్తుంటే... భీరువుల వీపు తట్టి బ్రతుకు సమరపు పాఠాలు బట్టీ పెట్టించే కవిత కమలాకాంత్ స్వంతమంటూ డాక్టర్ పరుచూరి రాజారాం గారు యుగసంగీతం ముందు మాటలో చెప్పిన మాట అక్షర సత్యం. వివిధ పత్రికలలో వెలువడిన ఆయన కవితలను 'అసమబాహు త్రిభుజం' పేరిట వికాస ధాత్రి గతంలో ఇ-పుస్తకంగా ప్రచురించింది. కమలాకాంత్ కలం నుంచి వెలువడిన శాంతపెళ్లి, జీవితంలో మలుపు, ఆ కథ అంతే, మమత-మానవత, బొమ్మా బొరుసూ తదితర నవలలు, కథా సంపుటాలను డిజిటల్ పుస్తకాలుగా ప్రపంచ తెలుగు పాఠకలోకానికి వికాసధాత్రి.ఆర్గ్ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా అందించింది. దాదాపు నలభై సంవత్సరాల క్రితం ఆయన వ్రాసిన కథలతో ముగింపు లేని కథ, జీవన స్పర్శ కథా సంపుటాలను వికాస ధాత్రి ఇపుడు మీ ముందుకు తీసుకువచ్చింది.

గాలి ఉదయ కుమార్
వికాస ధాత్రి

●●●


కమలాకాంత్